# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సెప్టెంబర్
2023

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 16 **సంచిక:** 9

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
**రమేష్**



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ఆహ్వానము | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 8 |
| 'లీలా విగ్రహరూపధారి – కృష్ణం వందే జగద్గురు' | 20 |
| సాక్షి గోపాలం | 23 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 26 |
| సాక్ష్యం చెప్పిన అలమేలు మంగ | 32 |
| అభీష్ట ఫల ప్రదాయకుడు– శ్రీగణేశుడు | 36 |
| రామాయణ రత్నాకరం | 39 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 43 |
| వామన జయంతి | 49 |
| తిరుమల సర్వస్వం | 52 |
| అనంత పద్మనాభ వ్రతం | 55 |
| ముకుందమాల | 57 |
| శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము | 60 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# నామస్మరణ - బ్రహ్మాస్త్రము

ఈ సృష్టిని నడిపించేవాడు, జనన మరణాలకు కారణమైనవాడు భగవంతుడు. కాని ఆయన అదృష్యుడు. ఎవ్వరికి కనబడడు. ఆయన ఉన్నారనే విషయం సందేహాత్మకంగా ఉంటుంది. ఈ సృష్టిలో జరిగే ప్రతి పరిణామానికి మనమే కారణమనే దృక్పథం చాలా మందిలో ఉంటుంది. మరి కొందరు 'సైన్స్' ద్వారా మార్పు జరుగుచున్నదంటారు. కొందరు మాత్రమే ఏదో తెలియని శక్తి నడిపిస్తుందని నమ్ముతారు. ఈ భూమి మీద జన్మించిన ప్రతి వ్యక్తి తను అనారోగ్యం, జరామరణాలు ఉండకూడదనే కోరుకుంటారు. కాని ఇంతవరకు అనారోగ్యాన్ని గాని జరామరణాలను గాని ఆపలేకపోయారు. ఈ సృష్టిలో ప్రతి వ్యక్తి మరణించుట తథ్యం అయినప్పటికి 'నాకు మాత్రం మరణం రాదు' అనుకుంటారు. ఇదే గొప్ప వింత. ఈ సృష్టిని భగవంతుడు ఎందుకు రహస్యంగా నడిపిస్తున్నాడు? ఎందుకు కనబడడు? ఎందుకు మనతో దోబూచులాట ఆడుతున్నాడు. అంటే ఇది ఆయన ఆట, ఆయనిష్టం అనే సమాధానం దొరుకుతుంది. కాని సృష్టించబడ్డ ప్రతి వ్యక్తి సంతోషించుటకు పూర్తి ఏర్పాట్లను కల్పించాడు. సృష్టి ధర్మాలకు లోబడి జీవించువారిని అక్కున చేర్చుకుంటాడు. సంతోషమే ముఖ్యమని జీవించువారిని చీదరించుకుంటాడు. భగవంతుని ఉనికిని కనుగొనుటే మానవ ధర్మంగా మనకీ జీవితం లభించింది. జీవితమంటే భగవంతునితో ఆడుకునుటే. ఇది ఒక దోబూచులాట. భగవంతున్ని కనుక్కొని ఆయనను చేరుకొనుటే జీవితం యొక్క పరమ ధర్మం. భవవంతుడు లేడనే మాయను ఛేదించి అతనిని పట్టుకొనుటనే ఈ జీవితం యొక్క లక్ష్యం కావాలి. 'కలడు కలడనేవాడు కలడో లేడో' నుండి 'అందుకలడిందులేడని సందేహించని' స్థితికి చేరాలి. దీనిని సాధించి ముందుకు వెళ్ళితే ప్రతివారికి పరమాత్మ లభిస్తాడు. భగవంతున్ని త్రికరణ శుద్ధిగా నమ్మాలి. మన ఉనికికి కారణం ఆయననే భావం దృఢ పడాలి. చివరికి మనము ఆయన వారిమి, ఆయన మనవాడని విశ్వసించాలి. శరణాగతులమవ్వాలి. మన ప్రతి చర్య స్వామివారిని తృప్తిపరచుటకై ఉండాలి. ఆయన నామస్మరణ చేత ఈ రకమైన జీవితం అత్యంత అల్పులకు కూడా లభిస్తుంది. ఆయన నామం మహిమాన్వితమైనది. భవబంధాలను విడగొట్టి భగవంతుని దగ్గరకు చేర్చుతుంది. మనకున్న సర్వవ్యామోహాలను త్యజింపచేస్తుంది. కలియుగ మానవుడికి భగవంతుని చేర్చే బ్రహ్మాస్త్రము భగవన్నామము మాత్రమే. దీనిని విడువక జపించువారు ధన్యులు. ఈ భూమిపైన జీవించు ప్రతి వ్యక్తి సంతోషంతో పాటు ఎన్నో సమస్యలను ఎదుర్కొనుట సహజం. కాని ప్రతి సమస్య మనకో గుణపాఠంగా స్వీకరించాలి. మనలను భగవంతుని వైపు మళ్లించుటకు, జ్ఞానబోధ చేయుటకు భగవంతుడు కల్పించిన మలుపుగా భావించి ముందుకెళ్లువాడు ధన్యుడు.


కలియుగ మానవుడు తరించాలంటే తిరుమల శ్రీ వేంకటేశ్వరుని నామస్మరణే ఏకైక మార్గమని నమ్మి, ఈ నామాన్ని భక్తులందరికి చేర్చాలనే ఉద్దేశ్యముచే సం. 2002 నుండి స్వామివారికి ప్రతి సంవత్సరము 7 కోట్ల జపసమర్పణ చేయుచున్నాము. దీనికి ఉచిత జప పుస్తక పంపిణి చేస్తున్నాము. ప్రస్తుతము 21వ పర్యాయంగా 7 కోట్ల జపమును 7.9.2023 గోకులాష్టమి రోజు సమర్పించుచున్నాము. మా శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం తరపున జపపుస్తకాలలో నామం వ్రాసినవారినే కాకుండా, శ్రీవేంకటేశం మాసపత్రిక పఠించిన వారిని, నమో వేంకటేశాయ రథంకు నమస్కరించిన వారిని, శ్రీనివాస కళ్యాణాలలో స్వామిని స్మరించిన వారిని, మరే ఇతర పద్ధతులలో స్వామిని స్మరించిన ప్రతి భక్తుని అనుగ్రహించమని ప్రార్థిస్తూ మా వంతుగ జపహోమాలు నిర్వహించి స్వామివారిని ప్రార్థించుదుము. ఆయన కృపకు పాత్రులు కాగలరని విశ్వసించుచున్నాము.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో. తవ సుప్రభాత మరవింద లోచనే**
**భవతు ప్రసన్న ముఖ చంద్రమండలే ।**
**విధి శంకరేంద్రవనితాభి రర్చితే**
**వృషశైలనాథ దయితే దయానిధే ॥4॥**

తాత్పర్యం: తామరపూల వంటి కన్నులతో, చంద్రుని వంటి ప్రసన్న ముఖము గలదానా! సరస్వతి, పార్వతి, శచీదేవి మొదలగు దేవతాస్త్రీలచేత పూజింపబడుదానా! దయానిధీ! వేంకటేశ్వరుని భార్యయగు లక్ష్మీదేవి! నీకు శుభోదయమగు గాక!

విశే॥ దయానిధే దయకు నిధియైన దానా! ఈ దయామయి (లక్ష్మీదేవి) చేయు పురుషకారము వలన శ్రీనివాసుని యందు దయాగుణము పెంపొందుచున్నది. ఆశ్రితులయెడ ఫలించుచున్నది. వృషశైలనాథదయితే – వృషశైలము అను పేరు వేంకటాద్రికి నామాంతరము. కృతయుగంలో వృసుడని పిలువబడు ధర్మదేవత శేషాద్రిపై తపస్సు చేయుచుండగా ధర్మము అభివృద్ధి పొందినది. భగవంతుడు ప్రత్యక్షమై "వృషా! నీవు చేసిన తపమునకు లోకమున ధర్మము అభివృద్ధి పొందింది. కావున ఈ పర్వతమునకు నీ పేరుతో 'వృషాద్రి' అను ప్రఖ్యాతి గలుగును"అని వరమొసంగెను. ఆనాటి నుండి శేషాద్రి, వృషాద్రి అను పేరుతో ప్రసిద్ధమైందని వామన పురాణ కథనము.

వృషమనగా ధర్మము. ధర్మదేవత స్వాభివృద్ధి కొరకు ఈ పర్వతమున తపస్సు చేయుటచే వేదపారంగతులైన మునులు దీనిని 'వృషాద్రి' అని పిలిచిరని వరాహపురాణము వర్ణించింది.

వ్యాఖ్యానం: డా॥ సముద్రాల లక్ష్మణయ్య

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన
ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") ఉచితం

# ముక్తిమార్గము



## సామంతం

సకల భూతదయ – కచాలఁగఁ గలుగుట
ప్రకటించి దేహసం – భవమైన ఫలము ||పల్లవి||

1. తలకొన్న ఫలవాంఛఁ – దగులకుండఁగఁ జిత్త
మలవరించుట కర్మి – యైన ఫలము,
పలు కర్మములలోన – బ్రహ్మార్పణపు బుద్ధి
గలుగుట హరికృప – గలిగిన ఫలము ||సకల||

2 ఎప్పుడుఁ దిరువేంక – టేశు సేవకుఁ డౌట
తప్పక జీవుఁడు – దానైన ఫలము,
కప్పిన సౌఖ్య దుః – ఖమ్ములు సమముగా
నొప్పట విజ్ఞాన – మొదవిన ఫలము ||సకల||





భావము: శరీరము దాల్చినందుకు ముఖ్యప్రయోజనము సమస్త ప్రాణుల యందు మిక్కిలి దయగలిగి ప్రవర్తించుటయే. కర్మయోగము నాశ్రయించి పలు కర్మ లొనర్చుటకు ముఖ్యప్రయోజనము ఆ కర్మఫలములపై ఆశపడకుండ మనస్సును స్వాధీన పఱచుకొనుటయే. కర్మయోగిపై శ్రీహరికృప ప్రసరించినందులకు ఫలము ఆ కర్మఫలములను పరబ్రహ్మార్పణ మొనర్చు బుద్ధి యతనికి గలుగుటయే. తాను జీవుడైనందుకు ఫలము ఎల్లప్పుడు తప్పకుండ శ్రీ వేంకటేశ్వరునకు సేవకు డగుటయే. తనకు విజ్ఞానము గలిగినందుకు ఫలము సుఖదుఃఖముల యెడ సమభావ మలవడుటయే.

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

## PROGRAMME AT HYDERABAD

Date : **23-08-2023**
Venue : Namo Venkateshaya, Plot No. 9/3,
M.Block, Road No. 1. & 2, (1-2-63/10/1),
Kakatiya Nagar, Habsiguda, Hyderabad.
Time : 6.00 pm Onwards Vishnu Sahasra Nama Parayanam.

## PROGRAMME AT TIRUPATI

Date : **06-09-2023** Wednesday
Venue : Srivari Padal Mandapam, Near Alipiri, Tirupathi,
Time : 5.45 pm Starting of Pooja, Vishnu Sahasra Nama Parayanam, Submission of 21st Time 7 Crore Japam at Lotus Feet of Lord Sri Venkateshwara.

Date : **07-09-2023** Gokulashtami Day Thursday
Venue : Tirumala Tirupathi Devasthanam Dairy Farm, Chandragiri Road, Tirupathi.
Time : 8.00 am Starting of Pooja, Sri Venkateaswara Maha Mantra Yagnam & Vishnu Sahasra Nama Parayanam.
11.30am: Yagna Purnahuti by E.O., T.T.D.
12.00pm: Submission of 21st Time 7 Crore Japam in to Sri Venkateshwara Divya Maha Mantra Sthupam by Sri Dharma Reddy, I.A.S, E.O., T.T.D, Tirupathi.
At 12.20 pm : Initiation of 22nd 'SAPTHA KOTI JAPA SANKALPAM' by Executive Office , T.T.D., Tirupathi. Followed by Prasadam.

*Sri Venkateswara Pada Sevak*

**PULLAGURLA SAI REDDY**

**(GOVINDA DASU)**

*Founder and Organiser*


**Sri Venkateshwara Maha Mantra Peetham**

**93482 12354**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

ఏక వింశతి (21వ) పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# ఆహ్వానము





## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇ.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ,
హైదరాబాద్-500 007.

040 - 27175050 | 93482 12354, 93488 11223

# నమో వేంకటేశాయ

తిరుమలశ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములు, దివ్యాశీస్సులు అందరికీ లభించాలనే ఉద్దేశంతో, శ్రీవారి నామస్మరణలోని ఆనందమును అందరూ అనుభవించి తరించాలనీ, దానికి మేము ఒక సాధనముగా ఉపయోగ పడాలనే తపనతో ఆయనకు తనవితీరా సేవ చేయాలని, ఆయన సేవే మా పరమధర్మంగా భావించి శ్రీవారికి కోట్ల జప సమర్పణ సంకల్పంలో భాగంగా తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి **ఏక వింశతి (21వ) పర్యాయంగా** 7 కోట్ల జప సమర్పణ కొరకై తేది **23-08-2023** రోజున మా ఆఫీస్/ఇంటి నుండి 21వ పర్యాయంగా 7 కోట్ల జపము తిరుపతికి పంపుదుము. ఇట్టి జపమును టిటిడి వారి సౌజన్యంతో తేది **06-09-2023** నాడు తిరుపతిలో స్వామివారి పాదాలకు సమర్పించి స్వస్తిశ్రీ శోభకృతు నామ సంవత్సర శ్రావణ బహుళ అష్టమి గురువారం అనగా తేది **07-09-2023** గోకులాష్టమి రోజున ఎస్.వి.డైయిరీ ఫారం, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం చేసి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహా మంత్ర స్థూపము'లో స్వామివారికి సమర్పించబడును.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి
## కోట్ల జప సమర్పణలోని సంకల్పము

1. శ్రీ వేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట. వారందరినీ శ్రీవారి కరుణా కటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.
2. భక్తులు తమకోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామమును స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.
3. భక్తులలో శ్రీ వేంకటేశ్వర స్వామిపట్ల భక్తిని పెంపొందించి ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.
4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేల మంది భక్తుల కోరికలను తీర్చుమని శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.
5. 2002 నుండి ప్రతి సంవత్సరము 7 కోట్ల జపమును శ్రీ వేంకటేశ్వర స్వామికి సమర్పించుచూ 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'ను శ్రీవారి నామముతో నింపి శ్రీ వేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.
6. శ్రీ వేంకటేశ్వరుని నామము విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలక ధారణలోని ఆనందమును అనుభవించుట.
7. ఈ కార్యక్రమములో అందరు భక్తులు పాలుపంచుకునేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశము కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవచేయుచూ చిట్టచివరకు ఆ శ్రీ వేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.


**శ్రీ వేంకటేశ్వర పాద సేవకుడు**


**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

(వ్యవస్థాపకులు శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)

6వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..





## తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**


దిశ: సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు, తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 5వ భాగపు లీలల ప్రచురణ.

**(అగష్టు 2002 - అక్టోబర్ 2002)**

సం॥ 2002 నుండి హైదరాబాద్ వి.ఎస్.టి రోడ్డు విద్యానగర్‌లో, రోడ్డుకు 10 అడుగుల క్రింద మా ఆఫీసు ఉండేది. సం॥ 2007 మరియు 2009లో మూసినది పొంగటము వలన మా ఆఫీసు ఉన్న 'నాగమయ్యకుంట' ప్రాంతం పూర్తిగ నీటిలో మునిగిపోయింది. ఫలితంగా నా అనుభూతుల పుస్తకములు నానిపోయాయి. కొన్ని అనుభూతులు చదువుటకు వీలు పడని విధంగ ఉన్నవి. నేను చెప్పబోయె స్వామివారి లీలలు కూడ నానిపోయి చదువుటకు వీలు పడని స్థితిలో ఉంది, కాబట్టి ఆ లీల యొక్క లక్ష్యాన్ని మాత్రము చెప్పుచున్నాను.

గత రెండున్నర సం॥ల నుండి స్వామివారి లీలలను నేను మాత్రమే అనుభవించుచున్నాను. ఫలితంగ స్వామిప్రభావము నాలో అధికంగ ఉంది. నా భార్య సురేఖ నన్ను మొదటి నుండి పరిశీలించుచున్నప్పటికి ఆమె స్వయంగ స్వామి లీలలను అనుభవించలేదు. నా అంత ఆత్రుత, తపన ఆమెలో లేదు. ఈ లీలలో స్వామివారు నా భార్యను మార్చారు. నా అంతటి తపన ఆత్రుత కలిగే విధంగ చేసారు. కాని ఆ లీలలు నానిపోయి చదువలేని కారణంగ వివరించలేక పోతున్నాను. సురేఖకు కూడ ముందు భయముతో ప్రారంభమైన ఈ లీల తరువాత స్వామిపట్ల సంపూర్ణ శరణాగతురాలు అయ్యేట్లు చేసింది. క్లుప్తంగ ఆలీల ఈవిధంగ ఉంది.

శ్రీవేంకటేశ్వరుడు మాకు ఇష్టమున్న రంగాలలో సమస్యలను సృష్టించి, చివరికి వాటి నివారణకు సహకరించి, అత్యంత ఆప్తుడైనాడు. ఈలీలలో ఆమెకు ఇష్టమున్న కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు సృష్టించబడ్డాయి. దీనికి తోడు ఆమె నిద్రించునప్పుడల్ల భయంకర స్వప్నాలు

రాసాగాయి. ఫలితంగ తను మానసిక సంతులన కోల్పోయింది. దీని ద్వార నాకు శ్రీవేంకటేశ్వరుని స్మరణలో, ఆయనకు ఇష్టంగ సేవచేయాలనే కోరికకు అంతరాయమేర్పడింది. నీవు శ్రీవేంకటేశ్వరున్ని వేడుకొమ్మనే నా మాటను మొదట్లో సురేఖ పెడచెవిన పెట్టింది. కలలు యాదృచ్ఛికము కావని, వాటిని నమ్ముమనే నా మాటను వినలేదు. ఫలితంగ రోజు రోజుకు మరింత మానసిక సంతులన కోల్పోయింది. ఈ స్వప్నాల ప్రభావము వలన నిద్రించుట మానేసింది. శరీరం బరువెక్కింది. జీవితం ఆందోళనకరంగ తయారైంది. దీనిని గ్రహించి సురేఖకు ఎన్నో చెప్పాను. శ్రీవేంకటేశ్వరున్ని శరణు వేడమన్నాను. ఒక్కసారి నామాట వినుమన్నాను. దీనికి తోడు శ్రీవేంకటేశ్వరుని కొన్ని లీలల ద్వార ఆయనపై అమితమైన ప్రేమ ఏర్పడ్డది. ఏదో సాధించుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను ఉపయోగించుకుంటున్నాడనే నా మాటపై సురేఖకు విశ్వాసం ఏర్పడింది. అలసి పోయింది కాబట్టి నేను చెప్పినట్లు వింటానన్నది. తేది 25-08-2002 వరకు పూర్తిగ మారిపోయింది. స్వామివారిని తృప్తిపరచుటకు ఏమని ప్రార్థించాలి అనే విషయమై నన్నడిగింది. నా మనసులో వచ్చే ఆలోచన ప్రకారం నేను ప్రార్థిస్తాను. నీవు కూడ ప్రార్థన సమయములో నీ మనసులో వచ్చిన ఆలోచన ప్రకారం ప్రార్థించమన్నాను. మరియు నా భార్యకు ప్రార్థన సమయాన తగిన అభిప్రాయము కలిగించమని శ్రీవేంకటేశ్వరున్ని నా తరపున వేడుకున్నాను. అలా ఎన్నో రోజుల నుండి మా జీవితంలో సాగుతున్న తుఫాను అనే ఈలీల పక్వస్థితికి వచ్చింది.

**పూర్వాంగనం:** అప్పటికే మేము తిరుపతిలో స్థూప నిర్మాణమునకని భూమి పూజ చేసి వచ్చాము. తిరుపతిలో స్థపతి దొరకనందున పనులు నిదానంగ జరుగుచున్నవి. శ్రీవేంకటేశ్వరుడు బహుశా తాను ప్రసరించుచున్న లీల పక్వదశకు వచ్చిందని భావించాను. మరోప్రక్క మమ్ములను రక్షించుటకు సిద్ధపడ్డాడు. ఈ రోజు రెండు కలలను ప్రసాదించారు. ఈ కలల అంతరంగం ఎంతో అద్భుతంగ భవిష్యత్తును సూచించే విధంగ ఉంది. ఈ రెండు కలలు ఒకటి నాకు మరోటి కీ.శే. శ్రీ గవర్రాజు గారికి వచ్చాయి. ఈ రెండు కలలు ఈ విధంగ ఉన్నాయి.

**26-08-2002 నాకు వచ్చిన కల :** ఇందులో నేను శ్రీవెంకటేశ్వర డైరీఫాంలో స్థూపాన్ని నిర్మించాలని అక్కడికి వెళ్ళాను. ఒక స్థలములో మేస్త్రీ ముగ్గు పోసి ఉన్నాడు. నన్ను దానిని చూచి చెక్ చేయమన్నాడు. డైరీఫాం డైరెక్టర్ శ్రీమాన్ కొండారెడ్డి గారు నా పక్కన ఉన్నారు. నేను దానిని చూచి బాగుందన్నాను. కాని ఆ మేస్త్రీ నాకు వేరే ఒక ప్లాన్‌ను చూపి (క్రింద చూపిన విధంగ) ఇది బాగుంటుంది కదా! అని అన్నాడు. నేను మాత్రం డబ్బులు ఎక్కువైనా పరువాలేదు స్థూపము చాల బాగుండాలన్నాను. చివరికి వారందరు ఇక ఈ స్థూపము పనులు చకచక జరుగును చూడండి అని అన్నారు.

**కలలో మేస్త్రీ చూపిన ప్లాన్ (స్టార్ ఆకారంలో ఉంది. ✡)**

ఇది నాకు వచ్చిన కల. దీనర్థం ఇప్పటినుండి స్థూపపనులు ఏ ఆటంకం లేకుండ జరుగునని అర్థం.

ఇది ఈ విధంగ ఉండగా 26-08-2002 రోజున ఉదయం 10.00 గం॥ల ప్రాంతమున శ్రీ గవర్రాజు గారు నాకు ఫోన్ చేసి తనకు రాత్రి కల వచ్చిందన్నారు.

**కల :** ఈ గవర్రాజు గారి కలలో, తిరునామాలతో ఒక అయ్యవారు వచ్చారట, ఆయన నన్ను వెంటనే తిరుపతికి పోమ్మని చెప్పారట. ఆయన అక్కడ స్థూపము కట్టుటకు మనుషులను సిద్ధంగా ఉంచాడట. మరియు ఈ ఆలస్యమునకు కారణము వేరేది ఒకటి ఉన్నదని, సాయిరెడ్డిని మాత్రం తొందరగ తిరుపతికి ప్రయాణము కమ్మని ఇది నేను చెప్పినానని సాయిరెడ్డితో చెప్పు అని అన్నాడట శ్రీగవర్రాజు గారు తన కనుల పొంటి నీరు కారుచుండగ ఒళ్ళు కంపించుచు గద్గద స్వరముతో నాతో చెప్పారు. ఈ కలను బలపరుస్తున్నట్లు. ఈ రోజు ఉదయము తిరుపతి నుండి శ్రీ కొండారెడ్డి గారు ఫోన్ చేసి తిరుపతిలో పనులు సరిగ కావటములేదు. కొత్త స్థపతి సిద్ధంగ ఉన్నారు. సాయిరెడ్డిని రేపే పంపండి అని ఫోన్‌చేసి చెప్పారట. ఈ విషయమును నేను మరియు నా భార్య వినగానే నివ్వెరపోయాము, ఆశ్చర్యపోయాము. మా సురేఖ నన్ను వెంటనే తిరుపతికి వెళ్ళమని చెప్పింది. అవసరమైతే కొన్ని రోజులు ఉండి స్థూప నిర్మాణము పూర్తిచేయమన్నది.

శ్రీగవర్రాజు గారు ఉదయం 11.30 ప్రాంతమున స్వయంగ మా ఇంటికి వచ్చి అత్యంత ఆత్రుతతో గద్గద స్వరములో ఒళ్ళు కంపించుచుండగ మళ్ళీ ఇదే విషయమును మా ఇద్దరి ముందు చెప్పాడు. నా కారణంగ రెండుసార్లు స్వామివారిని దర్శించే భాగ్యం కలిగిందన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. ఆ వచ్చిన అయ్యవారు చాల ఆత్మీయంగ మాట్లాడాడు. ఈ కట్టబోవు స్తూపము పేరుపైన ఒక సంస్థ భవిష్యత్తులో ఏర్పాటు అగునట. మంచి పేరు సంపాదించునట అని చెప్పుచు ఈ విషయాలు ఇప్పుడు నీకు అవసరము లేదు అని కూడ అన్నారట. ఈ గవర్రాజు గారి కల మా సురేఖపైన చాల ప్రభావము చూపింది. ముఖ్యంగ నేను శ్రీవెంకటేశ్వరునికి ఎంతో ప్రియమైన వాడిననే నమ్మకము కలిగింది. నేను నిన్న రాత్రి చెప్పినట్లు మా చేత ఏదో సాధించుటకు ఈ పనులు స్వామివారు చేయించుచున్నారని స్పష్టంగా అర్థం చేసుకుంది. అంతే కాకుండ నేను ఇంతవరకు చెప్పిందంత

నిజమేనని, అదంతా ఏదో సాధించుటకు స్వామివారి లీల అని దృఢంగ నమ్మింది. నాపై పూర్తి విశ్వాసము కలిగింది. తేది 26-08-2002 మధ్యాహ్నము, సురేఖలో చక్కని మార్పు కనబడ్డది. దీనిని చూచి నేను నా స్వామిని మరిమరి వేడుకొనుచు మీరు నిజంగ ఆపద్బాంధవులు, ఈ జగమంతటా ప్రతిక్షణం చూస్తున్నారు ప్రభూ! నా గురించి ఇంత పని చేసారా? అని అనుకున్నాను. అసలు స్వామి వారికి ధన్యవాదములు ఏవిధంగ చెప్పాలో తెలియలేదు. ఈ రోజంతా సురేఖ పశ్చాత్తాపం చెందింది. స్వామివారికి అత్యంత ఇష్టుడైన నన్ను నొప్పించానని, స్వామివారి సేవలో ఆటంకం కలిగించానని బాధపడ్డది. మొత్తం మీద ఈలీలలో మా శేషజీవితం స్వామివారికి అంకితం అనే దృఢాభిప్రాయం మా ఇద్దరిలో ఏర్పడ్డది.

## సురేఖను కట్టడి చేయుట

తేది 27-08-2002 రోజున వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకుని తిరుపతికి పోవుచున్నాను, తేది 28-08-2002 రోజున ఉదయం 8.00 గం॥లకు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఉన్నాను. 8 AM కు ట్రైన్ రేణిగుంట నుండి తిరుపతికి బయలుదేరింది. 8.05కు నాకు గాఢ నిద్రవచ్చింది కూర్చుండియే నిద్రలోనికి జారుకున్నాను.

కల : ఈ లీలలో ఒక అజ్ఞాత భక్తుడు స్వామివారిని దీనాతిదీనంగా ప్రార్ధిస్తున్నట్లు వినబడ్డది "ఓం నమో వెంకటేశాయ!!... ఓం నమో వెంకటేశాయ" అను శబ్దము ఎక్కడి నుండో వస్తుంది. ఇది చూచుటకు ఒక భక్తుడు అత్యంత దీనావస్థలో స్వామివారిని క్షమించమని వేడుకున్నట్లుగ ఉంది. ఎంత దీనావస్థ అంటే నా హృదయం ద్రవించింది. వెంటనే అంటే ఆ లీలలోనే నా స్వామివారిని వేడుకున్నాను. ఆ భక్తున్ని కరుణించమని వేడుకున్నాను. మళ్ళీ గం॥8.25కు తిరుపతి వచ్చింది నిద్రపోయి మెళకువ వచ్చింది. కల చెదిరింది. నేను ఈ చిత్రమును చాచి ఆశ్చర్యపోయాను. అసలు ఈ భక్తునికి నాకు సంబంధం ఏమిటి అని ఆలోచించాను. చివరికి శ్రీవెంకటేశ్వరుని లీలను అర్ధంచేసుకొను శక్తి లేదని ఊరుకున్నాను. చిత్రమేమిటంటే సరిగ్గా అదే సమయములో, ఉదయం 8.05 నుండి 8.25 వరకు నా భార్య మా ఇంటిలో పూజా మందిరమునకు వెళ్ళి నా వలన సాయిరెడ్డి మనస్సు బాధ కలిగింది. దీనితో మీ పనికి కొంత అంతరాయము ఏర్పడింది. దీనికి నన్ను క్షమించు అని కోరుకున్నదట. స్వామిని 'ఓం నమో వెంకటేశాయ' అంటూ పలుమార్లు వేడుకున్నదట. అంతే కాకుండ నేను సాయిరెడ్డి మాటలను విశ్వసించలేదు, అవమానించాను అందుకు క్షమించమని ప్రార్ధించిందట. **"ఇక నుండి ఈ జీవితాంతం వరకు సాయిరెడ్డి ప్రతి మాటకు విలువనిచ్చి దాని ప్రకారం నడుచుకుంటాను. ఆయన మాటకు అడ్డురాను, ఇతరుల మాటలను పట్టించుకోను, పూర్తిగ సహకరిస్తాను. ముఖ్యంగ అది శ్రీవెంకటేశ్వరుని మాట అనిగాని, సేవ అనిగాని అయినప్పుడు మరీ జాగ్రత్తగ ఉంటాను, చెప్పినట్లు వింటాను ఎదురుతిరగను"** అని స్వామివారి పైన ప్రమాణము చేసిందట. తేది 28-08-2002 రాత్రి 9.30కు ఫోన్ చేసి సురేఖతో నేను మాట్లాడుచున్నప్పుడు నాకు రెణిగుంటలో జరిగిన సంఘటన గురించి చెప్పాను. అప్పుడు ఆమె తను ఆ సమయాన స్వామిని దీనంగ వేడుకున్న విషయం భవిష్యత్‌లో నా మార్గానికి అడ్డురానని, సహకరించుదునని, ప్రమాణం చేసిన మొత్తం విషయం నాతో చెప్పింది. స్వామివారిని దీనాతిదీనంగా ప్రార్ధించిన భక్తురాలు నా భార్య సురేఖనేనని ఇద్దరము నిర్ణయించుకున్నాము. ఈ విధంగ తిరుమల శ్రీవెంకటేశ్వరుడు ఈ లీలతో నా భార్యను నేను చెప్పినట్లు వినుచు, ఎలాంటి అడ్డుచెప్పకుండ సహకరించునట్లు కట్టడిచేసాడు. ఈ విధంగ నేను, నా భార్య ఇద్దరము స్వామివారి సేవ చేయుటకు అత్యంత ఆర్తితో ఉన్నప్పుడే తిరుపతి పొలిమేరలోనికి ప్రవేశించాము. ప్రవేశించుటకు స్వామి అనుమతించారు. ముందు తేది 14-07-2002 నాడు నేను మాత్రమే స్వామి సేవకై ఆర్తితో ఉన్నాను నా భార్య లేదు కాబట్టి తగిన పనివారు దొరకలేదనే నెపముతో స్వామి సేవలో ఆటంకమేర్పరచారు. కాని తేది 26-08-2002 రోజున వచ్చిన లీలలో ఆటంకము తొలిగిపోయిందని, ఇక స్థూప పనులకు ఏలాంటి ఆటంకాలు లేకుండ చక్కగ జరుగునని కూడ తెలిపారు. ఇలా మేమిద్దరము తిరుమల శ్రీవెంకటేశ్వరుడు చూపు లీలల ప్రకారము నడుచుకుందుమని ప్రమాణం చేసిన తరువాత స్వామి సేవాభాగ్యం లభించింది.

శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ ప్రకారం తేది 28-08-2002 నుండి 5 రోజులు, 01-09-2002 వరకు తిరుపతిలో దగ్గరుండి స్థూపనిర్మాణ పనులను చేయించాను. ముందు బావిలాగ ఒక గొయ్యి త్రవ్వి చుట్టూ బేస్‌మెంటు మరియు బ్రిక్కువర్క్ వరకు పూరించాము. మిగతా పనిని అక్కడి మేస్త్రీకి చెప్పి రోజు నేను ఫోన్‌లో మాట్లాడెదనని చెప్పి తిరిగి హైదరాబాద్ వచ్చాను. కాని తేది 06-09-2002 నాడు మళ్ళీ కొండారెడ్డిగారు తిరుపతి నుండి ఫోన్ చేసి పనులు సరిగా జరుగత లేవు. పనివారు సరిగా చేయుట లేదు నీవు రావలసిందని అన్నారు. నేను వెంటనే 07-09-2002 నాడు తిరుపతికి వెళ్ళాను. మనస్ఫూర్తిగ స్థూపనిర్మాణ పనులను చూచుకొంటున్నాను. వినాయక చవితి రోజున అనగా 10-09-2002 నాడు నేను తిరుపతిలో ఉండి ఉదయం శ్రీకపిళేశ్వర ఆలయమునకు

పోయి వినాయకునికి మరియు శివునికి చేయు అభిషేకమును చూచాను. తిరిగి ఆ రోజు శ్రీకొండారెడ్డిగారు ఇంటికి భోజనమునకు ఆహ్వానించినను వెళ్ళక తిరుమల కొండపైకి వెళ్ళి స్వామివారిని దాదాపు 25 ని॥లు దర్శించుకున్నాను. నన్ను ఎవ్వరు కూడ బయటకు వెళ్ళమని అనలేదు. బహుశా స్వామివారు నన్ను అదృశ్యరూపునిగ తన గర్భగుడిలో పెట్టుటచే అంతసేపు దర్శించుకున్నానని భావించాను. చివరికి నేనే వేరేవారికి స్వామిని దర్శించుటకు వీలు కల్పించాలని తలంచి బయటకు వచ్చాను. ఈ సారి స్వామివారిని చూచినప్పుడు తృప్తిచెందాను. స్వామివారు సకల ఆభరణాలతో ఉన్నారు. వారి అభయహస్తము నుండి కాంతి కిరణాలు చకచకమని నావైపు వచ్చుటను నేను బహు బాగా చూచాను. ఆ కాంతికిరణాలు నా మనస్సులో ఎప్పటికి చెదిరిపోని విధంగ ముద్రించుకున్నవి.

తెల్లవారి ఉ॥ 9.30 నుండి తిరిగి స్థూపపనులు చిత్తశుద్ధితో చేస్తున్నాము. ప్రతిక్షణము ఆ శ్రీహరినే స్మరిస్తున్నాను. సాయంత్రము 7 P.Mకు పని విరమించగానే హోటల్‌కు పోయి స్నానము చేసేవాడిని తిరిగి సాయంత్రము 8 గం॥లకు అలిపిరి దగ్గరున్న స్వామివారి పాదాల మండపమునకు పోయేవాడిని స్వామి పాదాలపై పడి స్మరించుచు ఏడ్చేవాడిని అక్కడే ఒక గంటన్నర సమయము గడిపి 10.30కి హోటల్‌కు పోయి పడుకునేవాడిని. ఈ విధంగ స్థూపనిర్మాణ పనులు స్వామి కృపతో అత్యంత వేగంగ చక్కగ జరుగుచున్నవి. ఇలా ఒక వారము రోజులు తిరుపతిలో స్థూపనిర్మాణ పనులను చూచుకొన్నాను. చివరికి తేది 13-09-2002 సాయంత్రము బయలుదేరి తేది 14-09-2002 నాడు హైదరాబాద్ వచ్చాను. మా ఇంటిలో భార్యను, పిల్లలను చూచాను. అందరు సుఖంగానే ఉన్నారు. స్వామివారికి ధన్యవాదములు తెలుపుకున్నాను. సురేఖను మార్చిన లీల ఒక భయము ఒక సంతోషము కలిపి మా జీవితంలో మరచిపోలేని విధంగ చేసింది. దీని ద్వార స్వామివారు తనకు కావలసింది నెరవేర్చుకున్నారని అనుకున్నాను. ఇక భయము లేదని, మా సురేఖ మానసికంగ చక్కగ ఉన్నదని నమ్మి సంతోషంగ ఉన్నాము. కాని ఆ తుఫాను నుండి భయంకరమైన సుడిగుండం పుట్టుకొస్తుందని ఊహించలేక పోయాము.

## సుడిగుండం పుట్టుట, జీవితానికి విధివిధానాలు విధించుట

అప్పుడు మేము దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనిలోని వెంకటగిరి రెసిడెన్సీ అనే అపార్టుమెంటులో 4వ అంతస్థులో ఉంటున్నాము. ఆ రోజు రాత్రి భోజనము చేసి దాదాపు 10.0 గ॥ల వరకు టి.వి ముందు మేమిద్దరము కూర్చొండి నవ్వుచు మామూలుగానే ఉన్నాము. మా పిల్లలు పడుకున్నారు. నేను తిరుపతిలో ఒక వారం ఉన్నాను కాబట్టి అలసిపోయాను. నాకు నిద్రవస్తుంది. దాదాపు గ॥ 10.30 ని॥లకు బెడ్‌రూంలోనికి వెళ్ళి పడుకున్నాను. అలసిపోయాను కాబట్టి వెంటనే గాఢనిద్రలోనికి జారుకున్నాను. నాకు మధ్యలో లేచే అలవాటు కూడ లేదు. కాని నన్ను ఆ రాత్రి ఎవ్వరో దాదాపు 11.30 కు లే... వుమంటు అత్యంత గట్టిగ పైన చెత్తు ఎగిరిపోయేటంత గట్టి శబ్దము చేస్తు లేపారు. ఈ శబ్దానికి ఉలిక్కిపడి లేచాను. ప్రక్కన చూచాను సురేఖ లేదు. బెడ్‌రూం తలుపు, బెడ్‌రూంకు ఉన్న బాల్కనీ తలుపు తీసి ఉంది వెంటనే అనుకోకుండ బాల్కనివైపు వెళ్ళాను. అక్కడి దృశ్యాన్ని చూచి భయముతో వణికిపోయాను. చూచేసరికి సురేఖ ముఖము సింహములాగా ఉంది. ఆమె ఈ క్షణము తనకు ఆఖరు క్షణములాగ భావించింది. అప్పుడు ఆమె బెడ్‌రూం బాల్కనీ రేలింగు ఎక్కి ఆత్మహత్య చేసుకొనుటకు క్రిందికి దూకపోవుచున్నది. నేను వెళ్ళి ఆమె చేయి పట్టి లోనికి గుంజి ఆపాను. ఒక్క సెకను ఆలస్యమైనా ఆత్మహత్య చేసుకునేది. ఆమె ఎగపోయుచున్నది. మనిషిలాగ లేదు. ముఖము సింహంలాగ ఉంది. పూనకము వచ్చిన దానిలా భయంకరంగ ఉంది. తనకు, ఈ ప్రపంచమునకు ఎలాంటి సంబంధము లేనిదానిగా ఉంది. ఆమె ముఖమును చూడగానే భయం వేసింది. ఆమె ముందు హాలు బాల్కనీలో నుండి క్రిందికి దుంకుటకు ప్రయత్నించిందట. కాని క్రింద కొన్ని చెట్లు ఉండుట వలన అక్కడ దూకుతే ఆ చెట్లు తాకి ప్రాణంపోదని గ్రహించి ఈ బెడ్‌రూం బాల్కనీని ఎంచుకున్నదట. కాని స్వామివారు నన్ను ఆ క్షణములో లేపి ఏమికాకుండ చేసారు. నేను ఈ పరిణామమునకు భయముతో వణికిపోయాను. అసలు ఏమి జరుగుతుంది? ఎందుకు జరుగుతుందో తెలియదు. చాల సేపు భయముతో వణికిపోయాము. ఈలోగ సురేఖ కొంత తేరుకున్నది. ఎందుకిలా చేసావని అడిగాను. అందుకు ఆమె ఏమో నాకు తెలియదు నా మనస్సులో ఏదో అయ్యింది సడెన్‌గా నాకు ఏదో గుర్తుకొచ్చి ఇక ఈ జీవితము వద్దనిపించింది. అందుకే ఇలా చేసానన్నది. మరి నీవెలా లేచావన్నది. ఒకసారి నిద్రపోతే మధ్యలో లేవవు, నిన్ను ఎవ్వరు లేపలేదు కదా, ఏలా లేచావన్నది. ఎవ్వరో లేపారనే నా జవాబుకు ఆమెకూడ ఆశ్చర్యపోయింది. మరియు ఆమె మానసికంగా బాగానే ఉన్నది. అందులో సందేహంలేదు. కాని ఈ ఘటన ఏలా జరిగింది? ఎందుకు జరిగింది? తెలియదు, నా సేవలో ఏమైన లోపం జరిగిందా? అని పరిపరివిధాలుగ ఆలోచించాను. నాకు తెలిసి ఎక్కడా లోపం కనబడలేదు. అత్యంత భక్తిశ్రద్ధలతో చిన్నపాటి తప్పు జరుగకుండ తిరుపతిలో స్థూపనిర్మాణం చేస్తున్నాను. మరింత డబ్బు ఖర్చు పెట్టి అత్యంత

సుందరంగ స్థూపనిర్మాణము జరగాలనే ఉద్దేశ్యముతోనే ఉన్నాను తప్ప డబ్బు విషయంలో కక్కుర్తి పడుటలేదు. ప్రతిక్షణం స్వామివారిని స్మరిస్తూ కాలం గడుపుచున్నాను. లోపం ఎక్కడో తెలియలేదు. చివరికి ఒక రెండు గంటలు మాట్లాడి అంతా సర్దుకున్న తరువాత తిరిగి పడుకున్నాము.

తెల్లవారి ఈ విషయమై తీవ్రంగ నాలో నేను చర్చించుకున్నాను. రోజు మొత్తం ఆలోచించాను. సురేఖకు హాని జరిగేవిధంగ చేసాడు కాని మళ్ళీ నాచే రక్షింపచేసాడు. ఈ రెండు పనులు స్వామివారే చేసారు. చివరికి ఇది నన్ను మార్చుటకేనేమో అనే ఒక ఆలోచన వచ్చింది. ఎందుకంటే నా భార్యకు ఏమైన జరుగుతే నష్టం నాకే కాబట్టి నన్ను మార్చుటకే ఈ విధంగ జరిగిందనిపించింది. కాని ఏం మారాలి? తెలియదు, ఆరోజు ఇంటికి పలుమార్లు ఫోన్ చేసి నా భార్య ఎలా ఉందో తెలుసుకున్నాను. నేను ఆఫీసులో కాని వర్కు దగ్గరకాని ఉన్నప్పుడు మనస్సు ఇంటిపైననే ఉంది. ఈ సంఘటన మళ్ళీ జరుగకూడదని స్వామివారిని ప్రార్థిస్తున్నాను. నా నుండి స్వామివారు ఏమి ఆశించుచున్నారని పరిపరివిధాలుగ ఆలోచించుకున్నాను. మార్గం సూచించమని, నేను దేనికైన సిద్ధం అని స్వామివారిని ప్రార్థించాను. ఆ రోజు మధ్యాహ్నం ఇంటిలో భోజనం చేసి కూర్చొన్నాము.

ఉన్నటుండి సురేఖ తన ప్రవర్తనను మార్చుకుంది. నావైపు సింహంలా చూస్తుంది. హూంకరిస్తుంది. పూర్తిగ మరో ప్రపంచములో ఉంది. తాను ఏమిచేస్తుందో తనకు తెలియుట లేదు. ఆమె ఆకారాన్ని, హూంకరించుటను చూచి భయపడ్డాను. రాత్రి కంటే రెట్టింపు కోపంతో రెట్టింపు వేగంగ ఉంది. మేము మధ్యాహ్నము పండ్లు కోయుటకు పెట్టిన ఒక కత్తి ఆమెకు దగ్గరలో ఉన్నది. సురేఖ నావైపు పిచ్చిపిచ్చిగ చూచుచు, హూంకరిస్థుంది. ఆ కత్తిని తీసుకొని తన కడుపులో బలంగ పొడుచుకొనుటకు ప్రయత్నించింది. ఈ పరిణామానికి వణికిపోయాను. పరుగెత్తి ఆమె చేతిలోని కత్తిని లాక్కున్నాను. ఆమె కనుగుడ్లు పెద్దగ చేసి హూంకరించుచు, నా వైపు చూచింది. ఆమె తన తలను ప్రక్క గోడకు కొట్టుకొనుటకు సిద్ధంగ ఉన్నదని ఆమె చూపు ద్వార గ్రహించాను. ఏమి చేయాలో తెలియలేదు. వెంటనే శ్రీవేంకటేశ్వరున్ని శరణు వేడాను, క్షణం ఆలస్యం చేయకుండ రక్షించమని దీనాతిదీనంగ వేడుకున్నాను. మీకు కావలసింది ఇచ్చుటకు సిద్ధంగ ఉన్నానన్నాను. చివరికి నా మనస్సులో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. స్వామివారికి నానుండి ఏమి కావాలో కోరుకొమ్మంటు ఒక్కొక్కటి అడుగుచున్నాను. నేను నా జీవితంలో ఏ తప్పుచేయకుండ ధర్మబద్ధంగ నడుచుకుంటానన్నాను. వెంటనే సురేఖలో కొంత మార్పు కనబడ్డది. హూ... అంటూ ఆగిపోయింది. రెండు సెకండ్లు ఆగి మళ్ళీ మొదటికొచ్చింది. ధర్మబద్ధ జీవితంతో పాటు మరేదో కావాలని స్వామివారు కోరుకుంటున్నారని అర్థంచేసుకున్నాను. ఉగ్రరూపంలో ఉన్న నరసింహస్వామిని బ్రహ్మాదిదేవతలు రకరకాలుగ శాంతింపచేయుటకు ప్రయత్నించినట్లు నేను ప్రయత్నించాను. నాకు తెలిసిన అన్ని సదాచారాలను బట్టీపట్టినట్లు చదువుచు, ఏ సదాచారం చదివినప్పుడు సురేఖ ముఖములో మార్పు కనిపిస్తుందో దానిని గుర్తుపెట్టుకొనుచు, ముందుకెళ్ళాను. స్వామివారు ఒప్పుకున్న వాటిలో అత్యంత ప్రధానమైనవి మేము ధర్మబద్ధంగ జీవించుట. ఎలాంటి ఆర్భాటాలు లేకుండ అత్యంత అల్పునిగ జీవించుట, మొదలగునవి. జీవితాంతం సేవ చేస్తానన్నాను. కాని ఇంకా శాంతించుటలేదు. డబ్బులకు వెరవక మీ సేవలో ఎలాంటి లోపము రానీయనన్నాను. కాని శాంతించ లేదు. మరేదో తెలియంది కావాలనిపించింది. చివరికి మీరే చెప్పండి ప్రభూ! అని దీనంగ వేడుకున్నాను. వెంటనే **'వ్యాపారం వద్దు' నీవు 'చేయలేవు'** అనే భావన మనసుకు వచ్చింది. ఆ సమయంలో ఉగ్రరూపములో ఉన్నారని గ్రహించి వెంటనే భయంతో సరే అని ఒప్పుకున్నాను. ఆ తరువాత సురేఖ శాంతించింది మాములుగ మారిపోయింది. ఈ విధంగ ఎందుకు జరుగుచున్నది? అసలు స్వామివారికి ఏమి కావాలి? అనేది ఆశ్చర్యమేసింది. మిమ్మల్ని సదా స్మరించుచు, మీ సేవలో డబ్బుకు వెరవను అన్నా వినలేదు పైగ వ్యాపారము వద్దన్నాడు. ఈ విచిత్రమైన కోరిక నన్ను ఆశ్చర్యములో పడేసింది. మరోప్రక్క భయము ఆవహించింది. కాళ్ళు చేతులు వణుకుచున్నవి ఏమిచేయాలో తోచలేదు.

ఆ తరువాత నాది నేను ఇలా ఆలోచించాను. వ్యాపారం చేయకుంటే ఎలా జీవించాలి. నీవు వ్యాపారం "చేయలేవు" అని అన్నారు ఈమాట నాకు ఆశ్చర్యమేసింది. ఇప్పుడు తిరుపతిలో స్థూపం కడుతున్నానంటే ఆ డబ్బును నేను వ్యాపారంలో సంపాదించిందే అని నా మనసులో నేను అనుకున్నాను. కాని భయముచే వెంటనే ఈ విషయము స్వామివారికి తెలువకుంటే బాగుండుననుకున్నాను. భయపడ్డాను. వ్యాపారం చేయలేవు అనే దానికి అర్థం-నీవు వ్యాపారం చేసినట్లైతే నేను చేయనివ్వనని అర్థం. చివరికి ఆరోజు గడిచింది. ప్రశాంతంగ ఉన్నాము. తెల్లవారి మళ్ళీ నా మనస్సులో వ్యాపారం చేయాలని కోరిక పుట్టింది. దీనిని గ్రహించి మళ్ళీ సురేఖ హూంకరించుట మొదలు పెట్టింది. కనుగుడ్లను త్రిప్పుచు భయపెడుతుంది. మళ్ళీ ఏదో అఘాయిత్యము చేసుకొనుటకు సిద్ధంగ ఉన్నట్లు అనిపించింది. ఇది నన్ను మార్చుటకు శ్రీవేంకటేశ్వరుని లీలనే అని దృఢ విశ్వాసము ఏర్పడ్డది. ఒకరకంగ స్వామివారు

సురేఖను ఆవహించి ఈపని చేయుచున్నారని గ్రహించాను వెంటనే శ్రీవేంకటేశ్వరుని శరణువేడాను. భోరున విలపించాను. క్షమించమని వేడుకున్నాను. గజగజ వణికిపోయాను. చివరికి ప్రార్థనాపూర్వకంగ ఇలా అన్నాను "ప్రభూ! నేను మీభక్తున్ని, మీరు నన్ను భయపెట్టుచు చెప్పవలసిన పనిలేదు. మీరు ఆజ్ఞాపిస్తే దేనికైనా సిద్ధం." అని వేడుకున్నాను. నేను భయపడుచున్నాను, దయచేసి శాంతించమన్నాను. ఈ జీవితంలో మీరు చెప్పింది చేస్తానన్నాను. ప్రమాణం చేసాను. సదా మీ వాడిగ జీవించుదునని పదేపదే చెప్పాను. సాష్టాంగ నమస్కారము చేసి వేడుకున్నాను. చివరికి ఒక విన్నపము ప్రభూ అంటూ నా కోరికను చెప్పాను. "నేను అత్యంత దీనావస్థలో హైదరాబాద్ వచ్చాను. పిల్లలు చిన్నవాళ్ళు, వారికి విద్యాభ్యాసము చేయించవలసి ఉంది, మరియు నాకు వ్యాపారమంటే ఇష్టము కాబట్టి మా కుటుంబ పోషణార్థమై కొన్ని రోజులు వ్యాపారానికి అనుమతించండని వేడుకున్నాను. వెంటనే **"కేవలం కొన్ని రోజులు మాత్రమే అది కూడ మీ కుటుంబ పోషణార్థం వరకే ఉండాలనే"** నియమంతో అనుమతించుచున్నట్లు హృదయాంతరంగ భావాన్ని కలిగించాడు.

ఈ విధంగ శ్రీవేంకటేశ్వరుడు మేము జీవించుటకు మా జీవితానికి విధివిధానాలు, మార్గదర్శకాలు విధించారు. ఈ ఘటన తరువాత చాలవరకు శాంతించారు. కాని ఎప్పుడైన నా మనస్సులో పాత భావాలు వచ్చినప్పుడు మళ్ళీ సురేఖ ఉగ్రరూపం దాల్చేది. వెంటనే నా మనస్సు నుండి ఆ భావాలను తీసివేసి స్వామిని ప్రార్థించేది. ఇలా దాదాపు నాలుగైదు నెలల వరకు జరిగింది. అంటే నేను స్వామి ఆదేశించినట్లు నడుచుకుంటానంటే బాగుండేది, లేదు నా ఇష్టం అనే భావం మనస్సున రాగానే సురేఖలో మార్పు కనబడేది. తరువాత భయంచే స్వామి చెప్పినట్లు అలవాటుపడిపోయాము.

ఇప్పుడు స్వామివారి పైన ప్రేమతో పాటు భయము కూడ ఏర్పడ్డది. మరోప్రక్క అసలు ఇది ఎందుకు చేయుచున్నారో అర్థం కాలేదు. స్థూపనిర్మాణానికి దీనికి సంబంధం అర్థం కాలేదు. అర్థం పర్థం లేని లీలగ భావించుకున్నాము. భయముచే స్వామి చెప్పినట్లు మసులుచున్నాము. ఈ లీల స్వామి ప్రసాదించిన సేవ అనే వృక్షానికి కాండం లాగ పనిచేస్తుంది.

## శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం

తేది 21-09-2002న స్థూపము మరియు 22-09-2002న "గోసంరక్షణ ట్రస్టు" ప్రారంభోత్సవాలు ఉన్నవి కాబట్టి డా॥ కొండారెడ్డిగారి అభ్యర్థన ప్రకారం 3 రోజుల ముందే అక్కడి పనులు చూచుకొనుటకు తిరుపతికి బయలుదేరాను.



తెల్లవారి గోశాలకు వెళ్ళి స్థూపానికి సంబంధించిన పైపై పనులు చేయించాను. ఆరోజు స్థూపానికి సున్నం వేసి మరునాడు అంటే 20-09-2002 నాడు కలరు వేసి ఇది **"శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము"** అని నాలుగు ప్రక్కల వ్రాయించాను. ఈపేరు ఆరోజు మాత్రమే నా మనస్సుకు వచ్చింది. వెంటనే డా॥ కొండారెడ్డిగారి అనుమతితో ఈ పేరును స్థూపానికి నాలుగు ప్రక్కల వ్రాయించాను. అప్పుడు ఆ స్థూపాన్ని కనులార చూచి చాలచాల ఆనందించాను. 20-09-2002 సాయంత్రము దాదాపు 4.30 ని॥లకు నేను మరియు డా॥ కొండారెడ్డిగారు కలిసి స్థూపములోనికి దిగి బ్రాహ్మణులు మంత్రోచ్చారణ చేయుచుండగ ఐశ్వర్య మహామంత్రములతో లిఖించిన స్వామివారి రాగి ఫలకను ఎడమ గోడకు, తూర్పుముఖముగ బిగించాము. పిదప టెంకాయ కొట్టి పూలు సమర్పించి హారతి ఇచ్చి మనసార స్వామిని వేడుకున్నాము. ఈవిధంగ స్థూప పనులు చక్కగ జరిగి అనుకున్నట్లు ప్రారంభోత్సవమునకు సిద్ధంగ ఉంది. ఈ స్థూపాన్ని చూచిన ఎంతోమంది చక్కగ ఉన్నదన్నారు. ఇంత తొందరగ పూర్తి కావటం స్వామివారి కృపే కారణమన్నారు. నేను తిరుపతిలో స్థూపనిర్మాణ పనులను చేయు సమయమున ఒకటి గ్రహించాను. టి.టి.డి ఎక్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుని ప్రతినిధిగ భావించాలి. ఆయన మాటను స్వామివారి మాటగ భావించాలి. ఈ.ఓ గారు వచ్చిన ప్రతి సమావేశం సఫలమైందని అనుకోవాలి. ఈ భావాలు నా మనస్సులో బలంగా నిలిచాయి.

## శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప ప్రారంభోత్సవం:

**21-09-2002 :** ఈ రోజు నా జన్మలో ఒక మరపురాని రోజు. నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని మహామంత్రమును సమర్పించుటకు నిర్మించబడిన **"శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము"**ను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్మించి,





ఆయన పాదపద్మములకు సమర్పించిన రోజు. మరియు **"శ్రీవేంకటేశ్వర, శ్రీనివాస ఐశ్వర్య మహామంత్రము"** లను నాచే కట్టించబడ్డ ఈ స్థూపములో స్వామివారికి నిక్షేపము చేసిన రోజు. భగవంతుడు ఈ జన్మను ప్రసాదించింది ఇందుకే అని భావించిన రోజు. ఈ కార్యక్రమము ఇలా జరిగింది.

**తేది 21-09-2002:** తిరుపతిలోని భీమాలాడ్జి నుండి నేను, శ్రీగవర్రాజుగారు మరియు హైదరాబాద్ నుండి వచ్చిన భక్తులు ఉదయం 5.15 ని॥లకు బయలుదేరి శ్రీవేంకటేశ్వర డైరీఫాంకు 5.30కి చేరుకున్నాము. అంతకు ముందే అక్కడ హోమగుండము సిద్ధము చేసారు. స్థూపానికి పూలతో చక్కని అలంకరణ జరిగింది. హోమము ఉదయము 5.30 ని॥లకు స్థూపము ఎదురుగ మొదలైంది. నేను పట్టు వస్త్రములు ధరించి నా స్వామిని ధ్యానిస్తూ ఇతరులతో పాటు హోమములో కూర్చున్నాను. 3 కోట్ల జపమును స్థూపము సమీపములో పెట్టాము. నా భార్య సురేఖ, అదే రోజు ఉదయం తిరుపతికి వచ్చి, 9.0 గం॥ల ప్రాంతమున పూజ దగ్గరికి వచ్చింది. అక్కడ చేయుచున్న శ్రీశ్రీనివాస ఐశ్వర్య మహామంత్ర సేవలో ఇద్దరము పాల్గొన్నాము. దాదాపు 11 గం॥ల ప్రాంతమున అప్పటి టి.టి.డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీమాన్ పి. కృష్ణయ్యగారిని తోలుకొని డా॥ కొండారెడ్డిగారు వచ్చారు. వారికి మేళతాళాలతో వేదమంత్రాలతో స్వాగతము పలికినారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకృష్ణయ్యగారు స్థూపాన్ని ప్రారంభించుటకు, మరియు స్థూపములో జపమును సమర్పించుటకు వచ్చారు. వారు వచ్చిన పిదప స్థూపమును చూచారు. చాల సంతోషించారు, ఒక రకంగా పొంగిపోయారు. డా॥ కొండారెడ్డిగారు నన్ను ఈ.ఓ గారికి పరిచయము చేసారు. పిదప స్థూపము చుట్టు ఈ.ఓ గారు మరియు మేము అందరము ఒక ప్రదక్షిణ చేసాము. తరువాత ఈ.ఓ గారిని స్థూపాన్ని ప్రారంభించవలసిందిగ కోరాము. కాని ఆ క్షణము స్వామివారు ఒక అద్భుతమైన చమత్కారమును చూపారు. నా జన్మను ధన్యము చేసారు. ఆయన భక్తులను మరచి ఉండరని నిరూపించారు. మనము ఒక రూపాయి ఖర్చుచేస్తే ఆయన కోటి రూపాయల విలువగల మహాభాగ్యమును ప్రసాదించునను మాట నిజం చేసాడు. నాయందు ఆ దయామయునికి ఉన్న ప్రేమను నిరూపించారు. నాకు జన్మజన్మల భాగ్యమును ప్రసాదించారు. ఇది నేను కలలో కూడ ఊహించలేదు. జరిగింది ఏమిటంటే! ఈ.ఓ గారిని స్థూపము ప్రారంభించమని కోరగా ఆయన నిరాకరించి దానిని నన్ను ప్రారంభించమని అన్నారు. అందుకు నేను సవినయంగా దానిని మీరే ప్రారంభించాలి అన్నాను. దానికి ఆయన ఒప్పుకోలేదు. నన్నే ప్రారంభించమని కోరారు. అందుకు నేను మరల నిరాకరించాను. అప్పుడు ఆయన కొంచెం కోపముతో నీవే ప్రారంభించు అని అనుచు నా భుజము పట్టి ముందుకు నెట్టాడు. అప్పుడు నేను చేసేదిలేక నా శ్రీవేంకటేశ్వర స్వామివారిని మనసార తలచుకొన్నాను. ఈ స్థూపాన్ని నాచే కట్టించి నాచేతనే ప్రారంభించుచున్నావా స్వామి అని తలచుకున్నాను. ఈ స్థూపాన్ని మీరు తప్పక స్వీకరించవలె ప్రభూ అని ఆయన్ను మనసార మరొక్కసారి తలచుకొన్నాను. ఆ సమయంలో అప్రయత్నంగ మా తల్లితండ్రులకు నమస్కరించాను. చివరికి శ్రీవేంకటేశ్వరున్ని స్మరిస్తూ స్థూపాన్ని ప్రారంభించాను. పిదప మేము అందరము అంటే నేను, ఈ.ఓ శ్రీమాన్ కృష్ణయ్యగారు, డా॥ కొండారెడ్డి గారు, గవర్రాజుగారు కలిసి స్తూపము ముందు ఫోటోదిగాము. హారతి ఇచ్చాము. ఆ స్థూపానికి మ్రొక్కాము. పిదప అందరము తలా కొంత జప పుస్తకములను తీసుకున్నాము. మొదట ఈ.ఓ గారు జప పుస్తకాలను స్థూపములో సమర్పించారు. తరువాత తలా కొన్ని పుస్తకములను మేమందరము సమర్పించాము. పిదప జరిగిన సభలో టి.టి.డి. ఈ.ఓ గారు నన్ను అభినందించినారు. వస్త్రములతో సన్మానించారు. నేను ఎంతో పొంగిపోయాను. ఆ స్వామివారే నన్ను సన్మానించుచున్నారన్న అనుభూతి పొందాను. నా స్వామిని వేనోళ్ళ పొగడుకున్నాను. ఆయన రూపాన్ని కనులార చూచాను. పిదప ఈ.ఓ గారు నన్ను

మరియు నా కుటుంబాన్ని స్వామివారు చల్లగ చూడాలని ఆశీర్వదించి వెళ్ళిపోయారు. పిదప నేను నా భార్య కలిసి ఆ స్థూపనిర్మాణమునకు కారకుడైన శ్రీమాన్ వాద్రేవు గవర్రాజు స్వామివారిని పట్టు వస్త్రములతో సన్మానించాము. తరువాత అక్కడ ఉన్న భక్తులు జపమును తలా కొంత చొప్పున స్థూపములో సమర్పించారు. మరియు హోమమునకు పూర్ణాహుతి చేసారు. పిదప డైరీఫాంలోనే ఏర్పాటుచేసిన భోజనము అందరము స్వీకరించాము. ఇది నా అదృష్టమని నా భార్య అన్నది. నేను నా జన్మ ధన్యమైందని భావించాను. సభకు వచ్చిన చాలమంది పెద్దలు మమ్ములను చూచి మీ జన్మధన్యమైందని అన్నారు, దీవించారు. మరి కొందరు ఈ ఆలోచన మీకు ఎలా కలిగిందని అడిగారు. ప్రతి ఒక్కరు నన్ను మరియు నా భార్యను చూచి మీరు ఒక మంచిపని చేసారు, ఇక మీరు ఈ జన్మలో ఏమి చేయకున్నా సరే అని మెచ్చుకున్నారు. భోజనము తరువాత రూంకు పోయి సంతోషంగ గడిపాను.

ఈ విధంగ స్థూపనిర్మాణము మరియు దాని ప్రారంభోత్సవము నాచే చేయించబడ్డది. దీనిని భాగ్యంగ భావించాను. ఆ శ్రీవేంకటేశ్వరుని కృపవల్లే ఇది జరిగిందని ఆయన పాదాలకు శతకోటి ప్రణామములను అర్పించాను.

## గోసంరక్షణ ట్రస్టు ప్రారంభం

**22-09-2002:** ఈ రోజు టి.టి.డి వారు వారి "గోసంరక్షణ ట్రస్టు"ను శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి చేతుల మీదుగ ప్రారంభించారు. ఇది సా. 6.30ని॥లకు జరిగింది. ఉదయం దాదాపు 11.0 గం॥ల ప్రాంతములో శ్రీశ్రీనివాస ఐశ్వర్యసేవ జరిగింది. పిదప కామధేను యజ్ఞం చేసి కపిల గోవులకు (నల్లని గోవులకు) పూజలు చేసాము. టి.టి.డి వారు కొండపై నుండి పంపిన నాలుగు రకాల ప్రసాదాలను మధ్యాహ్నము కడుపునిండా భోంచేసాము. మీ ప్రసాదాలను కడుపునిండా తినే భాగ్యమును ప్రసాదించావ స్వామి అని అనుకున్నాము.



సాయంత్రం సభ జరిగింది. మేము సేకరించిన పైకమును శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి చేతుల మీదుగ టి.టి.డి ఈ.ఓ శ్రీమాన్ పి. కృష్ణయ్య గారికి గవర్రాజుగారు అందించారు. మొత్తం రు.26.6 లక్షలు ఇచ్చారని ఇ.ఓ గారు ప్రకటించారు. తరువాత నన్ను స్థూపం కట్టినవాడిగ స్వామివారికి పరిచయం చేసారు. తరువాత నాకు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి చేతుల మీదుగ ఒక మెమెంటోను ఇచ్చారు. ఆ మెమెంటోపైన ఒక ప్రత్యేక డిజైన్‌లో శ్రీవేంకటేశ్వరుడు ఆయన వెనకాల గోవు ఉన్నది. గోవులను కాపాడవలెనని, గోశాలలు ఇంకా అభివృద్ధి చేయవలెనని స్వామిజీ సందేశమిచ్చారు. తరువాత ఈ.ఓ గారు డైరీఫాం, డైరెక్టర్ శ్రీకొండారెడ్డి గారు మాట్లాడారు. ఆతరువాత గవర్రాజు గారికి మాట్లాడుటకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు మరో లీలను ప్రసరించారు.

కొంత తడువు శ్రీ గవర్రాజు గారు చక్కగ మాట్లాడారు. తరువాత ఆయన గురించి ఆయన సేవను గురించి చెప్పుకున్నారు. ఆ తరువాత వారికి శ్రీ పుట్టపర్తి సాయిబాబా గారి ఆశీర్వాదముచే, ఆయన దయచే మాత్రమే ఈ సేవ లభించిందని అన్నారు. అందుకు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతిగారు నొచ్చుకున్నారు. దీనిని గమనించిన ఈ.ఓ గారు గవర్రాజుగారిని అలా మాట్లాడకుమని సూచించారు. ఒప్పుకున్నట్లు నటించిన శ్రీ గవర్రాజుగారు మళ్ళీ పుట్టపర్తి సాయిబాబాని భగవంతునితో సమానంగ పొగడుట ప్రారంభించారు. శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో సాయిబాబాను శ్రీవేంకటేశ్వరునితో సమానంగ, అంతకంటే ఎక్కువగ పొగడుట శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి గారికి నచ్చలేదు. వెంటనే సభనుండి లేచి వెళ్ళిపోయారు. ఈ.ఓ గారు, అధికారులు వారించిన వినలేదు. ఈ సంఘటన వలన శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారిని టి.టి.డి వారు అవమానించినట్లు భావించారు. టి.టి.డి వారు, ఈ.ఓతో సహా చాల బాధపడ్డారు. పైగ ఈ అవమానానికి కారణం శ్రీ గవర్రాజు అని తలంచి ఆయనపై అందరు కోపగించుకున్నారు. మరోసారి మీకు టి.టి.డిలో అవకాశం ఇవ్వము అనే స్థాయికి వెళ్ళారు. గవర్రాజుగారు కూడ చిన్నబుచ్చుకున్నారు. ఆ తరువాత అధికారులతో సరిగ మాట్లాడక గవర్రాజుగారు వెళ్ళిపోయారు. పిదప సభ ముగిసిన తరువాత శ్రీ కొండారెడ్డి గారు నన్ను తన గదిలోనికి పిలిచారు. మరిచాను మన్నించమంటు, నాకు స్వామివారి శాలువ కప్పి స్వామివారి ప్రసాదమును ఇచ్చారు. ఇది కూడ నాకు స్వామి దయలాగ అద్భుతంగ తోచింది, ఆనందించాను.


ఈ విధంగ తిరుమల తిరుపతి దేవస్థానము వారి గోసంరక్షణ ట్రస్టు ప్రారంభించబడ్డది, మరియు గవర్రాజుగారు టి.టి.డి కి

దూరమైపోయారు, నేను దగ్గరైపోయాను.

**23-09-2002 :** నేను శ్రీకొండారెడ్డిగారి ద్వార 8 అర్చనానంతర దర్శన టికెట్స్‌ను తీసుకున్నాను. నేను నా భార్య, గవర్రాజుగారు మరికొందరు మొత్తం 8 మందికి నేను నా సొంత డబ్బులతో దర్శనాన్ని చేయించాలని తలంచాను. అదే విధంగ ఉదయం 4.15 తిరుపతి నుండి బయలుదేరి 5.30 లకు తిరుమల ఆలయంలోనికి వెళ్ళాము. గం॥ 6.15 – 6.30 మధ్యన స్వామివారిని దర్శించుకున్నాము. అక్కడ శ్రీమాన్ శేషాద్రి గారని తెలిసిన పూజారి చనువుచే తనివితీర శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించాము. మాకు పూర్తి తృప్తి కలిగింది. తరువాత క్రిందికి వచ్చాము. శ్రీకొండారెడ్డిగారి అభ్యర్థనమేర మధ్యాహ్నం వారి ఇంటిలో భోజనము చేసాము. ఆరోజు సాయంత్రం బయలుదేరి 24-09-2002 ఉదయం హైదరాబాద్ వచ్చాము. తిరుపతి నుండి తిరుగు ప్రయాణమప్పుడు నేను స్వామివారిని మరిమరి వేడుకున్నాను. ప్రభూ! నేను పోవుచున్నాను. నన్ను మీరు మరువకూడదు. నా యందే మీరు ఉండాలి. నాకు మళ్ళీమళ్ళీ మిమ్ములను చూడాలని ఉంది అని మరిమరి వేడుకున్నాను. శరీరం కంపించగ కళ్ళ నుండి నీరు జలజల వ్రాలింది.

## జన్మాంతం వరకు స్థూపమును నీవే మేంటేన్ చేయమని ఆజ్ఞ

శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూప ప్రారంభోత్సవము తరవాత హైదరాబాద్ వచ్చాక ప్రతిక్షణము నాకు శ్రీవేంకటేశ్వరుడే గుర్తుకొచ్చాడు. ఈ స్థూపము



నిర్మించినప్పటినుండి నాకు నా జన్మ ఉన్నంతవరకు ఆ స్థూపాన్ని నేనే మేంటేన్ చేయాలనే భావన కలిగింది. దీనిని నేను టి.టి.డి అధికారులతో కూడ చెప్పాను. కాని నాకు మాత్రము మనస్సులో వీరు తరువాత కాలంలో తగిన పరిమిషన్ ఇస్తారో లేదో అనే అనుమానము ఉండేది. చివరికి నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరున్ని ఈ భాగ్యము ప్రసాదించమని దీనాతిదీనంగ వేడుకున్నాను.

**03-10-2002:** ఈనాటి రాత్రి కల కాదు కాని నిద్రలో నాకు **"ఈ స్థూపాన్ని నీవే నీ జన్మాంతము వరకు మేంటేన్ చేయగలవు"** అని నాతో ఎవ్వరో చెప్పినట్లు అనిపించింది. హృదయాంతర భావం ఏర్పడ్డది. ఇది ఆ స్వామివారి కృపాకటాక్షాలుగ భావించాను. ఎంతో సంతోషించాను.

## స్వామివారు స్థూపాన్ని స్వీకరించుట, దివ్య దర్శనాన్ని ప్రసాధించుట

**04-10-2002:** తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము, శ్రీస్వామివారి కృపావిశేషం చేత నాచే నిర్మించబడింది. ఇది చూచుటకు ఎంతో బాగుందని ప్రతివారు, టి.టి.డి అధికారులతో సహా ప్రతి వ్యక్తి నన్ను మెచ్చుకున్నారు. నేను మాత్రం దీనిని స్వామివారి ఆజ్ఞ ప్రకారం కట్టానని అన్నాను. శ్రీవారు నాచే ఈ పనిని చేయించుకున్నాడని శ్రీవాద్రేవు గవర్రాజుగారు అన్నారు. నేను దీనిని నా మొదటి పుత్రునిలాగ చూచుకున్నానని, మీ పెద్ద పుత్రుడు బాగున్నారు నీవు ఏమి దిగులు చెందకుమని డైరీఫాంలోని, ఇతర డాక్టర్లు, శ్రీనాగరాజుగారు మరియు శ్రీనాగేశ్వరయ్యగారలు, ఇతర సిబ్బంది నాతో తమాషాగ అంటు ఉండేవారు.

**"మేము అసలు ఈ స్థూపాన్ని ఇంత తక్కువ కాల వ్యవధిలో పూర్తిచేయగలరని అనుకోలేదు. తప్పకుండ నిరాశ పడవలసి వచ్చునని అనుకున్నాము కాని నీయొక్క పట్టుదల మరియు డెడికేషన్ వలన ఈ స్థూపము ఇంత తక్కువ వ్యవధిలో ఇంత మంచిగ నిర్మాణము జరిగింది"** అని డైరీఫాంలోని ప్రతి ఉద్యోగి నాతో అన్నారు.

స్థూప ప్రారంభోత్సవము రోజు కూడ చూచిన ప్రతి భక్తుడు నన్ను మెచ్చుకున్నారు, నీ జన్మ ధన్యమైందని చెప్పారు. కాని....... నా మనస్సులో మాత్రము సంతోషములేదు. నేను నాలోనే ఇంకా కొంత మెరుగ్గా కట్టవలసి ఉండే! కొన్ని తప్పులు జరిగాయి. హే ప్రభూ! మీరు నాపై మోపిన బాధ్యతను నేను ఏవిధంగ నిర్వర్తించానో తెలియదు. నేను ఏమైన తప్పులు చేస్తే నన్ను క్షమించగలరు అని స్వామివారిని మరిమరి వేడుకున్నాను. స్థూపనిర్మాణ సమయములో మధ్యమధ్యన నేను తిరుపతి నుండి

హైదరాబాద్‌కు మూడు నాలుగు సార్లు వచ్చాను. అప్పుడు రైల్వేస్టేషన్‌లో మరియు గోశాలలోని శ్రీకృష్ణుని ముందు, నేను లేకున్నా కూడ స్థూపపు పనులు సవ్యంగా జరుగాలని వేడుకునేవాడిని. రైల్వేస్టేషన్‌లో మాత్రం నేను మీ పనులను వదిలి వెళ్ళిపోవుచున్నానని స్వామివారిని తలచుకొనిన వెంటనే బాధతో కళ్ళనుండి నీరు రాలుచుండేది. స్వామి మీరు నన్ను త్వరగా మళ్ళీ తిరుపతికి వచ్చేవిధంగ చూడండీ అని వేడుకునేవాడిని. అది అట్లే జరిగేది. చివరికి స్థూపనిర్మాణము పూర్తైంది. ప్రారంభోత్సవము కూడ జరిగింది. అందరూ మెచ్చుకున్నారు కాని నేను మాత్రం తృప్తిచెందలేదు. ఒకరకంగ భక్తుల పొగడ్త నన్ను తృప్తి పరచలేదు. సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు, నా స్వామివారు బాగున్నదని అంటే సంతోషించుదునని నేను అనుకున్నాను.

తేది 04-10-2002 నాడు ఈ స్థూపాన్ని స్వామివారు స్వీకరించారా? లేదా? అనే ఒక అనుమానము వచ్చింది. మరోప్రక్క స్వామివారిని చూడవలెననే కోరిక కలిగింది. ఏమి చేయాలో తోచలేదు. ఆరోజు సాయంత్రము మా ఆఫీసులో అందరు వెళ్ళిపోయిన తరువాత తలుపువేసి నా రూంలోనికి వచ్చాను. పిదప నేను కూర్చుండే కుర్చి వెనుక ఉన్న స్వామి ఫోటోను చూచుకుంటు వజ్రాసనములో కూర్చుండి స్వామివారితో ఈ విధంగ దీనాతిదీనంగ ప్రార్థించాను.

“ప్రభూ! శ్రీవేంకటేశ్వర నేను నా యొక్క శక్తి ప్రకారము, నాకు తోచినట్లు, పూర్తి భక్తిభావంతో, నా మనస్సును పూర్తిగ మీకు అంకితము చేసి మీ యొక్క మహామంత్ర స్థూపాన్ని కట్టాను. అందరూ బాగుందన్నారు. కాని నేను మాత్రం తృప్తిచెందలేదు. ఇంకా కొంత మెరుగ్గా చేయవలసి ఉండే అనే అభిప్రాయముంది. హే ప్రభూ! నా స్వామి! దయామయా! నాకు మీరు ఈ స్థూపాన్ని స్వీకరించారో లేదో తెలియదు. ప్రభూ! మీరు ఈ స్థూపాన్ని స్వీకరించండి ప్రభూ! నా కోరికను నెరవేర్చండి ప్రభూ!” అంటూ రకరకాలుగ బ్రతిమిలాడాను. నా కళ్ళనుండి నీటిధారలు కారుచుండగ దీనంగ వేడుకున్నాను. ఇంకా ఈ విధంగ వేడుకున్నాను. “ప్రభూ! మీరు స్వీకరించారో లేదో నాకు తెలపండి” అని అనుచు మూడు షరతులను విధించాను. మొదటిది: ఒకవేళ మీరు ఈ స్థూపాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించినట్లైతే ఈరోజు రాత్రి కలలో నాకు ఏదో ఒక విధంగ చెప్పండి. మీ దర్శనాన్ని ప్రసాదించండి. అప్పుడు నేను మీరు దీనిని నూటికి నూరుపాళ్ళు స్వీకరించారని భావిస్తాను. రెండవది: ఈరాత్రి కాకుండ మూడురోజుల తరువాత చూపిస్తే 50% స్వీకరించినట్లు భావిస్తాను అన్నాను. మూడవది: 11 రోజుల లోపల చూపిస్తే ఎంతోకొంత స్వీకరించారని, 11 రోజుల వరకు ఏమి చూపెట్టకుంటే మీరు దీనిని స్వీకరించలేదని భావిస్తానని చెప్పాను. చివరికి ఈ స్థూపాన్ని స్వీకరించమని, ఈ దాసున్ని ఈ రాత్రి ఎదో ఒక విధంగ అనుగ్రహించమని ఏడ్చాను. చివరికి నామనస్సులోని మాటను స్వామివారికి చెప్పి, పాదాభివందనము చేసి ఆఫీసుకు తాళం వేసి గం॥ 7.45 ని॥లకు ఇంటికి పోయాను. అన్ని రోజులలాగానే తిని దాదాపు గం॥10.0లకు స్వామివారిని ధ్యానించుచు పడుకున్నాను. తరువాత ఒక అద్భుతము జరిగింది.

స్వామి తన భక్తుని ఆవేదనను మనసారా స్వీకరించారు. తన భక్తుని మనస్సును సంతోషపెట్టే విధంగ చేసాడు. ఆ స్వామివారిని కనులార చూచే భాగ్యాన్ని మళ్ళీ ఒకసారి ప్రసాదించారు. వారు నేను కట్టిన మహామంత్ర స్థూపాన్ని నూటికి నూరుపాళ్ళు స్వీకరించారని దానితో నేను విధించిన షరతులను స్వీకరించుచున్నారని తెలిపేవిధంగ లీలను చూపాడు. ఇంత కంటే మహాభాగ్యం మరెవ్వరికి కలుగదు. నేను ధన్యున్నైనాను. ఒక రకంగ గర్వపడ్డాను. ఆరోజు కల ఈవిధంగ ఉంది.

**కల :** అది ఒక పెద్ద మైదానము. అందులో మధ్యభాగమున దాదాపు 6 అడుగుల వెడల్పు 12 అడుగులు ఎత్తు గల ఒక ఇనుపరేకుతో మలచిన శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడు. అది ఇనుపరేకుతో మలచారు కాబట్టి సిలుముపట్టి ఉన్నట్లు నల్లగ ఉంది. ఆ శ్రీవేంకటేశ్వరుడు అచ్చంగ, స్థూపనిర్మాణాన్ని చేసినందులకు మెచ్చుకుంటు తేది 22-09-2002 నాడు శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పీఠాధిపతులు బహూకరించిన మెమెంటోలో ఉన్నట్లుగానే ఉన్నారు. ఆ మెమెంటోను శ్రీ గవర్రాజుగారే తెచ్చి స్వామివారి చేతుల మీదుగ ఇప్పించారు. ఆ మెమెంటోలో శ్రీవేంకటేశ్వరుడు ఒక ప్రత్యేక డిజైన్‌లో ఉన్నారు. ఆ మెమెంటోలో ముందు స్వామివారు ఉండగ ఆయన వెనుక గోవు ఉంది. ఆ మెమెంటోలో ఏవిధంగ ఏలాంటి పరిమాణముతో అంటే కాళ్ళ పరిమాణము, కిరీట పరిమాణము మొత్తం అదే ఆకారం, కాని ఎన్‌లార్జ్‌డ్ సైజులో వెడల్పు 6 అడుగులు ఎత్తు 12-15 అడుగులు పరిమాణముతో ఉన్నాడు. కాని ఆయన ఇనుపరేకుతో మలచబడి చిలుము పట్టినట్లు నల్లగ ఉన్నాడు. చాలమంది పెద్దలు, పిల్లలు ఆయన చుట్టుచేరి వింతగ చూస్తున్నారు. అప్పుడు నేను కూడ అక్కడికి పోయి చూచాను. ఇంతలోనే ఒక అద్భుతము జరిగింది. ఆ ఇనుపరేకుతో చిలుము పట్టి ఉన్న స్వామివారు నా చూపు పడిన వెంటనే ఒక్కసారిగ బంగారంగా మారిపోయారు ఆయన నుండి ధగధగమంటూ బంగారు మెరుపుకాంతులు నావైపు వచ్చాయి. ఆ ప్రాంతం మొత్తం బంగారు కిరణాలతో నిండిపోయింది. ముఖ్యంగ ఆయన అభయ హస్తము నుండి మరియు దాని

చుట్టు ఉన్న ప్రదేశము నుండి విపరీతమైన కాంతులు నా కళ్ళకు కొట్టుచున్నవి. బంగారు కాంతికిరణాలు ధగధగమంటు నావైపు వచ్చాయి, కాని నా కళ్ళు మాత్రము మూతపడలేదు. స్పష్టంగ శ్రీవేంకటేశ్వరున్ని చూచాను అప్పుడు నేను కలలోనే ఈవిధంగ అనుకున్నాను. "నేను వినాయక చవితి రోజు (తేది 10-09-2002) తిరుమలలోని స్వామిని దర్శించినప్పుడు ఆయన అభయహస్తము నుండి మరియు దాని చుట్టుప్రక్కల నుండి ఇదేవిధమైన కాంతులు వచ్చాయి. ఇవి కూడ ఆ విధంగానే ఉన్నవి" అని కలలోనే అనుకున్నాను. ఈవిధంగ స్వామివారిని కలలో కొంతసేపు చూచాను. తరువాత కల చెదిరింది.

ఈవిధంగ స్వామివారు నేను విసిరిన సవాలును స్వీకరించి తాను స్థూపాన్నిమనస్ఫూర్తిగ నూటికి నూరుపాళ్ళు స్వీకరించానని తెలుపుటకు నేను తలంచిన రోజు కలలో మెమెంటోలోని శ్రీవేంకటేశ్వరుని రూపములో దర్శనమిచ్చారు. ఆరోజు నుండి నాకు స్థూపాన్ని కట్టిన తృప్తి లభించింది. నా స్వామి కలిగించాడు. ఇంతటి భాగ్యాన్ని కల్పించిన స్వామి ఋణం ఏవిధంగ తీర్చుకోవాలని పరిపరి విధాలుగ ఆలోచించాను.

**ఒక విశ్లేషణ:** (1) శ్రీవేంకటేశ్వరుడు చూపే ప్రతిమాటను క్షుణ్ణంగ పరిశీలించాలి. స్వప్నాల రూపంలో ప్రసాదించే లీలలను కొంత తప్పుగ అర్థం చేసుకునే అవకాశం ఉంది. కాబట్టి ఆయన భావాలను స్పష్టంగ అర్థం చేసుకొనుటకు హృదయాంతరంగ భావాలను ప్రసాదించేవారు.

(2) తేది 26-08-2002 నాటి శ్రీ గవర్రాజు గారి కలను పరిశీలిద్దాం! తిరునామాలు ధరించిన ఒక అయ్యవారు స్థూపనిర్మాణ ఆలస్యమునకు కారణం వేరేదో ఒకటుందన్నారు. నన్ను తిరుపతికి వెళ్ళమన్నారు, స్థూపం పేరుపైన భవిష్యత్తులో ఒక సంస్థ ఏర్పాటు అగునని, మంచి పేరు సంపాదించునని కూడ చెప్పారు. ఈ విషయం ఇప్పుడు నీకు అవసరము లేదని కూడ చెప్పారు. ఈ మాట ఎందుకన్నాడో వచ్చే అధ్యాయాలలో స్పష్టంగ తెలుస్తుంది.

**నా దిశ** : నా భార్యను నాకు సహకరించునట్లు మార్చాడు. మా జీవితానికి కొన్ని విధివిధానాలను ఏర్పరచాడు. కుటుంబపోషణార్థమే వ్యాపారం చేయమన్నాడు. నా భాగ్యవశాత్తు తిరుపతిలో స్థూపనిర్మాణం పూర్తికాబడి, నాచేతనే ప్రారంభించబడ్డది. టి.టి.డి వారికి దగ్గరైనాను. నా జీవితాంతం నేనే ఈ స్థూపమును మేంటేన్ చేయగలవన్నారు. స్థూపాన్ని మనస్ఫూర్తిగ స్వీకరించి తన దివ్యదర్శన భాగ్యంను ప్రసాదించారు.

**భాగవత ఆశీర్వాదము:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురించుచున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.

**(సశేషం)**


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్. ఫోన్: 040-27175050**


## శ్రీ వేంకటేశం మాస పత్రిక గౌరవ సంపాదకులు మార్పు


డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారు 'శ్రీ వేంకటేశం' మాసపత్రికకు 2012 సం॥ నుండి గౌరవ సంపాదకులుగా సేవలందించారు. ప్రస్తుతము వయోభారము వలన సేవలందించలేక పోవుచున్నారు. ఇన్ని సంవత్సరములు ఈ పత్రికకు నిస్వార్థంగా సేవలందించిన డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారికి మరియు వారి కుటుంబ సభ్యులకు తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించాలని ప్రార్థిస్తున్నాము. అదేవిధంగా వీరి స్థానములో గౌరవ సంపాదకులుగా సేవలందించుటకు ముందుకు వచ్చిన డా॥ టి. గౌరిశంకర్ గారికి కూడా స్వామివారి కృపాకటాక్షాలు లభించాలని, వీరి ఆధ్వర్యంలో ఈ పత్రిక మరింత ముందుకు పోగలదదని ఆశిస్తున్నాము.

***- ఎడిటర్ శ్రీ వేంకటేశం***

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వరా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007.
ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# "లీలా విగ్రహరూపధారి కృష్ణం వందే జగద్గురు"

– చింతలపాటి శివశంకరశాస్త్రి

**శ్లో. యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్**

**ధర్మానికి హాని జరిగినా, అధర్మం మితిమీరినా భూమిపై అవతరిస్తానని శ్రీకృష్ణ పరమాత్మ గీతలో చెప్పాడు. ఆ విధంగానే దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయాల్సిన పరిస్థితులేర్పడినప్పుడల్లా భగవంతుడు ఈ భూమిపై అవతరిస్తూనే ఉన్నాడు. అలా అనేక రూపాల్లో అవతరించినా, వాటిలో దశావతారాలు ప్రధానమైనవి. దుష్ట శిక్షణ కోసం భగవంతుడు దాల్చిన అవతారాలలో ఎనిమిదవ అవతారం శ్రీ కృష్ణావతారం.**

**సింహ మాసే2 సిలే పక్షే రోహిణ్యాయష్టమి తిథౌ**
**చరమార్థ ప్రదాతారం కృష్ణం వందే జగద్గురుం**
**తత్రో2ఖిల జగత్పద్మ బోధయాచ్యుత భానున్**
**దేవకీపూర్వ సంధ్యయావిర్భూతం మహాత్మనా**

శ్రావణ బహుళ అష్టమి తిథి రోహిణి నక్షత్ర అమృత ఘడియలలో శ్రీకృష్ణ పరమాత్మ దేవకీ వసుదేవులకు జన్మించాడు. జగత్కళ్యానానికి విష్ణుమూర్తి ధరించిన అవతారాలలో మధురమోహన రూపం శ్రీకృష్ణావతారం. మాధవుడు మానవుడిగా భరతభూమిపై నడయాడిన వైనం కడు రమణీయమైనది. మరియు కమనీయమైనది.

శ్రీకృష్ణుడు జన్మించిన అష్టమి తిథులలో ఎనిమిదవది. దశావతారములలో ఎనిమిదవ అవతారం. వసుదేవుని సంతానంలో శ్రీకృష్ణుడు ఎనిమిదవవాడు. అష్ట భార్యలున్నవాడు. నక్షత్రములలో నాలుగవదైన రోహిణికి ప్రీతిపాత్రుడు. ఈ విధంగా అనేక ప్రత్యేకతలను కలిగిన కృష్ణుడు షోడశ కళాపూర్ణుడై సమస్త హృదయాలను ఆకర్షించినవాడు. జగతికి జ్ఞానమార్గం చూపిన జగద్గురువు. కర్తవ్యబోధ చేసిన గీతాచార్యుడు. పరమాత్మ భావాన్ని ప్రదర్శిస్తూనే, మానుష ధర్మాలను దెబ్బతీయకుండా యోగీశ్వరుడిగా సంచరించిన పరిపూర్ణ అవతారం శ్రీకష్ణుడు. అతిమానుష్య కృత్యాలు చేసినా, తనను తాను దైవంగా ప్రకటించుకొని దేవుడిగా ప్రదర్శనలు చేస్తూ కాలం గడపక క్షత్రియుడిగా తన ధర్మాలను పాటించాడు. "ధర్మస్య ప్రభురచ్యుతః" అంటే అచ్యుతుడు ధర్మానికి ప్రభువు అని భీష్ముని మాట. అనేక జన్మాల యోగఫలం ప్రభావంతో పరమాత్మ తత్వాన్ని దర్శించి కురుకుల పితామహుడు పలికిన పలుకులివి.

పురాణాలు స్వామిని లీలా మానుష విగ్రహునిగా పేర్కొన్నాయి. స్వామి ప్రదర్శించిన లీలలన్నీ పరమాత్ముని మహిమలకు ప్రతీకలు.

ఒకనాడు బాలకృష్ణుడు మన్ను తిన్నాడని రామ గోపబాలురు చెప్పగా తల్లి యశోద దండిస్తూ మన్ను ఎందుకు తిన్నావని మందలించగా కృష్ణుడు తల్లితో "అమ్మా! మన్ను తినడానికి నేనేమన్నా పసిపిల్లాడినా! పిచ్చివాడినా! నాకేమన్నా ఆకలి వేసిందా! వీళ్లు చెప్పే మాటలు నమ్మవద్దు. నీచేత నన్ను కొట్టించడానికి వీళ్లు ఇలా కుట్ర పన్ని చెప్తున్నారు. నా మాట మీద నమ్మకం లేకపోతే నా నోరు వాసన చూడు. నా మాటలు అబద్ధాలైతే అప్పుడు దండించమని పలికి నోరు తెరిచి చూపాడు. యశోద నోటిని పరీక్షించుచుండగా బాలకృష్ణుడు తన నోటిలో బ్రహ్మాండము నంతటిని చూపాడు. యశోద విస్తుపోయి "ఇది కలా? లేక విష్ణు మాయ? ఇది నిజమా? వీడి నోటిలో

బ్రహ్మాండమంతా ప్రకాశిస్తూ ఉండటానికి కారణమేమిటి? ఇది ఎంతో మహాశ్చర్యంగా, వింతగా ఉంది”యని అద్భుతాశ్చార్యాలకు లోనయింది.

ఒకనాడు శ్రీకృష్ణుడు పెరుగు కుండను పట్టుకొని పెరుగును ఆరగించి ఆ భాండాన్ని పగులకొట్టాడు. మరొకరి ఇంట్లో ఉట్టి మీద ఉంచిన కుండలోని పాలను తాగి, వెన్నను దొంగలించి తిని ఆ భాండాన్ని పగులగొట్టాడు. యశోదాదేవి కుండ పగిలిన శబ్దము విని దండిస్తే గాని బుద్ధిగా ఉండడని తలచి బెత్తము చేతబట్టి పారిపోవు కృష్ణుని వెంబడించింది. తనను పట్టుకోవడానికి వచ్చే తల్లికి అందకుండా అటూ, ఇటూ పరిగెత్తాడు. అందకుండా పరిగెత్తుతూ తిప్పలు పెడుతున్న కృష్ణుని తానూ పరిగెత్తుతూ పట్టుకొంది. నానా తిప్పలుపడి పట్టుకుందేగాని, కొడుకుని కొట్టడానికి చేతులు రాక, పక్కనే ఉన్న రోటికి కట్టేసి లోపలికి వెళ్లింది. తల్లి తనను కట్టిన రోటిని లాగికొని వచ్చి అక్కడే ఎత్తుగా యున్న చెట్లను కూల్చి నలకూబర, మణిగ్రీవుల యొక్క శాప విమోచనము గావించాడు.

ఒక పర్యాయము నందాదులు ఇంద్రయాగము తలపెట్టారు. అంత శ్రీకృష్ణుడు తండ్రిని సమీపించి ఎవర్ని ఉద్దేశించి ఈ యజ్ఞం చేస్తున్నారు? ఈ యాగము చేయడం వల్ల కలిగే ఫలితమేమిటి? అడిగాడు. అందులకు నందుడు ఇంద్రుని సంప్రీతుని గావించుట కొరకే ఈ యాగము తలపెట్టామని, ఆయన ప్రీతుడై వర్షాలు కురిపిస్తే పంటలు పండి ప్రజలంతా సుఖంగా ఉంటారని, యాగము చేయకపోతే కీడు కలుగుతుందని పలికాడు. ఆ మాటలు విన్న కృష్ణుడు పంటలు పండాలంటే ఇంద్రుణ్ణే పూజించవలసిన అవసరం లేదని, భూమిని, వరుణుని పూజిస్తే భూమాత సంతసించి ముక్కారు పంటలు పండింప చేస్తుందని, వరుణుడు అనుగ్రహిస్తే ఫలము కలుగుతుందని, కావునా ఇంద్రుని పూజించవలసిన అవసరం లేదని, ఎవరికీ భయపడనక్కరలేదని చెప్పి ఇంద్రయాగమును మాన్పించి, గోవర్ధనగిరికి పూజలు చేయించాడు.

ప్రతి సంవత్సరము భక్తి శ్రద్ధలతో తనను ఆరాధించే గోపాలకులు, నందాదులు అహంకరించి తనను పూజించ లేదన్న ఆగ్రహంతో ఇంద్రుడు మేఘాలను ఆజ్ఞాపించి వ్రేపల్లెపై భయంకరమైన వర్షాన్ని కురిపించాడు. క్రమ క్రమంగా రాళ్ల వానగా మారి ఉధృత రూపాన్ని పొందింది. ప్రాణ భయంతో అల్లాడిపోయిన గోవులు, గోపాలకులను రక్షించుటకు పూనుకొని, వారికి అభయమిచ్చి చిటికిన వేలితో గోవర్ధన పర్వతమును ఎత్తి గోవులను, గోపాలకులను దానికిందకు రమ్మని పలికి ‘ఓ గోపాల బాలకులారా! వీడు బాలుడు, ఈ కొండ చాలా పెద్దది మరియు బరువైనది. వీడు దీన్ని మోయగలడో, మోయలేడో అని సందేహించవద్దు. పర్వతాలు, సముద్రాలు, ప్రాణికోటితో కూడిన ఈ భూమండలమంతా వచ్చి మీద పడ్డా నా చెయ్యి చలింపదు. మీరంతా కలతమాని, సంతోషంతో వచ్చి ఈ పర్వతం కింద నిలబడండి. రండి”అంటూ వారందరినీ గోవర్ధన పర్వతము కిందకు రప్పించి గోపాలకులను రక్షించాడు.

శ్రీకృష్ణుడు ఆర్తత్రాణ పరాయణుడు. ఆర్తులను ఆదరించడంలో కరుణించడంలో ఆయనకు ఆయనే సాటి. శరణు కోరిన వారిని స్థాయీ భేదాలను మరచి ఆదరించడంలో ఆయనకు ఆయనే సాటి ఆయన ధర్మ వత్సలుడు. బాల్య స్నేహితుడైన కుచేలుడు అధిక సంతానము దారిద్ర్యముతో బాధపడుతూ భార్య సలహాతో శ్రీకృష్ణుని దర్శించినంతనే కరుణించి బ్రోచిన భక్తవత్సలుడు. యుక్తవయసు వచ్చినప్పటికీ కుచేలుని సాదరముగా ఆహ్వానించి పూజించడం ఆయన స్నేహ ధర్మాన్ని సూచిస్తుంది.

కుచేలుడు వేదం చదివిన బ్రాహ్మణుడు. అభిమాన ధనుడు. విజ్ఞానవంతుడు. రాగద్వేషాలు లేని ప్రశాంత మనస్కుడు. ధర్మమునందు శ్రద్ధ గలవాడు. జితేంద్రియుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు దారిద్ర్యము ఎంతగా బాధిస్తున్నా దీనంగా ఇతరులను యాచించే స్వభావం లేనివాడు. కుచేలుని భార్య మహా పతివ్రత. ఉత్తమ వంశంలో పుట్టినది. పిల్లలు ఆకలి మంటచే మల మల మాడిపోతుంటే మనస్సు వికలమై, దుఃఖపడి భర్తతో “మీ ప్రాణ స్నేహితుడైన శ్రీకృష్ణుని దర్శించి, ఆ స్వామి కృపాకటాక్షమును పొంది, దారిద్ర్యమనే చీకటిలో మగ్గిపోతున్న మమ్మల్ని కాపాడండి. శ్రీకృష్ణుడు సజ్జనులను, భక్తులను పుత్రప్రేమతో చూస్తాడు. ఆపదలలో శరణు కోరదగినవాడు. దయాసముద్రుడు. లక్ష్మీనాథుడైన ఆ శ్రీకృష్ణుడు మీ బాల్యమిత్రుడు. ఆయన ద్వారకా నగరంలో ఉన్నాడు. ఆ పరమాత్మను ఒక్కసారి దర్శించండి. మిమ్మల్ని చూచిన వెంటనే మీకు అధికమైన సంపదల్ని ప్రసాదిస్తాడు” అని భార్య చెప్పగా విన్న కుచేలుడు భార్యతో “నీవు చెప్పినట్లు మా మిత్రుడు కృష్ణుని పాదపద్మాల్ని ఆశ్రయించటానికి వెళ్లడం మనకు అన్నివిధాలా శ్రేయస్కరం. మిక్కిలి శుభదాయకం. అయితే అష్టైశ్వర్యాలతో తులతూగే కృష్ణుని వద్దకు రిక్త హస్తాలతో వెళ్లడం భావ్యం కాదు. పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో కానుకగా తీసుకుపోవడానికి మన వద్ద ఏమీ లేదు కదా! ఆ పరాత్పరుణ్ణి ఏవిధంగా దర్శించాలి? మన వద్ద నీకు తెల్సి ఏమైనా ఉన్నాయా?” అని పలికాడు.

కుచేలుడట్లనగానే అతని భార్య ఎంతో సంతసించి చినిగిన వస్త్రంలో కొద్దిగా అటుకులు మూటకట్టి భర్తను ప్రేమతో కృష్ణుని వద్దకు పంపింది. కుచేలుడు పరిపరి విధాలుగా

ఆలోచిస్తూ ద్వారకా నగరానికి చేరుకొని కృష్ణుని దర్శనము చేసుకొని అమితానందాన్ని పొందాడు. శ్రీకృష్ణుడు తన వద్దకు వచ్చిన మిత్రుని చూసి సంభ్రమంతో ఆసనం నుంచి దిగాడు. తన ఎదుట నిలబడిన కుచేలుని చూచిన కృష్ణుని కళ్లు ఆనందంతో వికసించాయి. ఆదరాభిమానాలతో కుచేలుని ఎదురేగి ఆతనిని ప్రేమతో కౌగిలించుకున్నాడు. ప్రేమతో తనతో కూడా తీసుకొని వచ్చి తల్పంపై కూర్చుండబెట్టి అతని పాదాలను బంగారు కలశంలోని నీళ్లతో కడిగాడు. విసనకర్రతో విసిరాడు. పచ్చకర్పూరం కలిపిన మంచి గంధాన్ని అతని శరీరంపై ప్రీతితో పూశాడు. కుచేలుని చేతిని తన చేతిలోనికి తీసుకుని యోగక్షేమాలడిగి తెలుసుకొనినాడు. శ్రీకృష్ణుని ఆప్యాయతానురాగాలను చూసి సంతోషించిన కుచేలుడు. తాను తెచ్చిన అటుకులను కృష్ణునకు సమర్పించలేక ముఖం వంచుకొని సిగ్గుతో మౌనంగా ఉండిపోయాడు.

కుచేలుని మౌనమును అర్థం చేసుకున్న కృష్ణుడు తన దివ్య చిత్తంతో కుచేలుడు వచ్చిన కారణము తెల్సుకొని ఇంద్రాదులకు సైతం లభించని భాగ్యాన్ని ఇవ్వాలని నిశ్చయించుకొని చినిగిన వస్త్రంలో మూటకట్టి తెచ్చిన అటుకుల మూటను చూసి ఇదేమిటని అడిగి తన చేతులతో మూట విప్పి గుప్పెడు అటుకులను తీసుకొని ఆరగించి, ఆసక్తితో ఇంకొక గుప్పెడు తీసుకున్నాడు. అప్పుడు రుక్మిణీదేవి తన చేతులతో కృష్ణుని చేయి పట్టుకొని తినకుండా నివారిస్తూ ''ప్రాణనాథా! ఇంతకు ముందు ఆరగించిన అటుకులు చాలు. మీ మనోభీష్టం నెరవేరింది. ఇంక భక్షించకండి'' అని వారించింది. కుచేలుడు ఆరోజు రాత్రి కృష్ణుని మందిరంలో ఉండి మరునాడు తిరుగు ప్రయాణమయ్యాడు. కృష్ణుడు కొంత దూరం వచ్చి సాగనంపాడు.

కుచేలుడుతనమిత్రుడైనకృష్ణునిఅతిథిమర్యాదలకుసంతసించి, అచ్యుతుని దర్శన భాగ్యమును కలిగినందులకు సంతోషించాడు. సంతృప్తి చెందిన మనస్సుతో ఇంటికి పయనమయి ఇంటికి చేరాడు. తన ఇల్లు తాను గుర్తు పట్టలేక సతమతమవుచుండగా భార్య వచ్చి స్వాగతము పలికి నమస్కరించింది.

తన కళ్ల ఎదుట కనిపిస్తున్న భోగభాగ్యములను చూచి ఆ మహాత్ముడు తన అంతరంగాన్ని గ్రహించి ఈ సంపదలన్నీ ఇచ్చి ప్రభువుని చేశాడని, తనను ధన్యుణ్ని చేశాడని, ఇదంతా తన మిత్రుని వాత్సల్యమేనని గ్రహించి కృష్ణుని యందధిక భక్తి కలిగి భార్యా సమేతుడై జీవనం సాగించాడు.

బలరామ కృష్ణులకు విద్యాభ్యాస మొనరించు సమయ మాసన్నము కాగానే దేవకీ వసుదేవులు సాందీపని అను గురువు గారి వద్దకు పంపించారు. బలరామకృష్ణులు వారి వద్ద విద్యాభ్యాసము చేసి అరువది నాలుగు దినాలలో అరువది నాలుగు విద్యలు నేర్చి గురువుగారికి ఆశ్చర్యం కలిగించారు. శిష్యుల మహిమను గుర్తించిన సాందీపని గురుదక్షిణగా ప్రభాస తీర్థానికి సముద్ర స్నానమాడబోయి అందు మునిగిపోయి తిరిగిరాని, మరణించిన తన కుమారుని బ్రతికించి తెచ్చి గురుదక్షిణ ఇమ్మని కోరాడు. అంత రామకృష్ణులు సముద్రునిపై దండెత్తి, తమ గురుపుత్రుని ఇమ్మని ఆదేశించారు. కెరటమొకటి లోనికి లాక్కొనిపోగా పంచజను రాక్షసుడు ఆ బాలుని మింగెనని చెప్పి, ఆ రాక్షసుడుండు చోటును సముద్రుడు వారికి చెప్పెను. కృష్ణుడు ఆ ప్రదేశానికి వెళ్లి ఆ రాక్షసుని చంపి పొట్ట చీల్చి చూడగా అందు బాలుడు కనిపించకపోయేసరికి యముని వద్దకు వెళ్లారు. యమధర్మరాజు రామకృష్ణులను సాదరంగా ఆహ్వానించి వారి రాకకు గల కారణమును తెలుసుకొని గురుపుత్రుని వారికి అప్పగించాడు. రామకృష్ణులు గురుపుత్రుని తీసుకొని వచ్చి గురువుగారికి అప్పగించారు. తమ పుత్రుని బతికించి తెచ్చి యిచ్చిన రామకృష్ణుల పట్ల కృతజ్ఞతను తెల్పారు గురుదంపతులు.

ఒకనాడు దేవకీ దేవి తన కుమారుడు మరణించిన గురుపుత్రుని పునర్జీవితుని చేసి గురుదక్షిణగా సమర్పించినట్లు తెలుసుకొని, కంసునిచే చంపబడ్డ తన ఆరుగురు కుమారులను బ్రతికించి తెమ్మని కోరింది. తల్లి కోరిక విని ఆమెను ఓదార్చి బలరామకృష్ణులు పాతాళ లోకానికి వెళ్ళారు. బలి చక్రవర్తి బలరామకృష్ణులను చూసి వారిని పూజించి తానేమి చేయవలెనో ఆజ్ఞాపించమని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడు తన తల్లి కోరికను తెలిపి తన అన్నలార్గురు నీ దగ్గర ఉన్నారు. వారిని తీసుకొని పోవడానికి వచ్చామని చెప్పాడు. బలి చక్రవర్తి ఆరుగురు బాలురను తీసుకొని వచ్చి రామకృష్ణులకు అప్పగించెను. కృష్ణుడు వారిని తీసుకొని వచ్చి తల్లికి చూపగా వారిని చూసి ఎంతో ఆనందించింది. విష్ణు మాయచే ఆ ఆరుగురు శిశువులు తల్లి వద్ద పాలు తాగి, కృష్ణ కర స్పర్శచే శాప విముక్తులై నిజరూపాలు ధరించి తల్లికి, కృష్ణునకు నమస్కరించి తమ స్వస్థానానికి చేరుకున్నారు.

అచ్యుతుడు, అనంతుడు, పద్మమాలాధరుడైన శ్రీకృష్ణ పరమాత్మ యొక్క లీలలు అనంతములు. కమనీయ, రమణీయమైనవి. కృష్ణాష్టమి పవిత్ర దినాన ఆ లీలా మానుష విగ్రహధారియైన కృష్ణ పరమాత్ముని ధ్యానించి, పూజించి తరించెదము గా.

**"వసుదేవ సుతం దేవం**
**కంస చాణూర మర్దనం**
**దేవకీ పరమానందం**
**కృష్ణం వందే జగద్గురుం"**



# సాక్షి గోపాలం


- మందరపు
వి.జి. శంకరాచారి

భగవంతుడ్ని ధ్యానిస్తే మనసుకి శాంతి. ప్రేమిస్తే మనసుకి ఆహ్లాదం, ఆనందం. నియంత్రణ లేని బంధాలను తెంచుకొని ఏకత్వ భావంతో కొలిస్తే అది ముక్తి. ఇందులో భగవంతుడ్ని ఏవిధంగా పూజించినా భగవంతుడు మురిసిపోతాడు. భక్తుడికి దగ్గరవుతాడు. అంతేకాదు భక్తుడి వెంట భగవంతుడు అడుగులు వేస్తాడు. భక్తుడికి ఏమాత్రం ఇబ్బంది కలిగినా అతడిని తన భుజాలపైకి ఎత్తుకుని మరీ నడిపిస్తాడు. ఇది సత్యమేవ సత్యం.. ఈ ప్రహసనంలో....

భగవంతుడిపై ఒక పెద్దమనిషి చేసిన ప్రమాణం ఆ భక్తుడ్ని ఆ కార్యానికి అంగీకరించినట్లుగా చేసింది. తీరా తన ఊరు చేరుకున్న పిదప ఆ గ్రామ అధిపతిగా పిలువబడే అతడు మాట నిలబెట్టుకోకపోవడం, ఆ భక్తుడ్ని వేదనకు గురిచేసింది. భగవంతుడిపై ప్రమాణం చేసి దాన్ని నిలబెట్టుకోకపోవడం భగవంతుడి ఉనికినే ప్రశ్నించినట్లయింది. అందుకే గుండెలో కొండంత బాధను భరిస్తూ ఆ ప్రదేశానికి వెళ్లి దేవుడి ముందు తన బాధను వ్యక్తపరుస్తాడు. ఈ స్థితిలో తనేం చేయాలో చెప్పమని ప్రశ్నిస్తాడు. అప్పుడు ఆ భక్తుడి సమస్య తీర్చడానికి సాక్షాత్తూ కృష్ణపరమాత్మయే ఈ భక్తుడి వెంట సాక్ష్యం చెప్పడానికి బయలుదేరుతాడు. అలా భక్తుడి వెంట నడచివచ్చి సాక్షి గోపాలుడిగా మారిన పుణ్య ప్రదేశమే సాక్షి గోపాలం. దాని గురించి సంక్షిప్తంగా...

సుమారు వేయి సంవత్సరా క్రితం పూరీకి దగ్గరలో గల ఒక గ్రామంలోని ప్రజలందరూ దైవభక్తులు గాను, సాత్వికులుగాను ఉండేవారు. ఆ గ్రామ పెద్దని గ్రామ ప్రజలందరూ 'అధిపతి'గా పిలిచేవారు. ఊరిలో ఏ కార్యమైనా, సంబరమైనా, తీర్థయాత్రయైనా పిల్లా, పెద్దా, యజమాని, సేవకుడు అనే భేదభావం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసేవారు. తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు ఆ గ్రామ కుటుంబాలన్నీ కలిసి వెళ్తుండేవి. ఒకసారి ఆ గ్రామ ప్రజలందరూ తీర్థయాత్రలు చేయాలని సంకల్పము చేసుకున్నారు. పుణ్య క్షేత్రాలన్నీ దర్శించుకుందామని నిర్ణయించుకున్నారు.

ఒక యాభై మంది దాక కాలినడకన దివ్య క్షేత్రాలను



చూడడానికి బయలుదేరారు. అందరితో పాటుగా ఆ గ్రామ పెద్ద అయిన 'అధిపతి' కూడా వారితో కలిసి బయలుదేరాడు. యువకులు, మధ్యవయస్కులు, వృద్ధులు ఇలా ఎంతోమంది పుణ్యక్షేత్ర దర్శనానికి బయలుదేరారు.

అధిపతి మాత్రం ఒక్కడే బయలుదేరాడు. మిగిలిన కుటుంబ సభ్యులు అతడి వెంట రాలేదు. ఈ విధంగా అందరూ కలిసి దివ్యక్షేత్ర దర్శనాలు చేసుకుంటూ 'బృందావనం' చేరుకున్నారు. బృందావనం చేరుకునేసరికి ఆరుపదుల వయసు దాటిన అధిపతి అలసిపోయాడు. విషజ్వరం సోకింది. అతడికి సేవచేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అయితే ఆ గ్రామంలోనే నివసిస్తున్న 'హరిదాసు' అనే పాతిక సంవత్సరాల యువకుడు మాత్రం అధిపతి అనారోగ్యంతో బాధపడడం చూసి చలించిపోయాడు. తను ఏమాత్రం భయపడకుండా అతడితో పాటుగా ఉండి బృందావనములో గల వైద్యుడ్ని సంప్రదించి అధిపతికి సరైన వైద్యం చేయిస్తూ పదిరోజుల పాటు సేవ చేయడం వలన కోలుకోగలిగాడు.

అధిపతి ఆరోగ్యం కుదుట పడిన తర్వాత హరిదాసుతో ''నాయనా! నీకు నాకు మధ్య ఏ రుణానుబంధం ఉందో తెలియదు. నాకు సేవ చేసి ఆరోగ్యమును సమకూర్చినందుకు బహుమతిగా నా కూతుర్ని నీకిచ్చి వివాహం చేస్తాను'' అన్నాడు.

అందుకు హరిదాసు ''బాబుగారు! నేను మీ దగ్గర నుండి ఫలితాన్ని ఆశించి సేవ చేయలేదు. సాటి మనిషిగా మీరు బాధపడడం చూడలేక మీకు సేవచేశాను. అంతే తప్ప మరొకటి కాదు''అన్నాడు.

''నువ్వు ఫలితం ఆశించినా, ఆశించక పోయినా నాకు సోకిన విషజ్వరం వలన మా ఊరి ప్రజలందరూ భయపడిపోయి నా దగ్గరకు రాలేదు. నీవొక్కడివే ధైర్యంగా ముందుకు వచ్చి సేవచేసి ప్రాణదానం చేశావు. కాబట్టి కృతజ్ఞతగా నేనిస్తున్న బహుమతిని తీసుకోవలసిందే. తప్పదు. లేకపోతే ఇక్కడ స్వయంభువుగా వెలిసియున్న కృష్ణపరమాత్మపై ఆన''అన్నాడు.

కృష్ణ పరమాత్మపై అధిపతి ప్రమాణం చేయడం కృష్ణ భక్తుడైన హరిదాసుని సంకటంలో పడవేసింది. తన ఆరాధ్య దైవమైన కృష్ణుడిపై ప్రమాణం చేశాడు. కాబట్టి హరిదాసు కాదనలేక అధిపతి కోరికను మన్నించాడు.

తదనంతరం ఆ గ్రామ ప్రజలతో పాటుగా అధిపతి, హరిదాసు బృందావనంలోని శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. ఇంకా అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకుని స్వగ్రామం చేరుకున్నారు. జబ్బు పడిన సంగతి.. హరిదాసు తనకు సేవచేసిన సంగతి, అందుకు బహుమతిగా తన కుమార్తెను ఇచ్చి వివాహం జరిపిస్తానన్న విషయం, ఆ బృందావన కృష్ణుడిపై చేసిన ప్రమాణం గురించి సవివరంగా కుటుంబ సభ్యులకు తెలియపరిచాడు.

అయితే అధిపతి భార్యగాని, కొడుకులుగాని, ఇతర కుటుంబ సభ్యులుగాని హరిదాసుకి పిల్లనిచ్చి వివాహం చేయడానికి ఒప్పుకోలేదు. పైగా కంటికి కనబడని దేవుడిపై ప్రమాణం చేస్తే ఆయన వచ్చి ఎలా సాక్ష్యం చెబుతాడు? చెప్పలేడు కదా! కాబట్టి వివాహం చేయననే విషయాన్ని కచ్చితంగా చెప్పమని అధిపతికి అతడి కుటుంబ సభ్యులు వారి యొక్క నిర్ణయాన్ని తెలియజేశారు.

అధిపతి హరిదాసుని పిలిచి ''తన కుటుంబ సభ్యులు వివాహానికి ఒప్పుకోవడం లేదని, అందుకే మాట నిలబెట్టుకోలేక పోతున్నానని, ఈ విషయంలో నిస్సహాయుడిని అయిపోయాను'' అంటాడు.

అందుకు హరిదాసు ''ఈ ఊరి పెద్దలైన మీరే మాట తప్పితే ఎలా? మీరు మీ అమ్మాయిని నాకిచ్చి వివాహం చేయనందుకు విచారించడం లేదు. కానీ నా ఆరాధ్య దైవమైన కృష్ణ పరమాత్మపై ప్రమాణం చేసి మాట తప్పడం నాకు బాధ కలిగిస్తోంది'' అంటాడు.

అందుకు అధిపతి ''పిచ్చివాడా! ఆ కృష్ణిడిపై ప్రమాణం చేశాను. నిజమే. అయితే మీ వివాహం జరిపించడానికి అతడు వచ్చి సాక్ష్యం చెబుతాడా! లేదే.. అదంతా ఉట్టిదే''అని అంటాడు.

''లేదు.. లేదు.. భగవంతుడిపై చేసిన ప్రమాణం ఊరికే పోదు తనకు తానుగానే పరమాత్మ ఈ విషయాన్ని ఏదో ఒక విధంగా నిరూపణ చేస్తాడు.''

''అలా నిరూపిస్తే తప్పనిసరిగా నీకు నా కూతర్ని ఇచ్చి వివాహం జరిపిస్తాను'' అంటాడు అధిపతి.

'సరే' అని అధిపతి దగ్గర సెలవు తీసుకొని తిరిగి బృందావనానికి బయలుదేరుతాడు హరిదాసు.

అధిపతి కూతుర్ని వివాహం చేసుకోవడం తనకు ముఖ్యం కాదు. తను ఆరాధించే కృష్ణ పరమాత్మపై చేసిన ప్రమాణం సత్యమవ్వాలన్నదే అతడి ఆలోచన. అందుకే బృందావనం బయలుదేరాడు. అక్కడ కృష్ణ పరమాత్మ సన్నిధిలో నిలబడి ఈ విధంగా మాట్లాడుతాడు.

''తండ్రీ.. మా గ్రామ పెద్ద అయిన 'అధిపతి' తన కూతుర్ని నాకిచ్చి వివాహం చేస్తానని.. ఇక్కడ నీపై ప్రమాణం చేసి నన్ను ఒప్పించాడు. తీరా ఊరు చేరుకున్నాక తను చేసిన ప్రమాణాన్ని ప్రక్కనపెట్టి వివాహం చేయనని అంటున్నాడు. ఇచ్చిన మాట తప్పడం నా దృష్టిలో పెద్దనేరం. అందులోకి నీపై ప్రమాణం చేసి ఆ మాట నిలబెట్టుకోకపోవడం క్షమించరాని అపరాధం. ఆ విషయం గ్రామ పెద్దకి తెలియడం లేదు. నీవే తెలియ పరచాలి.

నాదొకటే వేదన కృష్ణా! ఇప్పుడు 'అధిపతి' కూతురుతో నాకు వివాహము జరుగకపోతే నీపై చేసిన ప్రమాణం వృథా. అప్పుడు నీవుగానీ, నీ మహిమలు గానీ నిరర్ధకమవుతోంది కృష్ణా! నువ్వు లేవనే వాదం సమాజంలో బలపడుతోంది. అందుకే నా వేదన''అంటూ రోదిస్తాడు.

అతడి రోదనకు కృష్ణ పరమాత్మ కరిగిపోయి అశరీరవాణిగా ఇలా పలుకుతాడు. ''భక్తాగ్రేసరా! మీ గ్రామ పెద్ద నాపై చేసిన ప్రమాణం ఊరికేపోదు. నేను దానిని నిజం చేస్తాను. జరిపిస్తాను. నీతో పాటుగా నడచి వస్తాను. అయితే నీవెంట నేను వస్తున్నానన్న విషయం గ్రహించడానికి నీకు నా కాలి మువ్వల సవ్వడి, వేణుగానం వీనుల విందుగా వినిపిస్తూ ఉంటాయి. అయితే ఒక షరతు.. ఎట్టి పరిస్థితులలోనూ నీవు వెనుతిరిగి చూడకూడదు. పొరపాటున అయినా సరే వెనుతిరిగి చూసిన పక్షంలో నేను అదృశ్యమైపోతాను''అన్న మాటలు విన్న హరిదాసు ఆశ్చర్యచకితుడవుతాడు.

ఆనందం నిండిన హృదయంతో హరిదాసు ''పరంధామా! నీవు చెప్పినట్లుగానే నడుచుకుంటాను. ఎట్టి పరిస్థితులలోనూ వెనుతిరిగి చూడను'' అంటాడు.

కొద్ది క్షణాల అనంతరం హరిదాసు స్వగ్రామానికి బయలుదేరతాడు. అతడు బయలుదేరిన వెంటనే వెనుకగా కృష్ణ పరమాత్మ బయలుదేరినట్లు అతడికి గుర్తుగా కాలిమువ్వల సవ్వడి, శ్రవణానందంగా వేణుగానం వినబడసాగింది. కృష్ణ పరమాత్మని తలచుకుంటూ హరేకృష్ణ.. హరేకృష్ణ అంటూ ప్రార్థన చేస్తూ నడవసాగాడు హరిదాసు.

అలా భగవంతుడు, భక్తుడు ఒకరి వెంట మరొకరు నడుచుకుంటూ అనేక పుణ్యక్షేత్రాలు దాటారు. పూరీక్షేత్రాన్ని కూడా దాటవేశారు.

సరిగ్గా పూరీ క్షేత్రానికి 17 కి.మీ. దూరంలో గల తన గ్రామానికి చేరుకోబోతున్నారు. సరిగ్గా గ్రామ పొలిమేరల దగ్గరకు వచ్చేసరికి హరిదాసుకి కృష్ణుడి కాలిమువ్వల శబ్దం, వేణుగానం వినబడకపోయేసరికి వెనుతిరిగి చూశాడు. అంతే స్థానువై నిలబడిపోయాడు. ఎందుకంటే బృందావనంలో గల శ్రీకృష్ణ పరమాత్మ అక్కడ ఆ ప్రదేశంలో శిలామూర్తియై స్వయంభువుగా వెలిశాడు.

హరిదాసు ఆ పరమాత్మ కాళ్లపై పడి.. నీవు ముందుగా చెప్పినా వినకుండా వెనుతిరిగి చూశానని.. తనని క్షమించమని రోధించాడు.

అప్పుడు అశరీరవాణిగా కృష్ణ పరమాత్మ 'భక్తవరేణ్యా! నేను నీ వివాహం చేయడానికని సాక్షిగా ఇక్కడకు వచ్చాను. కాబట్టి ఇక్కడకు వచ్చిన వెంటనే నీకు నా కాలిమువ్వల శబ్దం, వేణుగానం వినబడకుండా చేసి నీవు వెనుతిరిగి చూసినట్లుగా చేశాను. ఈ విషయం గ్రామ పెద్దకి తెలియజేయు' అంటాడు.

అంతలోనే ఆ గ్రామ ప్రజలకి ఈ విషయం తెలిసి గుంపులు గుంపులుగా వచ్చి కృష్ణ పరమాత్మ దర్శనం చేసుకుంటున్నారు. అధిపతి తనకు కుటుంబ సభ్యులతో కలిసి అక్కడకు వచ్చాడు. అప్పుడు మరలా కృష్ణ పరమాత్మ సందేశం స్వయంభువుగా వెలిసిన విగ్రహంలో నుండి ఈ విధంగా వినబడింది.

''అధిపతి! నీవు నీ కుమార్తెను హరిదాసుకి ఇచ్చి వివాహం చేస్తానని బృందావనంలో నా సన్నిధిలో ప్రమాణం చేశావు. అయితే చేసిన ప్రమాణం నిలబెట్టుకోకుండా మాట తప్పావు. అందుకే సాక్ష్యం చెప్పడానికి స్వయంగా నేనే కదలి నా భక్తుడైన హరిదాసు వెంట నడచి వచ్చాను. కాబట్టి మరియొక ఆలోచన లేకుండా నీ కుమార్తెను హరిదాసుకిచ్చి పెళ్లి చేయి. నా భక్తుడి వివాహం కొరకు ఒక సాక్షిగా వచ్చి ఈ గ్రామంలో వెలిసినందున ఇక నేటి నుండి ఈ ప్రదేశం సాక్షి గోపాలంగా పిలువడుతుంది. ఇక్కడి వచ్చి కోరుకున్న ప్రతి భక్తుడి కోరికను నిస్సంకోచంగా తీరుస్తాను. అందుకుగాను నా భక్తులందరికీ సాక్షిని నేనే''.

ఆ మాటలు విన్న గ్రామ ప్రజలందరూ ఆశ్చర్యానందాను భూతులకు లోనవుతారు. తరువాత ఆ గ్రామ పెద్ద అధిపతి కృష్ణ పరమాత్మ సాక్షిగా అక్కడే పెళ్లిపందిరి వేసి తన కుమార్తెను హరిదాసుకిచ్చి అంగరంగ వైభవంగా వివాహం జరిపిస్తాడు.

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## సుద్యుమ్నోపాఖ్యానము

''మునులారా! అందరూ వచ్చినట్లేనా? ఇంకా రావాలసినవారు ఎవరైనా ఉన్నారా''అని అడిగాడు సూత మహర్షి.

''అందరూ వచ్చారు స్వామీ''అని శౌనకుడు సమాధానమివ్వడంతో చెప్పటం ప్రారంభించాడు సూతుడు.

''మోక్షాన్ని పొందటానికి అనేక మార్గాలున్నాయి. 'సుద్యుమ్నుడ'నే మహారాజు దండనీతిని పాటించి కైవల్యాన్ని పొందాడు. ఈ విషయాన్నంతటినీ కర్ణుని జన్మ గాథ విన్న ధర్మరాజు బాధపడుతుండగా యుద్ధనీతిగాని, దండనీతిగాని పాపాన్ని కలిగించదు, పుణ్యాన్నే ప్రసాదిస్తుందని ధర్మజునికి హితబోధ చేస్తాడు వ్యాసమహర్షి. ఆ సందర్భంలో వ్యాస ముని చెప్పిన ఇతిహాసమే సుద్యుమ్నుని చరిత్ర. దండనీతిని సక్రమంగా ఆచరిస్తే మోక్షం కలుగుతుందా అని ఆశ్చర్యపోతూ శౌనకాది మునులందరూ గురువుగారినే చూస్తూ ఉండిపోయారు. మళ్లీ చెప్పసాగాడు సూతుడు.

''సుద్యుమ్న మహారాజు రాజ్యంలో బాహుదానదీ తీరంలో ఇద్దరు అన్నదమ్ములు నివసిస్తూ ఉండేవారు. వారి పేర్లు శంఖుడు, లిఖితుడు. ఆ బ్రాహ్మణోత్తములిద్దరూ అత్యంత ధర్మపరులు. నిష్ఠాగరిష్ఠులు. వేదవేదాంగాలు కూలంకషంగా అధ్యయనం చేసిన వారి ఆలోచనలు, ప్రవర్తనలు ఎప్పుడూ ధర్మమార్గం వైపే ప్రయాణం చేసేవి. వారి ఆశ్రమాలు కూడా అత్యంత ఆకర్షణీయంగా ఉండేవి. రకరకాల పూల చెట్లతోను, వివిధ ఫల వృక్షాలతోను బహు సుందరంగా ఉండటంతో ఆశ్రమాల శోభ కన్ను త్రిప్పుకోవటానికి అలవి కాకుండా ఉండేది. ఒకనాడు అన్న యింట లేని సమయంలో లిఖితుడు అన్న ఇంటికి వెళ్లాడు. శంఖుని ఆశ్రమంలో ఒక చెట్టు నిండా ఆరముగ్గిన పండ్లు కళకళలాడుతూ ఉండటంతో అది చూసిన లిఖితుడు కోరిక వెంటరాగా ఆ పళ్లను కోసి కడుపారా తిన్నాడు. ఆ తరవాత కొద్దిసేపటికి శంఖుడు ఇంటికి వచ్చి ఎదురుగా ఇంటి నిండా ఉన్న పండ్లను చూసి ఆశ్చర్యపోయి ''తమ్ముడా!

ఈ పండ్లన్నీ ఎక్కడివి నాయనా?" అని అడిగాడు. సత్యవాది అయిన లిఖితుడు "ఈ పళ్లు నీవే. ఇక్కడివే"అని చెప్పడంతో శంఖుడు తమ్ముడు చేసిన నేరానికి శిక్ష ఏమిటా? అని ఆలోచించి ధర్మబుద్ధితో ఇలా చెప్పాడు" అని సూతుడు ఒక్క క్షణం ఆగడంతో పళ్లు కోసి, తిన్నందుకు తమ్ముడిని శిక్షించాడా శంఖుడు అని దిగ్భ్రాంతి చెందారు మునులంతా.

"శంకుడు లిఖితుని చూసి ఏమన్నాడంటే – తమ్ముడా! నా అనుమతి తీసుకోకుండా పళ్లు కోసి ఉపయోగించవచ్చా! ఇది దొంగతనం కాదా? నీవు పాపం చేశావు. రాజు వద్దకు వెళ్లి, నీ నేరాన్ని ఒప్పుకొని, ఆతని చేత శిక్షించబడి, పాపరహితుడివికా!"అని చెప్పడంతో తాను చేసిన దోషాన్ని తెలుసుకున్న లిఖితుడు "అన్నా! నీవు చెప్పినట్లే చేసి పాపరహితుడనౌతాను" అని వినయవంతుడైనాడు. ఋషులారా! వారిద్దరూ, ఎవరిపాటికి వారు ఎంత నీతిమంతులో చూడండి. అన్న నా నేరాన్ని ఎత్తిచూపుతాడా? అని తమ్ముడు కోపగించుకోలేదు. తమ్ముడిలో తప్పు చూపిస్తే ఏమనుకొంటాడో అని అన్న బాధకు గురికాలేదు. ఎవరి ధర్మం వారు నిర్వర్తించారు. అన్న ఆజ్ఞను శిరసావహించిన లిఖితుడు వెంటనే మహారాజైన సుద్యుమ్నుని దర్శించటానికి వెళ్లాడు. రాజద్వారం వద్ద నిలబడి ప్రతీహారులచేత తన రాక రాజుగారికి తెలియజేశాడు.

"లిఖితుడెంత తపస్సంపన్నుడో చూడండి. ఆ మహాముని వచ్చాడన్న వార్త వినగానే సుద్యుమ్నుడు గద్దె నుండి వెంటనే లేచినవాడై తనతోపాటు మంత్రులను కూడా వెంట తీసుకొని లిఖితుని చెంతకు వచ్చి వినయ వినమితాంగుడై నమస్కరించి –

**'మీరలిచ్చటికి వేంచేసిన ప్రయోజనంబేమి? యానతిండు మీ చెప్పినట్ల చేసెద' – 161వ – ప్ర.ఆ. – శాంతిపర్వము – మ.భా.**

నని విన్నవించాడు.

అప్పుడు లిఖితుడు సుద్యుమ్నుని వినయ వర్తనకు మనసులోనే అభినందించినవాడై "రాజదండాన్ని ధరించి అపరాధులను శిక్షించే మహారాజులలో అగ్రగణ్యుడవైన సుద్యుమ్న మహారాజా! నేను ఏది చెబితే అది తప్పకుండా చేస్తానని మాట ఇచ్చావు. ఇచ్చిన మాట తప్పకుండా నేను చేయమన్న పనిని చేసి తీరాలి. మరిచిపోవుగదా! మాట తప్పటం మాననీయుడి లక్షణం కాదు. అందునా నీవు మహారాజువు. న్యాయ సమ్మతంగా ప్రజలను పాలించే ధర్మపరుడవని విన్నాను. ఆ ఆలోచనతోనే, నేను వచ్చిన సంగతి చెబుతున్నాను. రాజా! మా అన్న అనుమతిని తీసుకోకుండా ఆ మహానుభావుని ఆశ్రమంలో విరగకాచిన చెట్ల పళ్లను కోసి తిన్నాను. ఆ పని తప్పా, ఒప్పా అని ఆలోచించకుండా ఆశాపరుడినై ఆ పళ్లను ఆరగించాను. అన్న చెప్పిన తరవాత తెలిసింది – నేను చేసినది దొంగతనమని. అందుచేత దొంగనైన నన్ను – దొంగలను శిక్షించే విధంగా శిక్షించి నన్ను పాపరహితుడిగా చేయవలసిందని కోరుతున్నాను.

**"మహాత్మా!
నీవు పాపరహితుడివి.
నీ చరిత్రలో పవిత్రత అడుగడుగునా
నిలిచి ఉంది. ఆ జన్మాంతం ధర్మపరుడివే.
అటువంటిది నీవు నేరకార్యాన్ని చేశావంటే అది
సమంజసమైన విషయం కాదు. ఏది ఏమైనా నిన్ను
దండించమని నీవు నన్ను నియోగించటాన్ని
అంగీకరించలేకపోతున్నాను. పుణ్యపురుషా!
నీ ఆజ్ఞను ఉపసంహరించుకోవలసిందిగా నీ
పాదాలంటి ప్రార్థిస్తున్నాను. నా కోరిక
మన్నించు"**

ఎందుకంటావేమో! శిక్ష అనుభవిస్తే పాపం పోతుంది గదా! పైగా రాజుచేత దండింపబడినవాడిని యమధర్మారాజు దండించడని పెద్దలు చెబుతుంటారు. నీవు గనుక నన్ను శిక్షిస్తే రాజుగా (దండించేవాడిగా) నీ కర్తవ్యాన్ని నీవు నెరవేర్చినవాడివై పాపం పొందకుండా ఉండగలుగుతావు. నా మాటల నాదరించి నేరస్తుడనైన నన్ను శిక్షించి, నా కోరిక నెరవేర్చు"అని గట్టిగా చెప్పిన లిఖితుని చూసి ఆశ్చర్యపోయాడు సుద్యుమ్న మహారాజు. లిఖితుని నిజాయితీకి మనసులోనే మెచ్చుకున్నా, వెంటనే అంతటి మహనీయుని తాను శిక్షించటమా అని వేదన పాలయినాడు. లిఖితుని, ఆయన మాటను వెనుకకు తీసుకోమని ప్రార్థించసాగాడు.

**"అనఘచరిత! యిట్లు నను నియోగించుట
యుడుగు' మని యమాత్యయుతము గాగ
భక్తిమెఱసి యెన్నిభంగుల చెప్పిన
నియ్యకొనకయున్న నెట్టకేని"**

**–164 ప. – ప్ర.ఆ. – శాం.ప. –మ.భా.**

"మహాత్మా! నీవు పాపరహితుడివి. నీ చరిత్రలో పవిత్రత అడుగడుగునా నిలిచి ఉంది. ఆ జన్మాంతం ధర్మపరుడివే. అటువంటిది నీవు నేరకార్యాన్ని చేశావంటే అది సమంజసమైన విషయం కాదు. ఏది ఏమైనా నిన్ను దండించమని నీవు నన్ను నియోగించటాన్ని అంగీకరించలేకపోతున్నాను. పుణ్యపురుషా! నీ ఆజ్ఞను ఉపసంహరించుకోవలసిందిగా నీ పాదాలంటి ప్రార్థిస్తున్నాను. నా కోరిక మన్నించు"అని సుద్యుమ్నుడు భక్తిప్రపత్తులతో అనేక విధాలుగా లిఖితుని వేడుకొన్నాడు. సుద్యుమ్నుని మంత్రులందరు 'మీ మాటను

ఉల్లంఘిస్తున్నందుకు ఆగ్రహావేశాలకు లోను కావద్ద'ని చేతులు జోడించారు. కాని లిఖితుడు మాత్రం వారి మాటలను అంగీకరించలేదు.

''నేను నీ పాలనతో జీవిస్తున్న ఒక పౌరుడిని. నా నేరాన్ని నేనంగీకరించి నన్ను శిక్షించమని అర్థిస్తున్నాను రాజా! నేరస్తులను శిక్షించే దండనాధికారివి నీవు. నీవు నాకు శిక్ష విధించి నీ విధిని నిర్వర్తించు''అని లిఖితుడు పలకడంతో న్యాయశాస్త్రానుసారంగా శిక్షవిధించక తప్పలేదు సుద్యుమ్నుడికి. చోరుడికి విధించే శిక్షనే లిఖితుడికీ విధించాడు. దండనీతి సూత్రపారీణుడగు ఆ మహారాజు చిట్ట చివరకు లిఖితుని రెండు చేతులూ నరకవలసిందిగా దండనోద్యోగులను ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞప్రకారం ఉద్యోగులు లిఖితుని రెండు చేతులను ఖండించడంతో తన పాపపరిహారం జరిగినందుకు లిఖితుడు ఎంతగానో సంతోషించాడు. కించిత్తు బాధపడలేదు సరికదా, ఆ వేదవిదుడు సుద్యుమ్నుని అనేక విధాల ఆశీర్వదించి అన్నగారున్న ఆశ్రమానికి వెళ్లాడు. లిఖితుని ధైర్యానికి, ధర్మవర్తనకు ఆశ్చర్యపోయి, మెచ్చుకోవటం సుద్యుమ్నుని వంతైంది.

**''మునులారా!**
**దూరదృష్టితో ఆలోచించి**
**పనులు చక్కబెట్టుకునే 'దీర్ఘ దర్శి'**
**అనే మత్స్యవిభుని గురించి**
**చెబుతాను. జీవితంలో మానవుడు**
**ముందుచూపుతో ఎలా ప్రవర్తించాలి'**
**అనే ప్రశ్నకు ఈ ఉపకథ ఒక చక్కని**
**తీర్పునిస్తుంది''**

'మునులారా! ఆ అన్నదమ్ముల అనుబంధం ఎంతగొప్పదో చూడండి. లిఖితుడు శంఖుడి వద్దకు వెళ్లి తెగనరకబడిన తన రెండు చేతులు చూపించి 'అన్నా! నేను చేసిన పాపకృత్యానికి సరైన దండన అనుభవించాను. నీకు సమ్మతమే గదా!' అని కాళ్ల మీద పడ్డాడు. తమ్ముడు చేసిన పనికి సంతోషించి — 'నాయనా! ఎప్పుడూ ధర్మమార్గాన్ని ఉల్లఘించరాదు. నీ కారణంగా మన వంశమంతా దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది చూడు' అన్న శంఖుని మాటలు విని లిఖితుడు 'అన్నా! ఇప్పుడు నా కర్తవ్యమేమిటో సెలవియ్యి''అని వినయంగా కళ్లతోనే నమస్కరించాడు.

వెంటనే శంఖుడు లిఖితుని వైపు ప్రేమగా చూస్తూ ''లిఖితా! బాహుదానదికి వెళ్లి అందులో స్నానమాచరించి, ఆ నదీమ తల్లి పవిత్ర జలాలలో దేవతలకు, మునులకు, పితృదేవతలకు తర్పణలు వదిలి పుణ్యుడివికా. ఒకమాట చెబుతాను విను.

**''కలు ద్రావుట, గురుపత్ని కవయుటయును,**
**విప్రు(జంపుట, బ్రహ్మస్వవిషయమైన**
**ముచ్చిలుటయును నివిగల క్రూర జనుల**
**ప్రీతి, బొందుటయును మహా పాతకములు'**
**—168ప. — ప్ర.ఆ. —శాం.ప—మ.భా.**

''కల్లు త్రాగడం, గురువుగారి భార్యతో సంగమించటం, విప్రోత్తముని చంపటం, విప్రునికి చెందిన ధనాది వస్తువలను అపహరించటం, క్రూరాత్ములతో ఇష్టపూర్వకంగా మైత్రి సల్పటం అనేవి మహా పాతకాలు (పోగొట్టలేని గొప్ప పాపాలు) అని తెలుసుకో. ఈ అయిదు పాపాలలో ఏ ఒక్క దానిని చేసినా, ఏ కులస్థుడైనా శిక్షార్హుడౌతాడు. ముఖ్యంగా అతడు చోరుడు కనుక అయితే అతని శరీరం శిక్షింపబడటానికి యోగ్యుడౌతాడు. రాజు చేత శిక్షింపబడితే కనుక ఆ విధంగా శిక్షింపబడినవారు పుణ్యాత్ములు పొందే పుణ్యలోకాలను పొందగలుగుతారు. రాజదండనకు అంతటి శక్తి ఉంటుందని గ్రహించు. అందుచేతనే నిన్ను రాజదండనే పొంది రమ్మనమని చెప్పాను. సుద్యుమ్న మహారాజు చేత నీవు తగిన దండననుభవించావు. అందువల్ల నీవు పుణ్యాత్ముడవైనావు. అంతేకాదు. వంశోద్ధారకుడవు కూడా అయినావు. సంతోషించు. వెళ్లు. నేను చెప్పిన విధంగా బాహుదానది వద్దకు వెళ్లి ఆ నదిలో భక్తిపూర్వకంగా తర్పణలు వదిలి పుణ్యుడివికా''అని అనగానే లిఖితుడు శంకుడికి మళ్లీ నమస్కరించి నదీమ తల్లి దగ్గరకు వెళ్లాడు.

**''బాహుదానది యందవగాహనంబు**
**సేయ ప్రభవించెనాతని చేతులపుడ**
**విస్మయంబంది యతడు వేవేగ వచ్చె**
**నన్నపాలికి మగుడ ప్రహర్షమెసగ''**
**—170ప. —ప్ర.ఆ. —శాం.ప.— మ.భా.**

''బాహుదానది వద్దకు వెళ్లిన లిఖితుడు పవిత్రమైన మనస్సుతో, భక్తియుక్తుడై ఆ నదీమ తల్లికి నమస్కరించి, అందులో మునిగాడు. అంతే ఆతని రెండు చేతులూ మొలిచాయి. మునుపటిలాగానే రెండు చేతులూ పటిష్ఠంగా ఉండటంతో లిఖితుడు అమితాశ్చర్యానికి లోనైనాడు. పరమానందంతో వెంటనే గబగబా పరుగెత్తి మళ్ళా అన్నను చేరుకొన్నాడు. ఎఱ్ఱతామరలలాగా అరుణకాంతులతో మెరిసిపోతున్న తన రెండు చేతులను చూపి శంఖుని కాళ్ల మీద పడ్డాడు. 'ఇదేమిటి అన్నా!' అంటూ దానికి శంఖుడు ఆశ్చర్యపడలేదు. పైగా—

**''దీనికి నచ్చెరు పడనేల?**
**యిది మదీయ తపోవిభవంబున దైవకృతంబైన**
**విశేషంబు, నీవు శుచివగుటదైవంబునకెక్క**
**సుద్యుమ్నుండును నీ పుణ్యాను**

**స్థానంబున నిజపితృవర్గసహితంబుగా**
**నిర్మలాత్మండెయ్యె"ననియె.**

**–171 ప.– ప్ర.ఆ.– శాం.ప. – మ.భా.**

"మునులారా! అప్పుడు శంఖుడేమన్నాడో విన్నారా? నీకు చేతులు యథావిధంగా రావటాన్ని ఆశ్చర్యంగా అనుకోవలసిన పనిలేదు. ఎందుకంటే ఇదంతా నేను చేసిన తపస్సు మెచ్చిన దైవం ప్రసాదించిన వరమనుకో. మరొక విషయం. నీవు పరిశుద్ధాత్ముడివి కావటం భగవంతుడికి మెచ్చుకొలిపింది. అంతేకాదు. నీవు చేసిన పుణ్యకార్యం వల్ల, సుద్యుమ్నుడు తన విధిని తాను నిర్వహించి, పితృదేవతలతో, తన వారితో, నిర్మలాత్ముడై పరమపుణ్యాత్ముడైనాడు"అని చెప్పి తమ్ముని వాత్సల్యంతో దీవించాడు. అదీ తపోవిభవం వల్ల లభించే పుణ్యఫలం, భగవదనుగ్రహం. అన్నదమ్ములంటే ఆ విధంగా ఉండాలి. కోపతాపాలు లేకుండా, శాపానుగ్రహాలను ప్రదర్శించకుండా, కేవలం భగవద్భక్తితో, పుణ్యకార్యాల నిర్వహణలో, తపాచారణతో, అన్యోన్య ప్రేమభావనతో, వాత్సల్య వినయాలతో ఉండటమే తమ కర్తవ్యంగా భావిస్తూ మెలగాలి. అందుకు శంఖలిఖితుల చరిత్రే చక్కని ఉదాహరణ"అని శౌనకాది మునులందరివైపు సాదరంగా చూశాడు సూత మహర్షి. మరో ముఖ్య విషయం ఏమిటంటే తప్పు చేసిన వారిని పాలకుడు తప్పనిసరిగా దండించి తీరాలని, అంతేకాక శంఖుని లాగా నేరస్తుని తెలుసుకొన్నవారు ఎవరైనాసరే ఆ నేరస్తుని దండించి తన విధిని తాము పాటించాలని"అంటూ ఆనాటికి ముగించిన గురువుకు లేచి అందరూ నమస్కరించి తమ అభిప్రాయాన్ని నివేదించారు.

# దీర్ఘ దర్శి

అల్లంత దూరాన సూత మహర్షి వస్తున్నది గమనించి మునులందరూ భక్తి గౌరవాలతో లేచి నిలబడ్డారు. వారి వినయానికి సంతోషించిన సూతుడు ఆశీర్వదిస్తూ వేదికనలంకరించాడు.

**"'దీర్ఘ దర్శి' అంటే భవిష్యత్తులో కష్టం కలగకుండా ఉండటానికి ముందుగానే ఆలోచించి దానికి తగిన పథకం వేసుకుని జాగ్రత్త పడేవాడు. ప్రాప్తకాలజ్ఞుడు అంటే కాలానుగుణంగా అప్పటికప్పుడు ఆలోచించి ఆపదను తొలగించుకొనే నేర్పరి. దీర్ఘసూత్రుడు అంటే అనాలోచితంగా మెల్లగా పనులు చేస్తూ ముందుచూపు లేకుండా అజాగ్రత్తగా మసలుతూ ఆపదకు లోనయ్యేవాడు."**


"మునులారా! దూరదృష్టితో ఆలోచించి పనులు చక్కబెట్టుకునే 'దీర్ఘ దర్శి' అనే మత్స్యవిభుని గురించి చెబుతాను. జీవితంలో మానవుడు ముందుచూపుతో ఎలా ప్రవర్తించాలి' అనే ప్రశ్నకు ఈ ఉపకథ ఒక చక్కని తీర్పునిస్తుంది"

జల జంతువులు విరివిగా ఉండే ఒక పెద్ద ఏటిలో మూడు చేపలు సఖ్యంగా నివసిస్తుండేవి. వాటి పేర్లు – దీర్ఘ దర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు. వాటి పేర్లు కూడా వాటి ప్రవర్తనకు అనువుగానే ఉన్నాయి. 'దీర్ఘ దర్శి' అంటే భవిష్యత్తులో కష్టం కలగకుండా ఉండటానికి ముందుగానే ఆలోచించి దానికి తగిన పథకం వేసుకుని జాగ్రత్త పడేవాడు. ప్రాప్తకాలజ్ఞుడు అంటే కాలానుగుణంగా అప్పటికప్పుడు ఆలోచించి ఆపదను తొలగించుకొనే నేర్పరి. దీర్ఘసూత్రుడు అంటే అనాలోచితంగా మెల్లగా పనులు చేస్తూ ముందుచూపు లేకుండా అజాగ్రత్తగా మసలుతూ ఆపదకు లోనయ్యేవాడు. ఈ మూడు చేపలు నీటి కొరత లేకుండా ఉన్న ఆ ఏటిలో హాయిగా జీవిస్తుండగా కొంత కాలానికి వేసవి వచ్చింది. ఆ ఎండవేడికి నీరు తగ్గడం చూసిన 'దీర్ఘ దర్శి' అనే మత్స్యం మిగిలిన రెండింటికీ చూసి తన దీర్ఘ దర్శిత్వాన్ని మెత్తగా తెలియజేసింది.

**"మడు వింకగ పాఱెడు; నీ**
**రెడ త్రెవ్విన నొండు సోటికేగగ రాదె**
**ప్పుడు నింకని నీళ్లలు గల**
**మడువునకుంబోవలదె మనకిట్టియెడన్?**

**–186 పం.– తృ.ఆ. –శాం.ప. –మ.భా.**

"మిత్రులారా! గమనించారా! ఈ ఏరు (చెరువు) రోజు రోజుకి ఎండిపోతుంది. ఈ ఏటిలో ఉన్న నీరంతా పూర్తిగా ఎండిపోయిందనుకోండి, వేరే చెరువుకప్పుడు మనం వెళ్లలేం గదా! నీళ్లలోనే మనం ప్రయాణించగలం. ముందుగానే జాగ్రత్తపడి ఎప్పటికీ ఇంకిపోని నీళ్లున్న మడుగుకు మనం వెళ్లటం ఎంతో మంచిదనిపిస్తోంది. ఈ మాత్రం నీళ్లున్నప్పుడే ఈ చెరువు వదలి ఎండకు ఎండిపోని సంపూర్ణంగా జలమున్నచోటికి వెళ్లిపోదాం. ఏమంటారు? మీ అభిప్రాయాలు కూడా చెప్పండి"అని చెప్పి దీర్ఘ దర్శి ఊరుకోగానే ప్రాప్తకాలజ్ఞుడు తన



ఉద్దేశాన్ని వెంటనే తెలియజేశాడు.

"మిత్రమా! నా మాట కూడా విను. నీవు చెప్పింది ఒకరకంగా మంచిదే. కాని ఎప్పుడో ఏదో జరుగుతుందని భయపడి ప్రవర్తించటం ఉచితం కాదు. ఇందులో నీళ్లు పూర్తిగా ఇంకిపోతాయని ఎందుకనుకోవాలి. ఇప్పుడు బాగానే ఉన్నాయి గదా? అంత హడావుడి పడి వేఱొక చెఱువుకు వెంటనే ఎందుకు వెళ్లాలి?

**"అనిన ప్రాప్తకాలజ్ఞుడిట్లనియెఁనేది**
**ప్రాప్తమయ్యె నక్కార్యంబు భంగినెఱిగి**
**యప్పటికిఁదగునట్లు సేయంగవలయు**
**మానితోపాయ వృత్తి నేమఱుట లేక"**

**–187ప.– తృ.ఆ. –శాం.ప. –మ.భా.**

ఎప్పుడు ఏది జరుగుతుందో తెలుసుకొని దానికి తగినట్లుగా అప్పుడు ఉపాయంతో ఏమరుపాటు చెందకుండా కార్యసిద్ధి పొందాలే తప్ప ఎప్పుడో ఏదో కష్టం వాటిల్లుతుందని ఊహించుకొని ఇప్పుడే ఆ పని చేసి తీరాలనుకోవడం నా దృష్టిలో అనవసరం"అని చెప్పి రెండో చేప మూడో చేప వంక చూసింది నీ అభిప్రాయం ఏమిటన్నట్లు. మొదటి రెండు చేపల మాటలను విన్న మూడో చేప వెంటనే తన ఆలోచనను చెప్ప సాగింది. "మిత్రులారా! మీ మాటలన్నీ జాగ్రత్తగా విన్నాను. నా ఆలోచన కూడా వినండి.

**"జల నిధి చందంబున ని**
**మ్మడువొప్పగ నిప్పుడేమి మాడెనె? యిమ్మై**
**నడిచి పదరిత్త నెవ్వగ**
**లుడుగుడు మఱి చూచికొంద మొయ్యన తఱితోన్"**

**–189ప. – తృ.ఆ.– శాం.ప.– మ.భా.**

"ఈ చెఱువు సముద్రంలాగా నిండా నీళ్లతో చక్కగా ఒప్పుతుంటే ఎండిపోతుందని, ఇంకిపోయిందని అంటారెందుకు? ఈ విధమైన వ్యర్థమైన దుఃఖాన్ని వదిలిపెట్టండి. దుఃఖం మిమ్మల్ని అణచివేస్తుంది. అకారణంగా, అనవసరంగా బాధపడుతున్నారు. ఎందుకొచ్చిన దుఃఖం? ఈ ఏడుపు మానేయండి. నిజంగా మీరన్నట్లు అంత కష్టమే గనుక కలిగితే అప్పుడు చూసుకొందాం. ఇప్పటి నుంచే ఆలోచించాల్సిన పనిలేదు. ఈ చెరువును వదిలి వేరెక్కడికో వెళ్లాల్సిన అవసరమూ లేదు"అన్న దీర్ఘ సూత్రుడి మాటలు దీర్ఘ దర్శికి ఎంతమాత్రమూ నచ్చలేదు. వీళ్ల మాటలు పాటిస్తే తనకు ముప్పు తప్పదనుకొన్నాడు.

ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు చెప్పినట్లు – ఇంకా ఈ చెరువులోనే ఉండటం భావ్యం కాదనుకొన్నాడు దీర్ఘ దర్శి. చెరువులోని నీళ్లు రోజురోజుకీ తగ్గిపోతుండటాన్ని వీళ్లెందుకు గుర్తించటం లేదని మిత్రుల గురించి బాధపడ్డాడు. వాళ్లుంటే ఉండనీ, తానుండ కూడదని తలపోశాడు. చెరువు నీరు ఎక్కడ నుండి ఎటువైపు ఎక్కువగా జాలువారుతున్నదో చూసి, అక్కడకు చేరి, ఆ నీటితో పాటు తానుకూడా నడుస్తూ పెద్ద చెరువులోకి చేరుకున్నాడు. పెద్ద చెరువులో నీరు సమృద్ధిగా ఉండటం చూసి, తనకిక దేనికీ భయం లేదని ఊరట చెందాడు. సంతోషంతో పెద్ద చెరువులోనే కాలం గడపసాగాడు. దీర్ఘ దర్శి తమ నుంచి దూరం వెళ్లిపోయినా, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు బాధపడలేదు సరికదా, మిత్రుడు ఒంటరిగా ఏమైపోతాడో అని ఆలోచించలేదు. నిశ్చితంగా ఇద్దరూ ఆ మడుగులోనే ఉండిపోయారు. ఆలా కొంతకాలం గడిచిపోయింది. ఎల్లకాలం పరిస్థితులు ఒకేరకంగా ఉండవు గదా!

చెఱువులోకి వేరేచోట నుంచి ప్రవాహంగా వచ్చి పడే నీరు రావటం తగ్గిపోయింది. కొద్దికొద్దిగా వస్తుండటంతో చెరువులో నీరు సగానికి తగ్గిపోయింది. ఎండ తీవ్రతకు నీరు ఇంకిపోసాగింది. అదే అదననుకొని జాలర్లు చేపలు పట్టడానికి చెరువు చుట్టూ చేరారు. బుట్టలతో, వలలతో, చేతులతో చేపలను పట్టసాగారు. ఎంతో నైపుణ్యంతో తాళ్లను దూరుస్తున్నారు. వారి హడావుడిని, ఉత్సాహాన్ని చూసిన ప్రాప్తకాలజ్ఞుడికి, దీర్ఘసూత్రుడికి చెప్పలేనంత భయం పట్టుకుంది. అప్పటికే ఎన్నో చేపలను పట్టుకొని తాళ్లతో మార్చిన వలలో వేస్తున్నవాళ్ల చాకచక్యానికి తమనేం చేస్తారో అని గిజగిజలాడిపోయారు.

అదంతా చూస్తున్న ప్రాప్తకాలజ్ఞుడు తప్పించుకునే ఉపాయం కోసం ఆలోచనలో పడ్డాడు. జాలర్లు తాము కూర్చిన తాళ్లకు ఒక్కొక్క చేపను గుచ్చడం చూసి, త్రాడుకు గుచ్చిన చేపలాగా ఒక త్రాడును గట్టిగా కరచిపట్టకుంటే సరి – వాళ్లు చచ్చిన చేప అనుకుంటారు"అని అనుకొని తన ఉపాయానికి తానే సంతోషించాడు ప్రాప్తకాలజ్ఞుడు. జాలరులు చేపలు పట్టడం అయిపోయిందనుకొని, విశ్రాంతి తీసుకోగానే కఱచిన తాడును గబుక్కున వదిలివేసి నీటిలోకి దిగిపోవచ్చునుకొని అతడు వెంటనే ఒక తాడును కఱచి, చచ్చిన చేపవలె పడిపోయినట్లు నటిస్తూ ఉండిపోయాడు. ఆ విధంగా సమయస్ఫూర్తితో ప్రాప్తకాలజ్ఞుడు– జాలరి చేపలను పట్టడం ఆపి వాటికంటి ఉన్న బురదను నీటితో కడుగుతుండగా చటుక్కున నీటిలోకి దూకి ఆదపదనుంచి తప్పించుకున్నాడు. అంతటితో ఊరుకోక తొందర తొందరగా దూరంగా ఉన్న మరో చేప దగ్గరకు చేరుకుంది.

**"మహానుభావా! భవిష్యత్తులో జరగబోయే ఉచ్చనీచాలను ముందుగానే ఊహించుకొని సమర్థతతో ఆ పనిని తనకనుకూలంగా చక్కగా నెరవేర్చుకోగలిగే బుద్ధిమంతుడు దీర్ఘదర్శిలాగా జీవితాన్ని సుఖమయం చేసుకొంటాడు"**

**"ముట్టబడి దీర్ఘసూత్రుం**
**డిట్టట్టరుగగ నుపాయమేది యొకనిచే**
**పట్టవడె తనదుదెందము**
**పట్టువదలి చకిత వికలభావేంద్రియుడై"**

**–198ప.– తృ.ఆ.– శాం.ప. –మ. భా.**

'జాలర్లందరూ ఒక్కసారిగా చుట్టుముట్టడంతో దీర్ఘసూత్రుడికి ఏంచేయాలో తోచలేదు. ఎటువైపు నుంచి తప్పించుకుని పోవాలో దిక్కుతోచలేదు. భయంతో క్షణంపాటు గిలగిల కొట్టుకున్నాడు. దీర్ఘదర్శిలాగా ముందే ఈ మడుగు దాటి ఎందుకు వెళ్లిపోలేకపోయానా అని చింతించాడు. కనీసం ప్రాప్తకాలజ్ఞుడి వలె ఉపాయంతో అపాయాన్ని ఎందుకు తప్పించుకోలేకపోయానా అని దిగులు చెందాడు. భయభ్రాంతులతో గుండె పట్టు వదలడంతో ఆలోచనా రహితుడైనాడు. ఇంతలో ఒక జాలరి వాటం చూసి దీర్ఘసూత్రుని (చేపను) చేతితో పట్టేసుకున్నాడు. దానితో దీర్ఘసూత్రుడు విలవిల్లాడుతూ ప్రాణం కోల్పోయాడు.

'మహర్షులారా! ఈ మూడు చేపల మనస్తత్వాల గురించి, ప్రవర్తనల గురించి భీష్ముడు ధర్మరాజుకు వివరంగా చెప్పటంలోని ఆంతర్యం ఏమిటంటే – మానవుడు ముందు వెనుకల గురించి లోతుగా ఆలోచించి తన స్థితిగతులు, పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా లేదా అని నిశిత పరిశీలన చేసి సముచితంగా నడుచుకోవాలే తప్ప అనాలోచితంగా తప్పటడుగు వేస్తే ప్రమాదానికి గురికాక తప్పదని, రాజ్యపాలనలోనే కాక జీవితగమనంలో కూడా దీర్ఘదర్శిలాగా ముందుచూపుతో జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని పాలకునికి తెలియజెప్పటానికే ఈ ఉపకథ నిర్దేశింపబడినది."అని సూత మహర్షి చెప్పటం ఆపటంతో మునులందరూ అవునవునంటూ తమ అభిప్రాయాలను ఒకటొకటిగా వెల్లడించారు.

ఒక ముని లేచి "మహాత్మా! ముందు చూపుతో రాబోయే కాలంలో కష్టమా, సుఖమా, మంచా, చెడా ఏది కలుగుతుంది? అని ఆలోచించి తనకు మంచి జరగటానికి ఏంచెయ్యాలి? ఏం చేస్తే బాగుంటుందని తెల్సుకొని, ఆ విధంగా చేస్తే ఏ కీడూ జరగదు. అలా చేయకపోతే దీర్ఘ సూత్రుడిలాగానే విపత్తులో చిక్కుకోక తప్పదు. ప్రాణహానీ కలుగక మానదు. అంతే కదండీ ప్రతి జీవికీ అందించిన సందేశం"అని అనగానే మరొక ముని లేచి–

"అంతేకాదు, ఆపద ఎదురైనప్పుడు కంగారు పడకుండా ఉపాయంతో ఆ ఆపద నుంచీ గట్టెక్కేటట్లు పనిచేసేవాడు ప్రాప్తకాలజ్ఞుడిలాగా తనను తాను రక్షించుకొంటాడు. ముందుగా కార్యాన్ని చక్కబెట్టుకోవడానికి పథకం వేసుకొని తత్ప్రకారంగా ఆచరించకుండా ఉంటే అనుమానాలతోనే బ్రతుకంతా గడప వలసి వస్తుంది. అప్పటి కప్పుడు నిర్ణయాలు తీసుకొందాములే అనుకొంటే బ్రతుకు భారమే అవుతుంది. అంతేగదు గురువర్యా!"అని కూర్చోగానే – ఇంకో ముని లేచి "మహానుభావా! భవిష్యత్తులో జరగబోయే ఉచ్చనీచాలను ముందుగానే ఊహించుకొని సమర్థతతో ఆ పనిని తనకనుకూలంగా చక్కగా నెరవేర్చుకోగలిగే బుద్ధిమంతుడు దీర్ఘదర్శిలాగా జీవితాన్ని సుఖమయం చేసుకొంటాడు"అని అనగానే అందరూ నిజం నిజం అంటూ గొంతు కలిపారు.

"మునులారా! చక్కగా అర్థం చేసుకొన్నారు. అర్థం చేసుకోవటమే కాదు తదనుగుణంగా ప్రవర్తించటం కూడా ఉండాలి" అంటూ సూత మహర్షి లేచి ఆశ్రమం వైపు నడిచాడు.

"అలాగే చేస్తాం గురువర్యా!"అంటూ శౌనకాది మునులందరూ ఆశ్రమాలకు బయలుదేరారు.

# సాక్ష్యం చెప్పిన అలమేలుమంగ

**- శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

**ఈశానాం జగతోస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షస్థల నిత్యవాస రసికాంత కాంతి సంవర్ధినీం**
**పద్మాలంకృత పాణి పల్లవ యుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్**

అంటూ మనం నిత్యం ప్రార్థించే శ్రీనివాసుని వక్షస్థల వాసిని అయిన అలమేలు మంగ తిరుచానూరులోని తన గర్భగుడి శాంతి నిలయం నుండి ప్రత్యక్షంగా సాక్ష్యం చెప్పి జటిలమైన సమస్యను పరిష్కరించింది. ఈ అపూర్వ అద్భుత సంఘటనకు సాక్షీభూతంగా 'పాదకానుక శాసనం' దర్శనమిస్తోంది. ఈ శాసనానికి సంబంధించిన రాగి రేకులు వేంకటేశ్వరుని మూలమూర్తి రేఖాచిత్రంతోనూ అలమేలు మంగాదేవి రేఖాచిత్రంతోను అలరారుతూ తిరుమల తిరుపతి వారి దేవస్థానములో భద్రపరచబడి వున్నాయి. అంటే ఈ పవిత్ర సంఘటనకు శాసన సాక్ష్యం వున్నదని మనం గ్రహించాలి.

ఈ సంఘటన గురించి తెలిసికొనడానికి ముందు మనం ఆది వాగ్గేయకారుడైన అన్నమయ్య గారి మనవడు తాళ్ళపాక చిన్నన్న గురించి తెలిసికోవాలి. ఎందుకంటే తన దగ్గరకు వచ్చిన సమస్యను పరిష్కరించడానికి అలమేలుమంగను ప్రార్థించి ఆ మహాలక్ష్మి చేత సాక్ష్యం పలికించగల్గిన అలమేలు మంగా అనుగ్రహ పాత్రుడు తాళ్లపాక చిన్నన్న. తాళ్లపాక అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు 1460–1547 సంవత్సరాల మధ్య జీవించాడు. పెద తిరుమలాచార్యునకు అయిదుగురు పుత్రులు. నాల్గవ కుమారుడు తాళ్లపాక చిన్నన్న. ఇతడు ద్విపద రచనలో సిద్ధహస్తుడు. శ్రీనివాసుడు మకరకుండలాలు ప్రసాదించి చిన్నన్నను ఆశీర్వదిస్తే, అలమేలు మంగమ్మ తన చనుబాలు తాగించి చిన్నన్నకు కవితాశక్తిని ప్రసాదించిందట! అలా లక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహానికి పాత్రుడైన చిన్నన్నను తిరుపతి, తిరుచానూరు, నారాయణవనం, యోగిమల్లవరం ప్రాంతాలలోని ప్రజలంతా దైవంగా భావిస్తూ గౌరవించేవారట! ఆ ప్రాంతాలలో విస్తరించి చేనేత వృత్తిలో జీవనం గడుపుతున్న నేతకులాల వారిలో రెండు తెగలు ఉన్నాయి. ఒకరు పద్మశాలీలు, మరొకరు జాండ్రవారు లేక దేవాంగులు. వీరుఇరువురికి మూలపురుషుడు మార్కండేయ మహర్షి. పద్మసాలెలు భావనామహర్షి సంతతిగాను, జాండ్రవారు పంచ మహాఋషి సంతతిగాను పరిగణింపబడతారు. తిరుచానూరు నారాయణవనం వగైరా క్షేత్రాలలో ప్రత్యేక ఉత్సవాలలో, పర్వదినాలలో లక్ష్మీదేవికి పుట్టింటివారు సమర్పించే చీర, సారె వగైరామర్యాదలు ప్రప్రథమంగా మేము సమర్పించాలనే వివాదం ఈ రెండు తెగల మధ్య పొడచూపింది. ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. ఈ సమస్యకు పరిష్కారం చూపమని ఇరువర్గాల నాయకులు తాళ్లపాక చిన్నన్నను ఆశ్రయించారు. "ఆ పద్మావతీ దేవినే అడుగుదాం. ఆమె పుట్టింటివారు ఎవరో? ఎవరు ప్రప్రథమంగా ఆమెకు చీర సారె వగైరా నడచు మర్యాలు సమర్పించవలెనో ఆమెనే చెప్పమని కోరుదాం" అంటూ చిన్నన్న వారికి హామీ ఇచ్చారు. తిరుచానూరు గుడిలో అమ్మ సాక్ష్యం చెపుతుందనే ప్రచారం ఊరిలోనూ, పరిసర ప్రాంతాలలోనూ జనబాహూళ్యం ద్వారా విస్తృతంగా జరిగింది.

అది 1542వ సంవత్సరం కార్తీక పౌర్ణమి గురువారం ఉదయం 11.00 గం.లు చంద్రహోరా సమయం. ఇసుక వేస్తే రాలనంత జనం తిరుచానూరు ఆలయానికి చేరుకొన్నారు. అమ్మ సాక్ష్యం చెపుతుందట – ఏ నోట విన్నా ఇదే మాట. ప్రజల వదనాలలో ఆశ్చర్యం. ఆనందం. ఆ అమ్మ పలుకులు స్వయంగా వినాలని అందరూ ఎదురు చూస్తున్నారు. ఆలయాన్ని అద్భుతుంగా అలంకరించారు. గర్భగుడిలో మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ముఖ మండపమంతా అలంకరణాల శోభలతో అందంగా దర్శనమిస్తోంది. ముఖ మండపంలో శిలావేదికపై బంగారు పల్లకిలో పద్మావతి దేవి ఉత్సవమూర్తిని కనకాంబరం రంగు పట్టు చీరలో అలంకరించి, పసిడి నగలు ధరింపచేసి, నానావిధ పరిమళభరిత పుష్పమాలలు అలంకరించి, ఆసీనురాలిని చేశారు. కోవెల మొత్తం పండుగనాటి శోభను తలపించేలా తీర్చిదిద్దారు. వైష్ణవోత్తములు, జియ్యరులు, పండితులు, పామరులు, యువతీ యువకులు, చిన్నారులు, పెద్దలు, స్త్రీలు, పురుషులు అందరూ అమ్మ సాక్ష్యం వినాలని ఆలయమంతా క్రిక్కిరిసిపోయి చెవులు రిక్కించుకు నిలబడ్డారు. ముఖ మండపంలో ఒక పక్కగా ఉత్తరాభిముఖంగా రత్న తివాసీపై తాళ్లపాక చిన్నన్న ఆసీనులై వున్నారు. చేతులకు రత్న కంకణాలు, చెవులకు మకర కుండలాలు, తలపై పట్టు జరీ తలపాగా ధరించి నొసట ఊర్ధ్వ పుండ్రాలతో చేతిలో దండెతో భక్తి పారవశ్యంతో కూడిన ముఖవర్చస్సుతో వెలిగిపోతూ ప్రత్యేకంగా దర్శనమిస్తున్న తాళ్లపాక చిన్నన్నను వేలితో చూపించుకుంటూ "ఈయనే అలమేలు మంగమ్మ చేత సాక్షికం ఇప్పిస్తాడట" అంటూ సామాన్య జనం చెవులు కొరుక్కుంటున్నారు. తాళ్లపాక

చిన్నన్నకు ఎదురుగా రెండు వరసలలో పద్మసాలె, జాండ్ర తెగలకు చెందిన చేనేత వస్త్రకారులు సాక్ష్యం వినడానికి మేం సిద్ధం అన్నట్టుగా కూర్చొని ఉన్నారు.

మధ్యాహ్న ఆరాధనకు వేళ అయింది అని హెచ్చరిస్తున్నట్లు గర్భాలయం లోపల నుండి ఘంటానాదం వినిపించింది. అర్చక స్వాములు గర్భాలయం లోని మూలమూర్తికి, ముఖమండపంలోని ఉత్సవమూర్తికి అర్చన నివేదనలు పూర్తి చేసి ఘనంగా కర్పూర నీరాజనాలు సమర్పించి భక్తులకు చూపించారు. గోవింద ఘోషలు మిన్నంటాయి. చిన్నన్నకు ఎదురుగా కూర్చున్న చేనేత వస్త్రకారుల సమూహం నుండి పద్మసాలె మరియు జాండ్ర తెగల ప్రతినిధులు లేచి నిలబడి వారి వారి మధ్య తలెత్తిన వివాదాలు వివరించి పద్మావతీదేవి ఎవరి ఆడబడుచో ఏ తెగ వారు సమర్పించే చీర సారె వగైరా మర్యాదలు ప్రప్రథమంగా స్వీకరిస్తుందో అమ్మవారి చేత సాక్ష్యం చెప్పించి మా వివాదాలు పరిష్కరించండి"అంటూ చిన్నన్నకు విన్నవించి ఒదిగి కూర్చున్నారు. చిన్నన్న లేచి నిలబడి అలమేలు మంగకు సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరించాడు. "నేడు మనకు అత్యంత శుభదినం. తిరుమల తిరుచానూరు చరిత్రలో మరపురాని అపూర్వ ఘట్టం. అమ్మవారి అమృత వాక్కులు మనం వినబోతున్నాం." అంటూ జనానికి చెప్పి అన్నమయ్య సంకీర్తనను గానం చేశాడు.

"అమ్మా! ఈ రెండు తెగల వారికీ పద్మావతీ శ్రీనివాసులపై వున్న భక్తి అమోఘం. వీరిరువురూ నన్ను మధ్యవర్తిగా వుంచి వీరి తగవును పరిష్కరించమని కోరారు. అందువల్ల ఎవరు నీ పుట్టింటివారో ఎవరి చేత పుట్టింటి మర్యాదలు ముందుగా స్వీకరించ కోరుతున్నావో అందరి ముందు చెప్పు తల్లీ"అంటూ పరిపరి విధాల ప్రార్థించాడు. సర్వత్రా నిశ్శబ్దం తాండవించింది. ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ శాంతి నిలయంగా పిలవబడే తిరుచానూరు గర్భాలయం నుండి మనోహరమైన ఘంటా శబ్దం వినిపించింది. ఎవరూ మ్రోగించకుండానే వినబడిన ఆ ఘంటాశబ్దం మృదు మధురంగా ఆలయంలోనే కాదు తిరుచానూరు క్షేత్రమంతా ప్రతిధ్వనించింది. ఘంటానాదం ఆగిపోయింది. ఒక దివ్యమైన తేజస్సు గర్భాలయం అంతా ఆవరించింది. కోకిల స్వరంతో అలమేలు మంగమ్మ ఇలా సాక్ష్యం పలికింది. "నా పుట్టింటి వారు పద్మసాలెవారు! ఆయా క్షేత్రాలలో విశేషదినాలు, ఉత్సవాలలో ముందుగా నడచు మర్యాదలు పద్మశాలె వారు జరిపించవలయును. జాండ్రవారి ధర్మము నిమిత్తం లేదు". అంతే గోవింద బొబ్బలు మిన్ను ముట్టాయి. పద్మావతీదేవి మధుర వాక్కులు స్వయంగా విన్న భక్తజనం ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఆయా క్షేత్రాలలో అమ్మవారికి ముందుగా నడచు మర్యాదలు పద్మసాలెవారు సమర్పిస్తారని, ఆ తరువాతే ఎవరైనా సమర్పించవచ్చుననీ తాళ్లపాక చిన్నన్న తీర్మానించాడు. జనమంతా చిన్నన్నకు జయ జయ ధ్వానాలు చేశారు. అలమేలు మంగమ్మ చేత పద్మసాలె వారే తమ పుట్టింటివారు అని సాక్ష్యం చెప్పించినందుకు గాను పద్మసాలెవారు భక్తితో కృతజ్ఞతగా పదివేల వరహాలను పాద కానుకగా చిన్నన్నకు సమర్పిస్తూ ఒక దాన శాసనాన్ని రాగి రేకుల మీద వ్రాయించి ఇచ్చారు. ఇదే పాదకానిక శాసనంగా వ్యవహరింపబడుతూ ఈ అపూర్వ సంఘటనకు సాక్ష్యంగా టిటిడి వారి మ్యూజియంలో భద్రపరచబడింది.

ఈ అపూర్వ సంఘటన జరిగినప్పుడు తిరుమల తాతాచార్యులవారు అలాగే చంద్రగిరి రాజు పురుషోత్తమ రాయలు ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుచానూరు ఆలయానికి విచ్చేసినట్లుగా క్షేత్ర సాహితి వ్యవస్థాపకులు, తిరుమల సర్వస్వంగా పరిగణింపబడే శ్రీనివాస వైభవం గ్రంథ రచయిత శ్రీ వెలమకన్ని శ్రీరామమూర్తి తాను రచించిన 'పద్మావతీ వైభవం' గ్రంథంలో 30 వ పేజీలో పేర్కొన్నారు. అలాగే ఈ సంఘటన 1542వ సంవత్సరంలో జరిగినట్లుగా పేర్కొన్నారు.

పలుకు తేనెల తల్లి పలికిన ఈ సాక్ష్యం గురించి విన్న మనమందరం భక్తి పారవశ్యంతో ముకుళిత హస్తాలతో అర్ధనిమీలిత నేత్రాలతో పులకిత గాత్రంతో వరాహ పురాణాంతర్గతమైన చతుర్వింశతి నామ స్తుతి చేద్దాం.

**ఓం నమశ్రియై లోక ధాత్రై బ్రహ్మ మాత్రే నమో నమః**
**నమస్తే పద్మనేత్రాయై పద్మముఖై నమోనమః**
**ప్రసన్న ముఖ పద్మాయై పద్మకాంతై నమోనమః**
**నమో బిల్వ వనస్థాయై విష్ణపత్నై నమోనమః**
**విచిత్ర క్షేమధారిణ్యై పృధుశ్రోణ్యై నమోనమః**
**పక్వ బిల్వ ఫలాపీన తుంగస్తన్యై నమోనమః**
**సురక్త పద్మ పత్రాభకర పాదతలే శుభే**
**సురత్నాంగద కేయూర కాంచీనూపుర శోభితే**
**యక్ష కర్దమ సంలిప్త సర్వాంగే కట కోజ్వలే**
**మాంగళ్యాభరణైశ్చిత్రైః ముక్తాహారైర్వి భూషితే**
**తాంటకై రవతం సైశ్చ శోభమాన ముఖాంబుజే**
**పద్మహస్తే నమస్తుభ్యం ప్రసీద హరివల్లభే**
**ఋగ్యజుసామ రూపాయై విద్యాయైతే నమోనమః**
**ప్రసాదాస్మీన్ కృపాదృష్టి పాతై రాలోక యాబ్దిజే**
**యే దృష్టాస్తే త్వయా బ్రహ్మ రుద్రేందత్వం సమాప్నుయుః**

★ ★ ★

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

### 273. నందగోప మనోహరాయ నమః

విష్ణువు కృష్ణునిగా జన్మించి పెంపుడు తండ్రియైన నందగోపుని మనస్సును ఆకట్టుకొన్నాడు. అష్ట వసువులలో ఒకడు ద్రోణుడు. అతని భార్య ధార. వీరు తప్పు చేయగా బ్రహ్మ మీరు దేవతలు కాకుండా పశుల కాపరులుగా జన్మించండని శపించాడు. ఆ కారణంగా ద్రోణుడు నంద గోపుడుగా ధార యశోదగా జన్మించారు. నంద యశోదులు శ్రీకృష్ణుని పెంచి పెద్ద జేసి శాప విముక్తులై వసువులుగా దేవలోకము చేరినారు.

గోవులకు అధిపతి, రక్షకుడు అయిన నందునిచే పెంచబడిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి అయిన వేంకటేశునకు నమస్కారము.

### 274. చతుర్భుజాయ నమః

**చత్వారః భుజాః యస్య సః చతుర్భుజః**

నాలుగు భుజములు గలవాడు. ఇది నారాయణునకు అసాధారణమైన నామధేయము. మహా విష్ణువు యొక్క మరొక పేరు నారాయణుడు.

**తమద్భుతం బాలకమంబుజేక్షణం। చతుర్భుజం శంఖగదాద్యాయుధమ్॥**

అని కృష్ణుని భాగవతం వర్ణించింది. విష్ణువు నార యందు (జలములందు) శయనించుటచే నారాయణుడనబడినాడు. నార – అయన – నారాయణ.

**శ్లో॥ ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూననః**
**యదస్యాయమనం పూర్వం తేన నారాయణః స్మృతః ॥**

అను మనుస్మృతిలోని శ్లోకమును ఉదాహరించి విద్యారణ్యులు నారాయణ శబ్దమునకు జనశాయి అని అర్థం చెప్పినారు.

చతుర్భుజః అను నామము విష్ణు సహస్ర నామములలో 142 సంఖ్యతో వుంది.


చతుర్భుజుడు భగవంతుని పరవాసుదేవ రూపము అని విష్ణు పురాణము తెలిపింది. చతుర్భుజుని పై చేతులలో శంఖ చక్రములు, క్రింది రెండు చేతులలో గదా, పద్మములు ఉండును. చతుర్విధ పురుషార్థములను భక్తులకు ప్రసాదించుటకు నాలుగు చేతులు గలవాడు వేంకటేశ్వరుడు. చతుర్భుజుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 275. కోమలాంగాయ నమః

చక్కదనము, మృదువు గల్గిన అవయవములు గలవాడు కృష్ణుడు. కోమలాంగుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 276. గదావతే నమః

బుద్ధి తత్త్వమే గదయని శంకరభాష్యము. గద ఆయుధముగా గలవాడు – (కృష్ణుడు). విష్ణువు యొక్క తేజస్సును విరజిమ్ము గదాయుధమునకు కౌమోదకి అని పేరు. విష్ణువు యొక్క పంచాయుధములలో గద ఒకటి. ఓజస్సు, సహస్సు అను బలముతో కూడిన ముఖ్య తత్వం గద. విశ్వధారణ చేయగల బలమే ఓజస్సు. దానిని ధరించడమే సహస్సు. విష్ణు సహస్ర నామములోల గదాధరః (997) అను నామము గలదు.





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

గదాధరుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 277. నీల కుంతలాయ నమః

నల్లని కురులు గలవాడు కృష్ణుడు. నీల కుంతలుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 278. పూతనా ప్రాణ సంహర్త్రే నమః

పూతన అను రాక్షసి ప్రాణములను హరించిన వాడు కృష్ణుడు. కృష్ణుడు బిడ్డగా వున్నప్పుడు పూతన స్త్రీరూపమున వ్రేపల్లెకు వెళ్ళి చను మొనల యందు విషము వుంచుకొని బాలింతగా కృష్ణునికి పాలిచ్చు విధమున అనునయించి కృష్ణుని చంపుటకు ప్రయత్నించింది. కృష్ణుడు పాలు త్రాగుటతో పాటు పూతన ప్రాణములు కూడ పీల్చి చంపినాడు. అంత పూతన రాక్షసిగా చనిపోయింది. పూతన కైతు అను రాక్షసి కుమార్తె. ఈమె కంసుని భార్యకు సేవిక. పూతన పూర్వ జన్మలో మహాబలి (ప్రహ్లాదుని మనుమడు) కుమార్తె రత్నమాల. విష్ణుదేవుడు వామనునిగా అవతరించి బలి యాగము వద్దకు వెళ్ళినపుడు, బలి చేత భూదానము పొందు సమయమున రత్నమాల వామనుని చూచి ముగ్ధురాలై ఇతనికి పాలిచ్చి పెంచు తల్లిగా వుంటే బాగుండునని, ఇతడు నా బిడ్డగా జన్మించకూడదా అని తలంచింది. విష్ణువు రత్నమాల ఆలోచనను గ్రహించి కృష్ణుడిగా జన్మించనపుడు ఆమె పాలు త్రాగి ఆమె కోరికను తీర్చినాడు. పూతన ప్రాణములు తీసిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 279. తృణావర్త వినాశనాయ నమః

తృణావర్తుడను రాక్షసుని సంహరించినవాడు కృష్ణుడు.

తృణావర్తుడు తారకాసురుని కుమారుడు. ఇతడు కంసుని సేవిస్తూ వుండేవాడు. కంసుని ఆజ్ఞ చే తృణావర్తుడు కృష్ణుని చంపడానికి వ్రేపల్లెకు సుడిగాలి రూపమున వెళ్ళినాడు. అప్పుడు యశోద కృష్ణునికి పాలు ఇస్తున్నది. బాలుడు బరువు ఎక్కుతున్నాడు. ఆమె మొయ్య లేక కృష్ణుని చాపపై పరుండ బెట్టి ముఖం చేతులు శుభ్రం చేసుకోడానికి లోపలికి వెళ్ళింది. అప్పుడు సుడిగాలి రూపమున వున్న తృణావర్తుడు కృష్ణుని ఎత్తుకొని ఆకాశమునకు ఎగిరినాడు. కృష్ణుడు తృణావర్తుని కంఠమును, హృదయాన్ని గట్టిగా పట్టుకున్నాడు. ఆ బాలుడు మరింత బరువవుతుంటే కృష్ణుని వదలి పోదామనుకున్నా వదలి వెళ్ళలేక ఊపిరాడక మరణించి, నిజరూపముతో నేలపై పడినాడు. వీనికి చక్ర సమీర దైత్యుడని మరో పేరు గలదు.

తృణావర్తుడను రాక్షసుని చంపిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 280. గర్గారోపిత నామాంకాయ నమః

యదుకులమునకు గురువైన గర్గాచార్యులచే నామకరణం చేయబడినవాడు కృష్ణుడు.

యదుకుల పురోహితుడైన గర్గుడు వసుదేవుని పంపున వ్రేపల్లెలో నందుని యింట నున్న బలరామ కృష్ణులకు నామకరణాది సంస్కారములను చేసినాడు.

గర్గుడు విష్ణుదేవుని అంశతో భరద్వాజుని వంశములో జన్మించాడు. ఇతడు ఖగోళ శాస్త్రంలో ప్రజ్ఞావంతుడు. పృథుని రాజ్యంలో గర్గుడు ప్రధాన ఖగోళ శాస్త్రవేత్త. సరస్వతీ నదీ తీరంలో గర్గశ్రోత అనే ప్రదేశం వుంది. గ్రహాల కదలికను గూర్చి నక్షత్రముల గమనం గురించి విస్తృతంగా వివరించినాడు గర్గుడు.

గర్గాచార్యులచే నామకరణాది సంస్కారములను పొందిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. పృథువు ధ్రువుని వంశములో జన్మించిన గొప్ప చక్రవర్తి, ధర్మ పరిపాలకుడు. ఇతని పేరుతోనే భూమికి పృథివి అనే పేరు కలిగింది.

# అభీష్ట ఫల ప్రదాయకుడు

# శ్రీ గణేశుడు

–చిల్లర సీతారామారావు



**వందే వందారు మందార మిందు భూషణ నందనమ్**
**అమందానంద సందోహ బంధురం సింధురాననమ్**

**ప్రణమిల్లు వారికి కల్పవృక్షములాంటివాడును, శివుని కుమారుడును, అమితమైన ఆనందము కలవాడును, గజాననుడును అయిన గణేశుడికి వందనమాచరిస్తున్నాను.**

భక్తులు మనసా వాచా కర్మణా గణేశుడిని ఒకసారి తలచుకుంటే చాలు భక్తుల మనోభీష్టాలను ఆయన నెరవేరుస్తాడని భక్తుల విశ్వాసము. అందువలన ఆబాలగోపాలానికి ఇష్టమైన దైవము గణేశుడు. భాద్రపద శుద్ధ చవితి నాడు గణేశుడి ఆవిర్భావము జరిగింది. ఆవిర్భావ గాథ శివపురాణము నందు ఇలా వర్ణించబడింది. ఒకసారి పార్వతీదేవి స్నానము చేయు నిమిత్తము శరీరమునకు నలుగు పిండి రాసుకొని మిగిలిన పిండితో ఒక బొమ్మను తయారు చేసి ప్రాణం పోసింది. స్నానమునకు వెళ్ళుతూ ద్వార రక్షకుడిగా ఆ బాలుడిని నియమించింది. ఆ బాలుడు ద్వారము దగ్గర రక్షకుడిగా కాపలా కాస్తుండగా శివుడు అక్కడికి వచ్చి లోపలికి వెళ్లసాగాడు. ఆ బాలుడు శివుడిని లోపలికి వెళ్లనియ్యకుండా అడ్డుకున్నాడు. శివుడికి ఆగ్రహం కలిగింది. ఇరువురూ యుద్ధమునకు తలపడ్డారు. ఆ యుద్ధములో శివుడు ఆ బాలుడి తలను నరికేశాడు. స్నానము ముగించుకొని బయటకు వచ్చిన పార్వతీదేవి తల తెగిన ఆ బాలుడిని చూచి బోరున విలపించసాగింది. పార్వతీదేవి వేదనను చూడలేక శివుడు ఉత్తర దిక్కున నిద్రిస్తున్న ఒక గున్న ఏనుగు తలను ఖండించి తెచ్చి ఆ బాలుడి మొండెమునకు తగిలించి ప్రాణం పోశాడు. గజము తల అతికించినందు వలన ఆ బాలుడు గజాననుడు అయ్యాడు. శివుడు గజాననుడిని పుత్రునిగా స్వీకరించి గణములకు అధిపతిని గావించి ఇలా అన్నాడు. భాద్రపద మాస శుక్ల పక్ష చతుర్థి నాడు చంద్రోదయానికొక ఝాము ముందర ఉదయించావు కాబట్టి అది నీ జన్మ దినమై విరాజిల్లుతుంది. సాలుకు ఒక్కసారైనా ఆ భాద్రపద శుద్ధచవితినాడు నిన్ను ఆరాధించినవారికి ఆ సంవత్సరమంతా నిర్విఘ్నప్రదమవుతుంది. ఆ రోజు నుండి భాద్రపద శుద్ధ చవితిని గణేశ చతుర్థి లేదా వినాయక చవితి అను పేర్లతో భక్తిశ్రద్ధలతో పూజించ సాగారు. గణేశోత్సవములు అను పేరుతో గణేశుడిని ఆరాధించి ఆయన నిమజ్జనమును ఘనముగా జరుపుతారు. గణేశుడు అను పదము రెండు శబ్దముల కలయిక. 'గణ' అను శబ్దమునకు వర్గము, సముదాయము, సమూహము అను అర్థములున్నాయి. ఈశుడు అనగా స్వామి అష్టవసువులు, ద్వాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, వీరిని గణ దేవతలు అని అంటారు. ఈ గణములకు ఈశుడు గావున గణేశుడు అను నామముతో ప్రసిద్ధికెక్కాడు.

గణేశుడి చవితిని గణేశ చతుర్థి వ్రతముగా దేవతలు, దేవేంద్రుడు, భగీరథుడు, ధర్మరాజు మున్నగు వారు ఎందరో ఆచరించి తమ తమ కార్యములను దిగ్విజయముగా పూర్తి చేసుకున్నారు. గణేశుడిని భక్తులు విఘ్నములను తొలగించు దేవుడు అను భావనతో ఆరాధిస్తారు. గణేశుడిని ఆరాధిస్తే ఆటంకములు మున్నగునవి తొలగిపోతాయని, తమ పనులన్నీ నిరాటంకముగా కొనసాగుతాయని భక్తుల అచంచల విశ్వాసము. గణేశుడు విఘ్నాధిపతి కావడానికి సంబంధించిన కథ పురాణాలలో ప్రస్తావించబడింది.

ఒకసారి దేవతలు, మహర్షులు మున్నగువారు శివుడి దర్శించుకున్నారు. ఆయన ముందు తమ బాధను వెల్లడించు కున్నారు. దేవా! దైత్యులు మిమ్ములను ప్రార్థించి వరములను

పొందారు. ఆ వర గర్వముతో దేవతలను, మహర్షులను వేధించసాగారు. రాక్షసుల బారి నుండి మమ్ములను రక్షించవలసినదిగా ప్రార్థిస్తున్నాము. విఘ్నములకు నొక అధిపతిని నియమించండి. ఆ అధిపతి ద్వారా రాక్షసులను కట్టడి చేయవచ్చును. ఆ పదవిని గణేశుడికి గాని, కుమార స్వామికిగాని అప్పగించండి అని ప్రార్థించారు. విఘ్నాధిపతి పదవికి నొక పరీక్ష పెట్టాలని నిర్ణయించుకున్నాడు శివుడు. ముల్లోకములలోని సమస్త తీర్థముల యందు స్నానము గావించి ముందుగా ఎవరు వస్తారో వారే విఘ్నాధిపత్యమునకు అర్హులు అని ప్రకటించాడు శివుడు. వెంటనే కుమారస్వామి నెమలి వాహనము మీద బయలుదేరి వెళ్ళిపోయాడు. మూషిక వాహనము మీద ప్రయాణము కష్టసాధ్యము. కావున తరుణోపాయమును సూచించండి అని శివుడిని ప్రార్థించాడు గణేశుడు.

గణేశుడి ప్రార్థనను మన్నించి శివుడు ఆయనకు నారాయణ మంత్రము ఉపదేశించాడు. గణేశుడు ఆ మంత్రమును మననము చేయుచు తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయసాగాడు. ఆ మంత్ర ప్రభావము వలన కుమారస్వామికి తనకంటే ముందుగా స్నానము చేసి వస్తున్న అన్నగారు ప్రత్యక్షము గావడము చూచి ఆశ్చర్యపోయాడు. అన్నగారికే ఆధిపత్యమును ఇవ్వండి అని శివుడిని ప్రార్థించాడు కుమారస్వామి. శివుడు భాద్రపదశుద్ధ చవితినాడు గణేశునకు విఘ్నాధిపత్యమును అనుగ్రహించాడు. విఘ్నములకు అధిపతి వినాయకుడు. ఏ పనినైనా ఆరంభించేటప్పుడు ముందుగా వినాయకుడిని పూజించి ఉండ్రాళ్లను నైవేద్యముగా సమర్పించినట్లైతే ఆ పని నిర్విఘ్నముగా పూర్తవుతుంది. నీలాపనిందలకు లోనుగాకుండా ఉండాలని వినాయకుడి పూజ అయిన తర్వాత తప్పనిసరిగా వినాయకుడి కథను చదివి అక్షింతలను నెత్తిన చల్లుకుంటారు.

గణేశుడికి పలు పర్యాయ నామములున్నాయి. విఘ్నములకు అధిపతి గావున విఘ్నేశ్వరుడు, మూషికమును వాహనముగా గలవాడు గావున మూషిక వాహనుడు. ఒకే ఒక దంతమును కలిగి యుండుటచే ఏకదంతుడు, ఉదరము పెద్దదిగా యుండుట చేత లంబోదరుడు, చెవులు చేటంత గలవి గావున శూర్పకర్ణుడు, సర్వసిద్ధులు గలవాడు గావున సర్వసిద్ధిప్రదాయకుడు అను భిన్న నామములతో గణేశుడిని భక్తులు పిలుచుకుంటారు.

యుగములు నాలుగు. కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము. ఈ నాలుగు యుగములందును గణేశుడు అనేక రూపాలలో అవతరించాడు.

కృతయుగములో కశ్యపుడు అదితి దంపతులకు మహోత్కటుడుగా అవతరించాడు. ఆ అవతారములో ఆయన సింహ వాహనుడు. దశ భుజములు గలవాడు. బంగారపు రంగు శరీరం గలవాడు. త్రేతాయుగమున శివపార్వతులకు మయూరేశ్వరుడుగా అవతరించాడు. ఆ అవతారములో ఆయన నెమలి వాహనము, ఆరు భుజములు, స్ఫటిక శరీర చ్ఛాయ గలవాడు. ద్వాపర యుగములో గజాననుడు అను నామముతో శివుని కుమారుడిగా అవతరించాడు. ఈ అవతారమున మూషిక వాహనుడు. ఈ వాహనమును భూదేవి ద్వారా పొందినాడని బ్రహ్మవైవర్త పురాణము పేర్కొనుచున్నది. చతుర్భుజములు గలవాడు. కుంకుమ రంగు శరీర చ్ఛాయ కలిగి యున్నవాడు. కలియుగమున గణేశుడి అవతారము ధూమకేతువు. ఈ అవతారమున అశ్వ వాహనము. రెండు భుజములు గలవాడు. పొగ రంగు శరీర చ్ఛాయ గలవాడు.

దుష్టశిక్షణ శిష్ట రక్షణ నిమిత్తము విష్ణు భగవానుడు దశావతారము లెత్తగా, గణేశుడు ఎనిమిది అవతారములెత్తాడు. వక్రతుండ అవతారములో మత్సాసురుడిని, ఏకదంత అవతారములో మదాసురుడిని, మహోదరుడి అవతారములో మోహాసురుడిని, గజానన అవతారములో లోభాసురుడిని, లంబోదర అవతారములో క్రోధాసురుడిని, వికటుడి అవతారములో కామాసురుడిని, విఘ్నరాజ అవతారములో మమతాసురుడిని, ధూమ్రవర్ణ అవతారములో అభిమానాసురుడిని సంహరించి దేవతలకు, ప్రజలకు, రాక్షసుల తాకిడి లేకుండా చేశాడు.

గణేశుడు విఘ్న వినాశకుడు. గణేశుడి రూపం చాలా విశిష్టమైనది. పెద్ద పొట్ట, తొండము, గజ ముఖము, ఏకదంతము, చేటల వంటి చెవులు, మరుగుజ్జు రూపము, ఎలుక మీద స్వారీ. విశిష్టమైన ఈ రూపమును ఆరాధించాలి. గణపత్యధర్వశీర్షం అను గ్రంథములో గణేశుడి రూపవర్ణన ఇలా ఉంది. గణేశునకు ఒకే ఒక దంతము, నాలుగు బాహువులు ఉన్నాయి. నాలుగు చేతులలోను, పాశం, అంకుశం, దంతం, అభయ ముద్రలను ధరించి ఉంటాడు. ఆయన జెండామీద మూషికం గుర్తు ఉంటుంది. గణేశుడు కృష్ణ మృగ చర్మమును, నాగయజ్ఞోపవీతమును ధరించి ఉంటాడు. 'కామరూప ధరం దేవం వందేహం గణనాయకమ్' అన్నారు వ్యాసులవారు. అనగా గణపతి తాను కోరుకున్న రూపమును ధరించగలడు అని అర్థం.

గణేశ చవితి లేదా వినాయక చవితి పర్వం అంటే అందరికీ ఆనందము. భక్తుల పాలిటి కల్పతరువు గణేశుడు. చవితినాడు గణేశుడి ఆవిర్భావం జరిగింది. గనుక భాద్రపద శుద్ధ చవితికి అధిక ప్రాశస్త్యం వచ్చింది. మనోభీష్టాలను సిద్ధింప జేస్తాడు గనుక సిద్ధి వినాయకుడు అనే ఖ్యాతి కలిగింది.

**శ్లో. సిద్ధయంతి సర్వకార్యాణి మనసా చింతితా న్యాపి**
**తేనఖ్యాతిగతో లోకే నామ్నా సిద్ధి వినాయకమ్**

గణేశ చతుర్థినాడు వేకువజామున లేచి భక్తులు స్నానాదికములు

పూర్తిగావించుకుంటారు. గణేశుడిని పూజించుట కొరకు నొక మండపమును కడతారు. మండపములో ఒక వేదికను ఏర్పాటు చేసి దాని మీద బియ్యం పోస్తారు. బియ్యం మధ్యలో గణేశుడి ప్రతిమను ఉంచుతారు. పూజలు అందుకునే ప్రతిమ మట్టితో తయారు చేసినది అయితే చాలా శ్రేష్ఠము. వెండితో చేసిన గణేశుడి ప్రతిమను పూజించితే తలపెట్టిన కార్యములు నిర్విఘ్నముగా నెరవేరుతాయి. గణేశుడికి పత్రి అంటే చాలా ఇష్టము. ఇరువది రకాల పత్రితో, పూలతో చేసే పూజ చాలా విశిష్టమైనది. గరికతో పూజలు చేస్తే పలు లాభాలు కలుగుతాయి.

**శ్లో. విద్యార్థి లభతే విద్యాం ధనార్థీ లభతే ధనం**
**పుత్రార్థి లభతే పుత్రాన్ మోక్షార్థీ లభతే గతిమ్**

విద్యార్థి విద్య కావాలని కోరుకుంటే విద్య లభిస్తుంది. ధనము కావాలని కోరుకుంటే ధనము లభిస్తుంది. పుత్ర సంతానము కావాలని కోరుకుంటే పుత్ర సంతానము కలుగుతుంది. మోక్షము కావాలనుకుంటే మోక్షము కలుగుతుంది. పుర వీధులలో కూడా గణేశ చతుర్థీనాడు ఒక మూల పెద్ద మండపమును ఏర్పాటు చేసి పెద్ద గణేశుడిని తెచ్చి పూజలు చేస్తారు. విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. హరి కథలు ప్రవచనములు మున్నగునవి ఏర్పాటు చేస్తారు. తొమ్మిది రోజులు గడిచిన తరువాత నిమజ్జనము గావిస్తారు.

జ్ఞానాన్ని, విద్యను ప్రసాదించే గణేశునికి భాద్రపద శుద్ధ చవితినాడు పూజలు చేసి ఆయన అనుగ్రహానికి పాత్రలవుదాము.

# ఉడుతా భక్తి

**- ఓలేటి వీరా రాఘవ శర్మ**

ఒక ఊరిలో రామన్న, సీతమ్మ అనే దంపతులుండేవారు. వారికి లేక లేక ఒక కుమారుడు పుట్టగా అతనికి రామం అని నామకరణం చేసి అత్యంత గారాబంగా పెంచుతున్నారు. గర్భాష్టమంలోనే ఉపనయన సంస్కారం చేసి ఒక ప్రక్క ఆంగ్ల చదువుతో బాటుగా మరొక ప్రక్క సంధ్యావందనాది అనుష్ఠానం చేయవలసి వచ్చేది. పిల్లవాడు అగుట వల్ల సంధ్యావందనాదులతో నిర్లిప్తత చూపి, ఆంగ్ల విద్యకు ప్రాధాన్యత ఇచ్చేవాడు. తండ్రి రామన్న ఎంత చెప్పినా ఉదాసీనత చూపేవాడు. కొంతకాలము గడిచినా మార్పు రాకపోవడంతో రామన్న పొరుగూరిలో గల వేద పండితుడైన సోమావధాన్లు గారి వద్దకు రామాన్ని ఒక సెలవు రోజున తీసుకొని వెళ్లి, తన గోడు విన్నవించుకొనగా, సోమావధాన్లు గారు రామాన్ని దగ్గర కూర్చొండబెట్టుకొని, ఏరా నాన్నా! మీ నాన్న నీకు సకాలంలో ఉపనయన సంస్కారం చేశాడు కదా! సంధ్యావందనం చేయడంలో నీకు ఇబ్బంది ఏమిటి? అని ప్రశ్నించాడు. ఉదయాన్నే లేచి, పాఠశాలకు వెళ్లాలి. స్నానపానాదులు, అల్పాహారం తీసుకొని, పుస్తకాలు సర్దుకొని, యూనిఫారం, బూట్లు వగైరాలు వేసుకొని, ఆటో వచ్చే సమయానికి సిద్ధంగా ఉండాలి లేకపోతే సమయానికి పాఠశాలకు వెళ్లలేను. పైగా సంధ్యావందన అనుష్ఠానం, నేను మీలాగ వేదం చదువుకున్న వారు చేసినంత ముద్రా, ఉదాత్త అనుదాత్తాలతో చేయలేనని కూడా అనిపిస్తోంది అని ముగించాడు రామం.

సోమాధాన్లు గారు, రామం తల నిమురుతూ రామాయణ కాలంలో శ్రీరాముడు, సేతువు నిర్మాణ సమయంలో హనుమదాది కపి పుంగవులు పెద్ద బండరాళ్లు సముద్రంలో వేస్తున్నారు. ఒక చిన్న ఉడుత ఇసుకలో దొర్లి, సముద్ర నీటి ఒడ్డున విదిల్చి సేతు నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యి శ్రీరాముని సేవలో తరించిన హనుమతో బాటుగా ఉడుత కూడా శ్రీరాముని సేవించి శ్రీరాముని హస్తముచే నిమురబడి ధన్యత బొందినది. ఈనాటికి ఉడుతల వెన్నుపై శ్రీరాముని వ్రేళ్ల చారలు చూడవచ్చు.

రామం, నువ్వు చాలా మంచి పిల్లవాడివి. ఇంత చిన్న ప్రాయంలోనే ఇన్ని పనులు చేసుకొని బుద్ధిమంతుడవని పించుకుంటున్నావు. న గాయత్రాః పరం మంత్రః అనగా గాయత్రిని మించిన మంత్రం లేదు. పైగా జనులందరూ జన్మతే శూద్రాః అనగా జనులందరూ జన్మతః శూద్రులు. అందరూ వారి వారి ధర్మాలను శ్రద్ధగా అనుష్ఠించిన వారికి ద్విజత్వం వస్తుంది. రామం, జన్మానాం నర జన్మ దుర్లభం అన్నది శాస్త్రవచనం. ఎన్నో జన్మల సత్కార్యాలు చేస్తే గాని దొరకని నరజన్మ మనందరికీ భగవంతుని కృప వల్ల కల్గినది. దీనిని సద్వినియోగం చేసుకొని కృతార్థుడవుదుగాక! నేను ప్రతిరోజు మీ ఊరిలో గల శివాలయంలో వేద పఠనానికి వస్తుంటాను. నీకు సంధ్యావందనం సాంగోపాగంగా వచ్చేవరకు ఉదయం సూర్యోదయ సమయానికి వచ్చి నీకు నేర్పిస్తాను, అని చెప్పి అనతి కాలంలోనే సంధ్యావందనాదులు నేర్చుకొని, శ్రద్ధాభక్తులతో అనునిత్యం అనుష్ఠించటం చేస్తున్నందున, మంచి చెడ్డా విచక్షణ, ఆధ్యాత్మికత పెరిగి, భావి భారతాన్ని ఉద్ధరించడానికి ఒక మంచి పౌరునిగా వినుతికెక్కాడు.

కావున ప్రతి తల్లిదండ్రులు వారి సంతానాన్ని సన్మార్గంలో సంచరించుటకు వారి వారి ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఆంగ్ల విద్యతో బాటుగా భగవదారాధన చేయునట్లుగా ప్రోత్సహించి సన్మార్గోప గతులు అగుటకు దోహద పడవలెను.

★★★

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

నదీ ప్రవాహానికి కొండ అడ్డుపడుతుంది. ఆగిపోతుందా నది? లేదు. దారి మళ్లిస్తుంది. కొండను చుడుతుంది. కొండకు కొత్త అందాన్ని తెచ్చి పెడుతుంది. ఒక బండరాయి ఉలి దెబ్బలు తింటుంది. అందమైన శిల్పంగా మారుతుంది. వెదురు కర్రని గుచ్చి గుచ్చి పెడతారు. చిన్న రంధ్రాలు చెక్కబడుతాయి. ఎన్నో గాయాలు భరిస్తుంది. వేణువై పోతుంది. తియ్యగా పాడుతుంది. కష్టాలకి ఎదురు నిలవాలి. విజేతలవ్వాలి. ఇది వాల్మీకీ సందేశం.

ఒక మనిషి దుఃఖ సముద్రంలో మునిగి వున్నాడు. చూసి కూడా ఉదాసీనంగా వుండరాదు. ఓదార్చాలి. ధైర్యం చెప్పాలి. యధాస్థితికి తీసుకు రావాలి. పుడతారు, చస్తారు. కాని బతుకును సమాజానికి ధారపోయాలి. పరుల కోసం పాటుపడాలి. పుట్టినప్పుడు పేరుండదు. చనిపోయాక కూడా పేరు వుండేలా చూసుకోవాలి. లక్ష్మణుడు చేసింది అదియే. శోక సాగరంలోంచి రాముణ్ణి పైకి లాగాడు. కార్యోన్ముఖుణ్ణి గావించాడు. సౌమిత్రిలా వుండాలని శ్రీరామాయణం చెబుతోంది మనకు.

''రామా! నీవు క్షత్రియుడవు. దుఃఖాల్ని సహించు. అల్పులకి కూడా ఆదర్శంగా నిలవాలి. ప్రజలూ నీలా ఆర్తులైతే వారిని సుఖపెట్టేది ఎవరు? సూర్యచంద్రులు తేజోవంతులు. జగత్తుకి ఇద్దరూ రెండు కన్నులు. వారికి గ్రహణ బాధ తప్పడం లేదు. కర్మ ఫలం వుంటే అనుభవించాలి తప్పదు.

**'అవశ్యం అనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం'**

చేసుకున్న ఫలం మంచిదా చెడ్డదా అని కాదు. అనుభవించి తీరాలి. తప్పదు. దానికి విచారమెందుకు? ఇవన్నీ నాకు చెప్పావు. మరచిపోయావా? అన్నా, నీకు నేను చెప్పేవాడినా నేను. ధర్మ వీరుడవు నీవు. నీ పరాక్రమం ప్రదర్శించు శత్రు వినాశనానికి శౌర్యాన్ని వినియోగించు''

విన్నాడు రాముడు. చిన్నవాడైనా మంచి చెప్పాడు. 'బాలాదపి సుభాషితం' అన్నారు కదా. కోపాన్ని నిగ్రహించాడు. విల్లు పట్టాడు. 'క్షురం' అనే శరం తీశాడు. అది చంద్రాకారంలో వుంది. భయంకరంగా వుంది. దాన్ని వింటికి తొడిగాడు. అన్నదమ్ములు నడిచారు. కొద్దిదూరం వెళ్లారు.

**ఆత్మార్పణం**

'పర్వత కూటభం మహాభాగం ద్విజోత్తమం దదర్శ' పర్వత శిఖరాకారుడు మహాకాయుడు, పుణ్యాత్ముడు పక్షిరాజు జటాయువుని చూశాడు రాముడు. అంటున్నాడు –

''తమ్ముడా! వీడే సీతను భక్షించాడు. గద్ద రూపంలో వున్నాడు. కామరూపుడు. రాక్షసుడు. వీణ్ణి చంపేస్తాను'' పక్షి

మీదికి పోయాడు.

చూశాడు జటాయువు. నురుగులుగా నెత్తురు కక్కుతున్నాడు. 'ఆయుష్మాన్' అన్నాడు రాముణ్ణి. స్వరం దీనంగా వుంది. 'జానకిని అపహరించింది రాక్షసుడు. వాడి పేరు రావణుడు. నా ప్రాణాల్ని హరించింది వాడే. మీరు ఆశ్రమంలో లేరు. వంటరిగా వుంది సీత. రావణుడు అపహరించాడు. పారిపోతున్నాడు. చూసాను నేను. నిలువరించాను వాణ్ణి. మా మధ్య యుద్ధం జరిగింది. రథం కూల్చాను. విల్లు ముక్కలు చేశాను. కవచం చీల్చాను. సారథిని చంపాను. నా రెక్కలు ఖండిచాండు వాడు. వైదేహిని తీసుకెళ్లాడు. రావణుని చేత హతమైనాను. కొన వూపిరితో వున్నాను. ఇంకా నన్నెందుకు చంపుతావు''

అది జటాయువు స్వరం. గుర్తుపట్టాడు. విల్లంబులు జారిపోయాయి. బాష్పపూర్ణలోచనుడైనాడు. ప్రాణాలకు తెగించాడు. పోరాడాడు పక్షిరాజు. ఎత్తుకున్నాడు రాముడు. కౌగలించుకున్నాడు. దుఃఖపరవశుడైనాడు. చూశాడు లక్ష్మణుడు. తల్లడిల్లాడు. విలపించాడు. అంటున్నాడు తమ్ముడితో రాముడు.

**రాజ్యాత్ భ్రంశో వనేవాసః సీతానష్టా ద్విజో హతః**
**ఈ దృశీయం మమాలక్ష్మీః నిర్దహేదపి పావకమ్**

''రాజ్యం పోయింది. వనవాసం వచ్చింది. సీతను కోల్పోయాను. ఇది చాలదన్నట్లు జటాయువు కొనవూపిరితో వున్నాడు. ఇది నాస్థితి. నా దౌర్భాగ్యాన్ని అగ్ని సైతం దహింపలేదు. ఉపశమనం కోసం సముద్రంలో మునుగుదామంటే సముద్రం కూడా ఎండిపోతుంది. అది దురదృష్టం. దుఃఖ పరంపరలు వెంటాడుతున్నాయి నన్ను. ఈ చరాచర జగత్తులో నాకంటే దౌర్భాగ్యుడు మరొకడుండడు.

తమ్ముడా! ఈ జటాయువు మన తండ్రికి ఆప్తుడు''అన్నాడు.

గృధ్రరాజు తనవు నిమిరాడు రాముడు. నా ప్రాణం మైథిలి. ఎక్కడ? – అడిగాడు.

''రాఘవా! చూపు మందగించింది. మరణం ఆసన్నమైంది. సీతను అపహరించాడు రావణుడు. అది 'వింద' అనే ముహూర్తం. అది రావణునికి తెలియదు. ఆ ముహూర్తంలో పోయిన సొమ్ము మళ్లీ యజమానికి దొరుకుతుంది. నీవు రావణుని చంపుతావు. సీతను తెచ్చుకుంటావు''అన్నాడు జటాయువు. తర్వాత నోట్లోంచి మాంసపు ముద్దలు పడ్డాయి. రక్తం ధారలై పారింది. ''రామా! రావణుడు విశ్రవసువు పుత్రుడు. కుబేరుని తమ్ముడు'' గొంతు మూగబోయింది. తల ఒంగిపోయింది. కాళ్లు చాచాడు. పక్కభాగాలు ఎగిరాయి. ప్రాణం పోయింది.

చనిపోయాడు పక్షిరాజు. బోరున ఏడ్చారు రామలక్ష్మణులు.

రోజుకి 24 గంటలు. 30 ముహుర్తాలు. పగలు 15, రాత్రి 15 ముహూర్తాలుంటాయి. పగలు పదకొండో ముహూర్తాన్ని



'విజయ' అంటారు. 'వింద' అని నామాంతరం. అది శాస్త్రవచనం. రాముని జన్మ నక్షత్రం పునర్వసు. వసువు అంటే ధనం. పోయిన వస్తువు (ధనం) మళ్లీ (పున) లభిస్తుంది. అది నక్షత్ర అంతరార్థం. సీతమ్మ మళ్లీ దొరుకుతుందని భావార్థం. అది ముహూర్త బలం.

రాముడు రావాలి. అంతవరకు ప్రాణాలు బిగబట్టాలి. సీతాపహరణం వార్త చెప్పాలి. అది సీతాదేవి జటాయువుకి ఇచ్చిన ఆదేశం. అంటుంది స్కాందపురాణం.

రణరంగంలో లోక హితార్థం వీర మరణం పొందాడు జటాయువు. అతడు మోక్షానికి అర్హుడు. భగవద్భక్తుడు. నిరంతర భగవత్ భాగవత సేవాతత్పరుడు మోక్షప్రాప్తికి అర్హుడు.

''లక్ష్మణ! ఈ దండకారణ్యంలో వున్నాడు జటాయువు. ఎంతోకాలం జీవించాడు. నిర్భయంగా తిరిగాడు. సీతకోసం పోరాడినాడు. ఇతని ఉపకారం అమూల్యం.

శూరులు, వీరులు మనుషుల్లోనే కాదు పశువుల్లో, పక్షుల్లో వుంటారు. ఈ పక్షిరాజు త్యాగమూర్తి. ఇక లేడు. ఈ వీరుణ్ణి పోగొట్టుకున్నాను. ఈ దుఃఖం ముందు సీతా వియోగ దుఃఖం ఏపాటిది? ఆత్మీయుణ్ణి కోల్పోయారు. అన్నదమ్ములు ఏడ్చారు.

''లక్ష్మణా! జటాయువు మన తండ్రిలాంటివాడు. పూజ్యుడు. మాన్యుడు. త్వరగా వెళ్లు కట్టెలు తీసుకురా. వాటిని మధిద్దాం. అగ్ని సిద్ధం చేద్దాం. ఆత్మార్పణం గావించాడు గృధ్రరాజు. అగ్ని సంస్కారం నెరపాలి''అన్నాడు రాముడు.

తర్వాత ఇద్దరూ అడవిలోకి వెళ్లారు. (రోహి) మృగాల్ని వేటాడారు. వాటి మాంసం తీసుకున్నారు. కట్టెలు తెచ్చాడు లక్ష్మణ స్వామి. చితి పేర్చారు. పక్షిరాజు కళేబరాన్ని చితిపైకి చేర్చారు. నిప్పంటించాడు రాముడు.

రాముడు అంటున్నాడు ''యజ్ఞశీలురు ఏ లోకానికి పోతారో, ఆహితాగ్నులు ఏలోకానికి పోతారో, సన్యాసులు ఏలోకానికి పోతారో, భూదాతలు ఏ లోకానికి పోతారో – యుద్ధంలో వెన్నుచూపక వీరమరణం పొందినవారు ఏ లోకానికి పోతారో,

సర్వభోగాల్ని త్యజించిన త్యాగమూర్తులు ఏ లోకానికి పోతారో నీకు ఆ ఉత్తమ లోకాలు ప్రాప్తిస్తాయి. నాచేత దహన సంస్కారం పొందిన నీకు మోక్షప్రాప్తికి అర్హుడవు". తండ్రియైన దశరథుడు కూడా ఆ భాగ్యాన్ని నోచుకోలేదు. అది జటాయువు అదృష్టం.

దర్భలు పరచాడు సౌమిత్రి. మాంసాన్ని ముద్దలు చేశారు ఇద్దరు. జటాయువుకి పిండ ప్రదానం చేశాడు రాముడు. పితృదేవ సంబంధిత మంత్రాలు చదివాడు. గోదావరికి పోయారు. స్నానం చేశారు. జటాయువుకి జలతర్పణాలు విడిచారు.

నవవిధ భక్తుల్లో జటాయువు ఒకడు. ఆత్మ నివేదనంలో బలి చక్రవర్తి తర్వాత జటాయువుని చెబుతారు. పక్షిరాజుకి రాముడు దహన సంస్కారం చేశాడు. దాన్ని బ్రహ్మ మేథ సంస్కారమంటారు. విదురునికి బ్రహ్మమేథ సంస్కారం చేశాడు ధర్మరాజు. 11 శతాబ్దంలో మారినేరి నంబి ఒక దళితుడు. ఆళ్వందార్ (యామునాచార్యులు) శిష్యుడు. ఆ నంబి చనిపోయాడు. మహాపూర్ణులు భగవత్ రామానుజాచార్యుల గురువు. ఆ మహానుభావుడు మారినేరి నంబికి బ్రహ్మమేథ సంస్కారం చేశాడు.

పరమాత్మ తత్వం తెలిసినవారిని బ్రహ్మవేత్తలంటారు. వారు ప్రతిఫలాన్ని ఆశించరు. ప్రతికార్య పరమాత్మ ప్రీత్యర్థం, కైంకర్యార్థం ఆచరిస్తారు. పశువులు పక్షులు కీటకాదులు కూడా వుండొచ్చు. సాలెపురుగు పాము ఏనుగు పరమ శివుని ఆరాధించాయి. తరించాయి. వాటికి గుర్తుగా శ్రీకాళహస్తి పేరుతో పుణ్యక్షేత్రం ఏర్పడిందన్నారు పెద్దలు. సీతాదేవి రక్షణలో ప్రాణత్యాగం చేసాడు జటాయువు. నాది నా కోసం అనే స్వార్థ చింతన లేదు పక్షిరాజులో. అతణ్ణి బ్రహ్మవేత్తలో చేర్చారు మన పెద్దలు. అలాంటి సదాచార సంపన్నులైనవారికి చేసే ఆ అపరక్రియ బ్రహ్మమేథ సంస్కారమంటారు. శరభంగుడు కూడా బ్రహ్మమేథ మంత్రం పఠించాడు. తన శరీరాన్ని అగ్నికి ఆహుతి చేశాడు. విదురుడు దాసీపుత్రుడు కాని సత్యవాది. ఋజువర్తనుడు. కృష్ణుణ్ణి సాక్షాత్ పరమాత్మ అని నమ్మినవాడు. కౌరవ సభకు రాయబారిగా వెళ్లాడు కృష్ణుడు. దుర్యోధనుని విందు భోజనం తిరస్కరించాడు. భీష్మ ద్రోణాదులు అతని దృష్టిలో లేరు. విదురుని ఇంటికెళ్లాడు. అతని ఇంట పంచభక్ష్య పరమాన్నాల్లేవు. అరటి పండ్లు వున్నాయి. భక్తపరవశుడైనాడు విదురుడు. పండ్లు పడేశాడు అరటి తొక్కలు అందించాడు. తిన్నాడు కృష్ణదేవుడు. పత్రం పుష్పం ఫలం తోయం ఏదైనా భక్తిశ్రద్ధలతో సమర్పిస్తే స్వీకరిస్తాడు స్వామి.

నంబి అస్పృశ్యుడు దళితుడు. మారినేరి గ్రామ నివాసి. భిక్షాటనమే వృత్తి. ఆ రోజు భిక్ష దొరకలేదు. ఆకలి. పొలంగట్టుకెళ్లాడు. కాలువలో నీరు పారుతోంది. మట్టి తీసి తింటున్నాడు. ఆ దృశ్యం చూసారు యామునాచార్యులు. శిష్యులతో శ్రీరంగం వెడుతున్నాడు. ఆశ్చర్యపోయాడు. మట్టి తింటున్నావేం అడిగాడు. మనశరీరమంతా మట్టే కదా. తింటే తప్పేం? ఎదురు ప్రశ్న వాడిది. ఆ వినయంలో, ఆ అమాయకత్వంలో, ఆ నిరుపేదలో, ఆ దళితునిలో దాగిన పరమ తత్వం గ్రహించాడు ఆచార్యులు. నాతో వస్తావా... పిలిచాడు. మీరు గొప్పోళ్లు. మేం అంటరాని వాళ్లం స్వామి – అది వాడి జవాబు. అందరి శరీరాల్లో వుండేది మట్టే కదా. నువ్వే చెప్పావు. రా పోదాం అని వాడి చేయి పట్టుకున్నాడు. తన వెంట తీసుకెళ్లాడు. ఒక బండరాయిని మహాశిల్పంగా మార్చవచ్చు అనుకున్నాడు. అందరూ భగవత్ స్వరూపులే అని యామునుల భావన. ఆ వూరి పేరిట వాడు మారినేరి నంబిగా పిలువబడ్డాడు. శ్రీరంగంలో మంత్రోపదేశం చేశాడు. భగవత్ తత్వం తెలియ చేశాడు. నిత్యం జరిగే భాగవత గోష్ఠిలో నంబి భాగస్వామి అయ్యాడు. ఆచార్యులు తలచినట్లు తత్వవేత్త అయ్యాడు.

ఈ వేద భూమిలో, ఈ కర్మభూమిలో, ఈ పుణ్యభూమిలో ఎందరో బ్రహ్మవేత్తలు వున్నారు. అదే మన భారతదేశ గొప్పతనం. మమ అనకు. నమమ అను– అనేది మన భారతీయ సంస్కృతి. అదే సనాతన ధర్మం. నాది అంటే స్వార్థం, అపచారం. నీది అంటే నిస్వార్థం, ఉపచారం. ఈశావాక్యం ఇదం సర్వం అంటుంది ఉపనిషత్తు. సకల చరాచర జగత్తు అతా పరమాత్మ సొత్తు. ఆ భావనే పరమర్షుల తత్వ దృష్టి.

రాముణ్ణి రెండు కోణాల్లో చూడాలి. అది వాల్మీకి అభిప్రాయం. పర్ణశాలలో సీత కనబడలేదు. నరునిగా ఏడ్చాడు. కుమిలిపోయాడు. ఉన్మాదిలా ప్రవర్తించాడు. జటాయువు పోయాడు. విలపించాడు. అది నరునిగా చేశాడు. పక్షిరాజుకి అగ్నిసంస్కారం చేశాడు. సరాసరి మోక్షప్రాప్తి కల్గించాడు. అది నారాయణునిగా చేశాడు. ఇక్కడే కాదు ఆది నుంచి అనేక సన్నివేశాల్లో రాముని రెండు విధాల దర్శించాలి మనం.

నవవిధ భక్తులు ఉన్నారు. భాగవతాది గ్రంథాలు చెబుతున్నాయి. 1. శ్రవణం (పరీక్షిత్తు), 2. కీర్తనం (నారదుడు) 3. స్మరణం (ప్రహ్లాదుడు) 4. పాద సేవనం (లక్ష్మీదేవి) 5. అర్చనం (పృథు చక్రవర్తి) 6. వందనం (అక్రూరుడు) 7. దాస్యం (హనుమ) 8. సఖ్యం (అర్జునుడు) 9. ఆత్మనివేదనం (బలి చక్రవర్తి, జటాయువు).

చనిపోయినవారికి పిండప్రదానం చేస్తారు. తద్దినాలు పెడతారు. ఈ లోకంలో లేనివాడికి ఎలా అందుతుంది? ఒకడిని మేడ మీద కూర్చోబెడతాం. మంత్రాలు చదవండి. భోక్తకి అన్నం పెట్టండి. మేడమీదివాడికి కడుపు నిండుతుందా? అని ప్రశ్నిస్తారు హేతువాదులు. పితృలోకం అనేది ఒకటి ఉంది. వసు రుద్ర ఆదిత్య

స్వరూపులుగా వుంటారు పితృదేవతలు. వారి ద్వారా మనం అనుకునే వారికి అందుతుంది. ఆ మంత్రాలు చనిపోయినవారి గూర్చి. మేడ మీద బతికి ఉన్నవాడికి ఎలా అందుతాయి. గార పిండి రేగుపండ్లతో కలిపిన దాన్ని ముద్దలు చేసి పిండప్రదానం చేశాడు రాముడు. అది దశరథునికి అందాలని. అతడేలోకంలో ఉన్నా పితృదేవతల ద్వారా అందుతుంది. ఇక్కడ మనం తినే ఆహారం అక్కడ వారు తీసుకునే ఆహారంగా మారుతుంది. అమెరికాలో మన వాడున్నాడు. వాడు డబ్బులడిగాడు. ఇక్కడ మనం రూపాయల్లో వుంచుతాం. అక్కడ వాడికి డాలర్లలో అందుతుంది. పూర్వం టెలిగ్రాఫ్ వుండేది. టెలిగ్రామ్స్ వచ్చేది. అది ఒక యంత్రం. శబ్దంతో పనిచేస్తుంది. ఇక్కడ మనం చెప్పేది శబ్ద శక్తి ద్వారా ఎవరికి చేరాలో వారికి అందుతుంది. ఒక యంత్రానికి ఆ శక్తి ఉన్నప్పుడు మంత్రోచ్చారణలోని శబ్దశక్తి గమ్యం చేరుతుంది కదా! అదంతా శాస్త్రం. నమ్మకం మీద ఆధారపడి ఉంటుంది. శ్రద్ధగా చేయాలి. శ్రద్ధతో చేసే క్రియనే శ్రాద్ధం అన్నారు.

**సీతాన్వేషణ**

జటాయువు దహనక్రియలు ముగిశాయి. అంతా అడవి. దారిలేదు. నానావిధ వృక్షాలు అల్లుకుపోయిన తీగెలు. కాలుపెట్టడానికి లేదు. సింహాలు, పెద్ద పులులు, కొండ చిలువలు, కొండ పాములు స్వేచ్ఛా విహారం చేస్తున్నాయి. వాతావరణం మహాభయంకరంగా వుంది. దారి చేసుకోగల్గారు. వేగంగా నడిచారు. కీకారణ్యం దాటారు. జనస్థానం నుంచి మూడు కోసులు ఆరు కిలోమీటర్లు నడిచారు. క్రౌంచారణ్యం ప్రవేశించారు. రకరకాల పక్షుల్ని చూశారు. మహా విష సర్పాల్ని చూశారు. క్రూర మృగాల్ని చూశారు. వాటిని తప్పించుకుంటున్నారు. పోతున్నారు. ఆగుతున్నారు. మరో మూడు కోసులు నడిచారు. క్రౌంచారణ్యం దాటారు. మతంగాశ్రమం వైపు పోసాగారు.

దారి తెలియలేదు. అయినా ముందుకెళ్లారు. అది ఘోరారణ్యం. అక్కడ పక్షులు భయంకరంగా వున్నాయి. పాములు మృగాలు అలాగే భయం గొల్పుతున్నాయి. మానవ సంచారం లేని కారడవి. ఒక గుహ కనిపించింది. అది పాతాళంలా వుంది. చాలా లోతుగా వుంది. చిమ్మచీకటి ఏమీ కనిపించలేదు. సీత లోపల వుంటుందేమో? పోవాలా వద్దా — గుహ దగ్గర ఆగారు.

**అయోముఖి**

సమీపంలో ఒక రాక్షసి వుంది. చూశారు రామలక్ష్మణులు. ఆ రాక్షసిది మహా స్థూల శరీరం. వికృత రూపం. వేలాడే బానపొట్ట, వాడివైన కోరలు, బిరుసెక్కిన చర్మం, విరబోసుకున్న వెంట్రుకలు. సింహాదుల మాంసం తింటోంది. మహా భయంకరంగా వుంది. చూసింది అన్నదమ్ముల్ని. లేచింది. నడిచింది. లక్ష్మణుని దగ్గరికి వెళ్లింది. పట్టుకుంది. అంటోంది... ''చిన్నవాడా! యువకుడా రా! మనిద్దరం రమిద్దాం'' కౌగలించుకుంది. ''నా పేరు అయోముఖి. ఓ వీరుడా! నీవు నా ప్రియుడవు. కొండ కోనల్లో విహరిద్దాం. నదీతీరాల్లో తిరుగుదాం. ఇసుక తిన్నెల్లో పడుకుందాం. రమిద్దాం. సుఖిద్దాం''.

విన్నాడు లక్ష్మణ స్వామి కుపితుడైనాడు. కత్తి తీశాడు. ముక్కు చెవులు కోసాడు. రెండు స్తనాలు కోసాడు. భయంకరంగా అరచింది. పెడబొబ్బలు పెట్టింది. పరుగులు తీసింది. తాటక, శూర్పణక ముక్కు చెవులు కోశాడు. ఇప్పుడు అయోముఖి మూడో రాక్షసి. దానికి ముక్కు చెవులు కోశాడు. వాళ్లని అంద వికారంగా చేయడం. వారిలో కామప్రవృత్తిని అణగదొక్కడం — అందుకే ముక్కు చెవులు కోసాడేమో!



**కబంధుడు**

రామ లక్ష్మణులు నడవసాగారు. మరొక కీకారణ్యం చేరారు. 'అన్నా రామా! నా ఎడమ భుజం అదురుతోంది. ఏదో తత్తరపాటు. అపశకునాలు కనపడుతున్నాయి. ఏదో ఆపద రానుంది. మంజుల పక్షి అరుస్తోంది. అది శుభసూచకం. ఈ మంజుల పక్షికి వంచులకం, కర్ణకాలం అనే నామాంతరాలు వున్నాయి.

అంతలో పెద్ద చప్పుడు. అడవి దద్దరిల్లింది. పెద్ద సుడిగాలి వీచింది. ఆ శబ్దం ఎక్కడ నుంచి వచ్చింది? పరిశీలనగా చూస్తున్నాడు రాముడు. ముందుకు నడిచాడు. అల్లంత దూరంలో పొద. అందులో మహాకాయుడు. వాడో రాక్షసుడు. వాడికి తల లేదు. మెడ లేదు. కాళ్లు లేవు. పెద్ద మొండం. పెద్ద కడుపు. ఆ కడుపులో కన్ను. గుహలాంటి నోరు. పాములా ఆడుతున్న నాలుక. పెద్ద పెద్ద కోరలు. పొడవాటి చేతులు. ఒక యోజనం దూరం దాక సాగుతాయి. రెండు చేతులు చాచుతున్నాడు. సింహాలు ఏనుగులు ఎలుగుబంట్లు పక్షులు అందినవాటిని పట్టుకుంటున్నాడు నోట్లో వేసుకుంటున్నాడు.

ఆ రాక్షసునికి దొరికారు అన్నదమ్ములు. అదిమి పట్టాడు ఇద్దరినీ. దగ్గరకి తీసుకున్నాడు. ఊపిరాడటం లేదు. అంటున్నాడు లక్ష్మణుడు. ''అన్నా! నేను అశక్తుణ్ణి. వీడికి ఆహారమవుతాను. నీవు తప్పించుకో. వెళ్లిపో. సీత దొరుకుతుంది. బయటపడు. త్వరగా పో''

**(సశేషం)**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

### 11. దశావతార స్తోత్రం

పూర్వం రజోగుణంతో అహంకరించిన మధుకైటభులు చతుర్ముఖుని మభ్యపెట్టి వేదములను అపహరించగా వారిని సంహరించి వారి నుండి వేదములను తీసుకువచ్చి బ్రహ్మదేవునికి ఇచ్చుటకై మత్స్యరూపాన్ని ధరించిన మత్స్యమూర్తిని శరణు వేడుతున్నాను.

దేవతలకు అమృతాన్ని ప్రసాదించి కాపాడుటకై పాలసముద్రం మధ్యలో మందర పర్వతాన్ని ధరించుటకు కూర్మావతారాన్ని ధరించిన ఆదిదేవుని శరణువేడుతున్నాను.

రాక్షసులచే భయంకరంగా పీడింపబడుతూ పాతాళ లోకంలో ఉన్న భూదేవిని లేవనెత్తుటకై వరాహ రూపాన్ని ధరించిన చతుర్భుజుడైన వరాహ స్వామిని శరణు వేడుచున్నాను.

సకల ప్రాణులను హింసించువాడు, తనకు శత్రువు అయిన హిరణ్యకశిపుని నృసింహరూపం ధరించి వాడి గోళ్ళచే చీల్చివేసిన హిరణ్యగర్భుని శరణు వేడుచున్నాను.

పూర్వం బలిచక్రవర్తి యజ్ఞం చేస్తుండగా ఆ యాగశాలలో ప్రవేశించి మూడడుగుల భూమిని యాచించి చివరకు ఆయన శిరస్సుపై మూడో పాదాన్ని పెట్టిన వామనమూర్తిని శరణు వేడుతున్నాను.

ఇరవై ఒక్కసార్లు భూప్రదక్షిణంగా దిగ్విజయం చేసి గండ్ర గొడ్డలిచే దుష్ట క్షత్రియులను సంహరించి వారి రక్త ప్రవాహంతో పితృతర్పణం చేసిన పరశురాముని శరణు వేడుతున్నాను.

దశరథుని పుత్రునిగా అవతరించి ఒకే బాణంతో రావణాసురుని పది తలలను ఖండించి విభీషణునికి లంకారాజ్యాన్ని ఇచ్చిన రామభద్రుని శరణు వేడుతున్నాను.

యాదవ వంశంలో పుట్టి, చేతిలో నాగలిని ధరించి, ప్రలంబుడు మొదలైన రాక్షసులను సంహరించినవాడు, ఉదారుడు, విరాడ్రూపుడు అయిన బలరాముని శరణు వేడుతున్నాను.

వృష్ణి వంశోద్భవుడు, భూభారాన్ని తగ్గించినవాడు, మహాప్రభావశాలి, పాండవులకు భాగ్యదేవత, పరమ పురుషుడు, యోగీంద్రులచే నమస్కరింపబడువాడు అయిన శ్రీకృష్ణుని శరణు వేడుతున్నాను.

సహజంగానే పాపములు పోగొట్టువాడు, షోడశకళాపరిపూర్ణుడు, భయంకరమైన రూపము కలవాడు, దుష్టులను సంహరించుటకై భవిష్యత్తులో కల్క్యావతారాన్ని ధరించబోయే ముకుందుని శరణు వేడుతున్నాను. ప్రకృతి, దాని వికారాలైన మహత్తత్త్వము, అహంకారము, పంచేంద్రియాలు, పంచ తన్మాత్రలు, పంచ భూతాలు, ఇవన్నీ ఎవరి నుండి పుట్టినవో, ఎవని వలన ప్రవర్తిస్తున్నవో జీవుడు ఎవరికి పరతంత్రుడై ప్రవర్తిస్తున్నాడో అటువంటి సకలాత్మ స్వరూపుడైన

ఆత్మనాథుని శరణు వేడుచున్నాను.

పూర్వం ఈ జగత్తంతా ఎవరి వలన సృష్టించబడినదో, మరల ఎవరి యందు లీనమైనదో, నిగ్రహానుగ్రహాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయో అటువంటి శ్రీనివాసుని శరణు వేడుతున్నాను. నిరామయుడు, నిశ్చల నీటి సముద్రం వంటి రంగు కలవాడు, నిస్తుల తేజోవిరాజితుడు, సర్వ నియామకుడు, సృష్టికర్త, లయకర్త, సదా యోగనిద్రలో ఉండేటటువంటి నారాయణుని శరణు వేడుచున్నాను. చరాచరాత్మకమైన ఈ ప్రాణి జాతాన్ని సృష్టించి, పోషించి, లయింపజేసి, వాటినన్నింటిని తన ఉదరము నందే ఉంచుకొని శయనించువాడు. ప్రళయంలో జలం ఏకార్ణవం కాగా మఱ్ఱి యాకుపై నిద్రించే వటపత్రశాయిని శరణు వేడుచున్నాను.

సమస్త దుఃఖములను పోగొట్టువాడు, ఇంద్రియాలకు గోచరించనివాడు, నిష్కారణుడు, అప్రమేయుడు, అణువు కంటె అణువు, ఆదిమధ్యాంత రహితుడు, మహామహిమాన్వితుడు అయిన అనంతుని శరణు వేడుచున్నాను. సప్తద్వీపాలతో కూడి ఈ భూమండలాన్ని రంజింపజేసిన రాజహంస, సప్తసముద్రావృతమైన సంసార సాగరాన్ని దాటించే చుక్కాని, సూర్యమండల మధ్యవర్తి అయిన హిరణ్మయుడు, అగ్నికి అంతర్యామి అయిన శ్రీహరిని శరణు వేడుచున్నాను.

దోషరహితుడు, నిర్మలమైన పూర్ణచంద్రబింబము వంటి ముఖము కలవాడు, ధర్మమూర్తి, వేదాంతవేద్యుడు, నిత్యుడు, శాశ్వతుడు, మోక్షప్రదాతయైన భగవంతుని శరణువేడుచున్నాను. అద్వితీయుడు, సర్వ జీవాంతరాత్మ, ఈ విశ్వాన్నంతా తనలో ఇముడ్చుకొని మరల సృష్టించువాడు, అనంతకల్యాణగుణ స్వరూపుడు, సమస్త సంపదలకు పెన్నిధియైన శ్రీనివాసుని శరణు వేడుచున్నాను.

శరీరము, చర్మము, మాంసము, ఎముకలు, రక్తము, కొవ్వు, మలమూత్రములు, శ్లేష్మము మొదలగు వాటిచే కూడిన నిస్సారమైన ఈ దేహము మొదలగు వాటి యందు నాకు కోరిక లేదు. దేవదేవా! ఇదే నా నిశ్చయం. నీవు నన్ను అనుగ్రహించు. ఓ స్వర్లోకనాథా! దయాసముద్ర తరంగములతో ఒప్పుచున్న తామర పుష్పమువలె మనోహరములైన నీ క్రీగంటి చూపులతో అనాథనైన నన్ను ఆనందింపచేయి. ప్రభూ! నీ పాదారవిందముల నుండి స్రవించే మకరందాన్ని ఆస్వాదించి మైమరపించే నిశ్చల భక్తి నాకెక్కడిది?

**ముకుందా! నా తపస్సును భంగం చేయటానికే ఎవరో దుర్మార్గుడు పూనుకున్నాడు. ఈ ఆపద నుండి నీవే నన్ను కాపాడాలి. నీవు తప్ప నాకు వేరే దిక్కు లేదు. ఓ అనాథనాథ! నా బుద్ధి ఎల్లప్పుడు నీయందే ఉన్నది. నీ అనుగ్రహం వలన ఆ బుద్ధి అన్నివేళలా అన్నివిధముల అలాగే ఉండుగాక!**

విషయముల వైపు పరుగులిడే దుష్టములైన ఇంద్రియములనే గుఱ్ఱములచే లాగబడుచున్న బుద్ధిగల నాకు నిశ్చలభక్తి ఎలా సిద్ధిస్తుంది? చీకటి వెలుగులు ఒకచోట ఉంటాయా? జగత్ప్రభూ! నీ పాద పద్మములను సేవించే మానవులకు అశుభములు కలుగవు. నాకు ఈ అప్సరాంగనల కటాక్ష వీక్షణముల వలన భయము సంభవించినది. దానిని పోగొట్టు.

ముకుందా! నా తపస్సును భంగం చేయటానికే ఎవరో దుర్మార్గుడు పూనుకున్నాడు. ఈ ఆపద నుండి నీవే నన్ను కాపాడాలి. నీవు తప్ప నాకు వేరే దిక్కు లేదు. ఓ అనాథనాథ! నా బుద్ధి ఎల్లప్పుడు నీయందే ఉన్నది. నీ అనుగ్రహం వలన ఆ బుద్ధి అన్నివేళలా అన్నివిధముల అలాగే ఉండుగాక! గోవిందా! ప్రభూ! నీవనుగ్రహిస్తే పొందరానిదేముంది? స్వర్గము, మోక్షము, నీ భక్తలకు అతి సులభంగా లభిస్తాయి. నీ అనుగ్రహానికి పాత్రుడైన వానికి నీ యందు గొప్ప భక్తి కలుగుతుంది.

నీవు ఉపేక్షించిన వానికి విషయ సుఖములందు ఆసక్తి కలుగుతుంది. కావున శృంగారవతులైన ఈ అప్సరాంగనల వలన భయవిహ్వలుడైన నన్ను రక్షించు. నీవే నాకు దిక్కు. వేరెవరు నాకు రక్షకులు లేరు. సమస్త శుభములను ఒనగూర్చు వాడు, దయామూర్తి వక్షస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలవాడు అయిన శ్రీలక్ష్మీనారాయణునకు నమస్కరిస్తున్నాను.

పరాశరుని మనుమడు, బ్రహ్మర్షి అయిన శుక యోగీంద్రుడు ఆ పురాణ పురుషుని ఈ విధంగా శరణు వేడగా ఆ అప్సరసాంగనలు మహాయోగీంద్రుడైన ఆ శుకమహర్షి తపస్సును భంగం చేయలేక తమ సౌందర్యాన్ని, వేషభాషలను నిందించుకుంటూ మన్మథ బాణ పీడితలై బుద్ధిహీనులై వచ్చిన దోవనే వెళ్ళారు. ఆ దేవకాంతల క్రీగంటి చూపులకు చేత, శృంగారచేష్టలకు వశం కాకుండా తన చిత్తవృత్తిని నిరోధించి చీకటి నుండి విడువబడిన చంద్రునివలె ఆ శుక యోగీంద్రుడు నిశ్చల చిత్తంతో తపస్సు కొనసాగించాడు.

ఆ తరువాత కృష్ణద్వైపాయనుని కుమారుడైన శుకమహర్షి హృషీకేశుడు, శార్ఙ్గధరుడు అయిన భగవంతుని స్మరిస్తూ, సకలేంద్రియ సమూహాన్ని నియమించి ఆయనకే సమర్పిస్తూ,

తపస్సులో పరాకాష్ఠను కోరుతూ, రాయివంటి శరీరము కలవాడై పరమ కఠినమైన తపస్సు చేస్తూ, కాలి బొటనవ్రేలిపై భూమ్మీద నిలబడి, భక్తార్తి భంజనుడు, భక్తవత్సలుడు, అవ్యయుడు, సకల జీవ హృదయవాసి, పద్మనేత్రుడు అయిన భగవంతుని ధ్యానిస్తూ, విజ్ఞాన వైరాగ్యనిధియై మహా భయంకరము, అతి తీవ్రము, తీక్షణము, మహత్తరము అయిన తపస్సు చేశాడు.

### 12. శ్రీనివాసుని ఆవిర్భావం:

శుక మహర్షి తపస్సుకు సంతసించి పద్మలోచనుడు, చతుర్దశ భువనములకు స్రష్ట, రక్షకుడు, సంహర్త, సర్వ జీవాంతర్యామి, సర్వ నియామకుడు, నిత్యుడు, శంఖచక్ర గదా పద్మములతో విరాజిల్లే చతుర్భుజములు కలవాడు, ముత్యాల గొడుగు వలెనున్న ఆదిశేషుని వేయి పడగల క్రింద ఉన్నవాడు, అప్పుడే వికసించిన, నూతన స్వర్ణకాంతులు గల కింజల్కాలతో, దివ్య సుగంధాలతో పరిమళించే పుష్పాలతోను, దివ్యములైన అంగరాగములు, చందనములతోను అలంకరింపబడిన శరీర సౌందర్యం కలవాడు, మందహాస వదనారవిందుడు, మకరందాన్ని స్రవిస్తున్న పద్మముల వంటి నేత్రములు కలవాడు, ఆపాదమస్తకం మహామహిమోపేతుడు, పరమ పూజ్యుడు, కుముదాది గణములతో కూడినవాడు, చిత్ర విచిత్రాలైన ఆయుధాలను ధరించిన విష్వక్సేనునిచే సేవించబడుతూ, పంచాయుధములతోను శ్రద్ధాభక్తులతో సేవించబడుతూ, మరీచి, అత్రి, భృగువు మొదలగు మహాత్ముల చేతను, ఇంద్రాది లోక పాలకులచేతను స్తుతించబడుతూ, ముప్పది మూడు కోట్ల దేవ బృందములచే స్తుతించబడుతూ, పంచోపనిషత్స్వరూపుడు, పంచాత్మకుడు, పంచవక్త్రుడైన శివునికి ప్రతి రూపమైనవాడు, పంచ అథర్వాంగ సంపద కలవాడు, ఋగ్యజుస్సామ శరీరి, నాగాభరణ భూషితుడు అప్రమేయ ప్రభావుడు అయిన గరుత్మంతుని స్కంధపీటమును అధిష్ఠించి ఉండువాడు, ముప్పది రెండు కోట్ల విష్ణుభక్తులచే సేవించబడుతున్న పరాత్పరుడైన దేవదేవుడగు శ్రీనివాసుడు శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సహితుడై ఆ పద్మ సరోవరతీరంలో సాక్షాత్కరించాడు.

### 13. శుకమహర్షి పారవశ్యం

తపస్సుచే కృశించిన శరీరం కలవాడు, నిస్సంగుడు, జీవన్ముక్తుడు, పరమ పావనుడు, వ్యాసమహర్షి కుమారుడు, తపస్సుచే పరిశుద్ధుడు అయిన శుక మహర్షి ఉపేంద్రుడు, పురాణ పురుషుడు, ఇంద్రుని జయించిన భుజములు కలవాడు, ఉన్నతాసనమును అధిష్ఠించినవాడు, తన కటాక్ష వీక్షణములచే తన్ను శరణు జొచ్చినవారి కష్టములను పోగొట్టువాడు, పరాత్పరుడు, ప్రసన్నవదనుడు, వ్యాపనశీలమైన కీర్తిగలవాడు, సర్వవ్యాపి అయిన శ్రీమన్నారాయణుని దర్శించి వెంటనే దర్భాసనము నుండి లేచి సంభ్రమంతో రోమాంచితుడై, ఉత్తరీయంగా ధరించిన లేడి చర్మాన్ని ఎగురవేస్తూ, జపమాలను విసిరివేస్తూ, కమండలమును పడద్రోచి, ఆనందాశ్రువులతో నిండిన నేత్రాలు కలవాడై, కంఠస్వరం తొట్రు పడుతుండగా సూర్యకాంతి సమానుడై నివృత్తిధర్మ నిష్ణాతుడై ఆనందంతో నాట్యం చేయసాగాడు.

అప్పుడు ఆ మహర్షి ఏనుగువలె నడుస్తూ, తిరుగుచున్న గజమో అన్న భ్రమను కలిగిస్తున్నాడు. అమృతమును కోరే దేవతలకు ఆలవాలమై ఒకప్పుడు అతివేగంగాను, మరొకప్పుడు అతి మందంగాను సంచరిస్తున్నాడు. గాలి లేనిచోట ఉన్న దీపం వలె నిశ్చల మనస్కుడై ఉన్నాడు. అతను చేస్తున్న చప్పట్ల ధ్వనులు దిక్కులలో మారుమ్రోగుతున్నాయి. పిచ్చెత్తిన వానివలె తిరుగుతూ భగవంతునికి ప్రదక్షిణం చేస్తున్నాడు. భగవంతునే ధ్యానిస్తూ ఆయన్నే దర్శిస్తూ ఇతర విషయాలను విస్మరిస్తూ దేనినీ చూడకుండా, స్మరించకుండా, ఒకప్పుడు వేగంగా, మరొకప్పుడు మెల్లమెల్లగా నడుస్తున్నాడు.

ఆనంద బాష్పాలతో ఆయన కనుచూపు మందగించింది. కనులు ఆనందాతిరేకంతో ఎఱ్ఱబారినాయి. కరతాడనం చేస్తూ తోటక వృత్తాన్ని గానం చేస్తూ చేతిలో కర్ర పట్టుకొని భుజాలను తట్టుకొంటూ పెద్దగా అరుస్తూ తన తల కాళ్ళకు తగులునట్లుగా వంగుతూ, లేస్తూ పరమానంద భరితుడై భగవంతుని కీర్తిస్తున్నాడు. ఒక్కొక్క అడుగే అందంగా వేస్తూ రమాపతిని సరసంగా రంజింప చేస్తూ నాట్యం చేస్తూ శుభదాయకమైన హరినామ సంకీర్తన చేస్తున్నాడు.

ఎఱ్ఱని పద్మం వంటి నేత్రములు కలవాడు. కరుణాతరంగితాక్షుడు, సుదర్శన చక్రంతో ప్రకాశిస్తున్న పద్మహస్తుడు, నల్ల అవిసె పూవు వంటి సుకుమారమైన శరీర లావణ్యం కల శ్రీమన్నారాయణుని ఆనందింపచేస్తున్నాడు. మురవైరి, వేద వేదాంత విలాసవిభుడు అయిన శ్రీహరి ఎదుట, చుట్టూ చప్పట్లు కొడుతూ తాళం వేస్తూ సంచరిస్తున్నాడు. ఆ పుణ్యాత్ముడు ఉత్సాహంతో నాట్యం చేస్తుంటే అతని జడలు భుజాల మీద వేలాడుతూ కదలుతున్నాయి. ఆ పుణ్యాత్ముడు రెండు చేతులు జోడించి మృగరాజు వలె అసదృశ్యమైన శరీరం కలవాడై వేటాడుతున్నట్లుగా పలు వికార చేష్టలు చేస్తున్నాడు.

ఆయన పడగెత్తి ఆడే నాగుపాము వలె నర్తిస్తున్నాడు. అతని నాట్యంతో ఆ ప్రదేశమంతా చెదరిపోయింది. ఆ శుకమహర్షి చేసే నాట్యం పరమ శివుడు సంధ్యాకాలంలో చేసే నాట్యం వలె ఉన్నది. నిర్మలమూర్తి, దృఢభక్తి తత్పరుడు, జ్ఞానైశ్వర్య సంపన్నుడు, జితేంద్రియుడు, సకల నిగమాంత విశారదుడైన ఆ శుకమహర్షి సకల శ్రేయోప్రదాత, పరవాసుదేవుడైన శ్రీనివాసుని

యందు పరమ భక్తితో తన హృదయ కమలమున నివసించే పద్మనేత్రుడైన ఆ శ్రీనివాసుడు, పరిజనసమేతుడై సర్వాలంకార భూషితుడై, దివ్యాస్త్రసమేతుడై తనకు ఎదురుగా సాక్షాత్కరించగా పరిపూర్ణకాముడయ్యాడు.

### 14. భగవంతుని వరప్రదానం

ఈ విధంగా భక్తి విహ్వలుడై నాట్యం చేస్తున్నవాడు, భగవద్ధ్యాననిష్ఠుడు, భక్తితో తన్మయుడైన శుకయోగీంద్రుని గరుడవాహనుడు, దయార్ద్ర హృదయుడు, భక్తార్తి భంజనుడు అయిన భగవానుడు దయార్ద్ర దృష్టితో చూచి, దివ్యానుగ్రహంతో, ప్రేమ నిర్భరమైన వాక్కులతో ఆయన్ని ఆనందింపచేస్తూ 'ఓ శుకమునీ! నీవు ముక్తి సాధనమైన, దుష్కరమైన తపస్సు చేశావు. కావున నీకు ఈ శరీరంతోనే పునరావృత్తి రహితమైన మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను. కల్పాంతంలో నా మహామంత్ర జపమాహాత్మ్యము వలన నీకు నా సాయుజ్యం కలుగుతుంది' అని వరప్రదానం చేసి భక్త పరాధీనుడైన శ్రీమహావిష్ణువు అంతర్ధానమయ్యాడు. భగవంతుడు తనకు ఇలా ముక్తిని ప్రసాదించగా శుకమహర్షి అభీష్టాన్ని పొంది ఆయన యందే మనస్సును పెట్టి, ఆయన్నే ధ్యానిస్తూ, అప్రాకృత శరీరుడై, స్వాభావికమైన ప్రాకృతిక శోభను ప్రదర్శిస్తూ వెంటనే అక్కడే నేలపై పడి భగవంతునికి సాష్టాంగ నమస్కారం చేసి. తన ఆశ్రమానికి వెళ్ళి సుఖంగా ఉన్నాడు.

### 15. శుకపురంలో బలరామకృష్ణుల ప్రతిష్ఠ

పరాశరమహర్షి మనుమడైన శుకమహర్షి మునిశ్రేష్ఠుడై ఆ పద్మసరోవర తీరంలో నివసిస్తూ, ధ్యానయోగ నిష్ఠుడై, బ్రహ్మజ్ఞానం చేతను, ఆధ్యాత్మ విద్యవలనను పరిశుద్ధమనస్కుడై, ఏకాగ్ర చిత్తుడై, సాంఖ్యయోగాన్ననుష్ఠిస్తూ నిత్యం ధ్యానము, వేదాధ్యయనము చేస్తూ, వాసుదేవుని ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని జపిస్తూ, అందలి ప్రత్యక్షరాన్నీ నిష్ఠతో అనుసంధానం చేసుకుంటూ శ్రీనివాసుని ధ్యానిస్తూ చాలాకాలం అక్కడ ఉన్నాడు.

ఆ తరువాత శుకమహర్షి వేంకటాచలంలోని స్వామిపుష్కరిణి తీర్థానికి వెళ్ళాలనుకున్నాడు. ఆయన ఆ పద్మసరోవర తీరంలో ఒక అగ్రహారాన్ని నిర్మించాడు. అదే శుకపురం. (అదే నేటి తిరుచానూరు). ఆ అగ్రహారంలో ప్రతిరోజు వేదపారాయణం చేసేవారు. ఉపనిషత్తులను అధ్యయనం చేసేవారు. యజ్ఞయాగాది వైదిక కర్మానుష్ఠాన పరాయణులు, మంచి నడవడి కలవారు, నిర్మల మనస్కులు, నిత్యాగ్నిహోత్రులు అయిన నానా గోత్రాలకు చెందిన నూట ఎనిమిది బ్రాహ్మణ కుటుంబాలను కాపురముంచాడు.

అనంతరం శుకమహర్షి మహాబలశాలియైన బలరాముని, మాయావి, మాయాతీతుడు, దేవకీవసుదేవులకు, నందయశోదకు ఆనంద వర్ధనుడు, సకల లోకాలకు ఆనందకరుడు, భూభారాన్ని పోగొట్టుటకై అవతరించినవాడు, కామరూపి, అవ్యుడు, మాయాగోపరూపమును ధరించినవాడు, నీలమేఘశ్యాముడు, సనాతనుడు, పురాణపురుషుడు అయిన శ్రీకృష్ణుని భూమిపై ప్రతిష్ఠింపజేసి ఆ బ్రహ్మర్షి ఆయన సన్నిధానంలో ప్రభూ! పుండరీకాక్షా! మీరు వైకుంఠంలోను, పాల కడలిలోను, సూర్యమండల మధ్యంలోను ఎలా నివసిస్తారో, యోగుల హృదయాలలో ఎలా ప్రీతితో ఉంటారో అదే విధంగా ఇక్కడ సాన్నిధ్యము చెందండి"అని ప్రార్థించి సాష్టాంగ దండ ప్రణామమాచరించి, ఆ దేవదేవుని ప్రసన్నహృదయంతో ధ్యానిస్తూ, కన్నులారా దర్శిస్తూ, ఆనందిస్తూ వేంకటాద్రికి బయలుదేరాడు.

### 16. వేంకటాద్రిలో శుకమహర్షి తపస్సు

ఆ తరువాత ఆ అంజనాద్రిలోని వింతలూ విశేషాలను, మహిమలను చూడగోరి సిద్ధులు, విద్యాధరులు మరియు ఆ పర్వత గుహలలో నివసిస్తున్న యోగి పుంగవులను కలిసి సంచరిస్తూ, అక్కడి సెలయేళ్ళలో స్నానం చేస్తూ బ్రహ్మసభలో జరిగిన ఆ అంజనాద్రి వృత్తాంతాన్ని తలచుకొంటూ ఆ వేంకటాద్రి నధిరోహించి సకల శుభాలకు నిలయమైన స్వామి పుష్కరిణి తీరానికి చేరాడు.

ఆ పుణ్యతీర్థం తన తీర వాసులకు సకలాభీష్టాలను ప్రసాదిస్తుంది. శుక మహర్షి ఆ తీర్థంలో ఆచమనం చేసి లక్ష్మీదేవితో కూడిన శ్రీనివాసుని ధ్యానిస్తూ ప్రసన్నమనస్కుడై ఆనందంతో అఘమర్షణ స్నానం చేశాడు. ఆ తరువాత ఆ పుష్కరిణి తీరంలో పద్మాసనంలో కూర్చొని ధ్యానయోగాన్ని అభ్యసించాడు. బ్రహ్మజ్ఞాని, బ్రహ్మ దర్శనుడు అయిన శుకమహర్షి మహర్షులతో పాటు రహస్యంగా ఒకరితో ఒకరు సంభాషించు కొనుచు తన శిష్యగణంతో పాటు చాలా కాలం అక్కడే నివసించాడు.

### 17. శ్రీనివాసుని సాక్షాత్కారం

శుక యోగీంద్రుడు ఈ విధంగా తపస్సు చేస్తూ ఉండగా ఒకనాడు అగణ్య కారుణ్య పుణ్యమూర్తి అయిన శ్రీనివాసుడు శుక యోగీంద్రునికి సకల లోకాలను దర్శింపచేస్తూ సాక్షాత్కరించాడు. ఆ పరాత్పరుని దివ్యానంద స్వరూపులైన గరుడుడు, ఆదిశేషుడు మొదలగు పరివారము శార్ఙ్గశంఖ చక్రగదా పద్మాది పంచాయుధాలు, కుముదాది గణాలు సేవిస్తున్నారు. రాజచిహ్నాలైన శ్వేతచ్ఛత్రము మొదలైన వాటిని పరివారం ఆయనకు ధరింప చేశారు. అనేక దివ్యాభరణాలను, దివ్యాంబరాలను, దివ్యాయుధాలను ధరించిన బ్రహ్మ శక్తులు, శంకరుని శక్తులు ఆయన్ను సేవిస్తున్నారు.

ఆయన వీరందరిచే సేవించబడుతూ సంతోషంతో

కూడినవాడై నూతనాలంకార భూషితలైన శ్రీదేవి, భూదేవి, నీలాదేవి తనను సేవిస్తూ ఉండగా విలాసంగా క్రీడిస్తున్నాడు. మాయావేషధారి, సమస్త చరాచర జగత్తుకు అంతర్యామి, తన లీలావిభూతితో అనేక అవతారములను ధరించినవాడు, నీలమేఘాల వలె నల్లని ముంగురులు కలవాడు, ఉదయించుచున్న సూర్యబింబము వంటి కాంతి కలవాడు, అష్టమినాటి చంద్రుని వంటి ఫాలభాగంలో ఊర్ధ్వ పుండ్రములను ధరించాడు. చెవులలో బంగారు ఎఱ్ఱ తామరలను ధరించాడు.

ఆయన కనుబొమలు ధనుస్సువలె ఉన్నాయి. ఆయన కంటి పాపలు నెమ్మదిగా కదలుతున్నాయి. ఆయన విశాల నేత్రాలు చెవుల వరకు వ్యాపించి ఉన్నాయి. కరుణా సముద్రము నుండి పుట్టి కదలుచున్న పద్మముల వంటి నేత్రాలతో విరాజిల్లుతున్నాడు. ఆయన నాసిక నువ్వు పువ్వు వలె ఉన్నది. ఆయన అధరములు పండిన దొండ పండువలె ఎఱ్ఱగా ఉన్నాయి. ఆయన పలువరుస తెల్లని కాంతులను విరజిమ్ముతున్నది. ఆయన చెవులకు ముత్యాలు, మాణిక్యాల దుద్దులు ధరించాడు. ఆయన ముఖబింబం శరత్కాలంలో నిర్మలంగా ప్రకాశించే పూర్ణచంద్రునివలె ప్రకాశిస్తున్నది. ఆయన కంఠం శంఖం వలె ఉన్నది.

ఆయన భుజస్కంధాలు ఎద్దు మూపురాల వలె ఉన్నాయి. విశాలమైన ఆయనభుజాలు పాము పడగల వలె ఉన్నాయి. ఆయన మణికట్టు శార్ఙ్గమనే ధనుస్సు యొక్క నారిదెబ్బలతో మొద్దుబారి అందంగా ఉంది. ఆయన విశాల వక్షఃస్థలంలో శ్రీవత్సము, కౌస్తుభమణి ప్రకాశిస్తున్నాయి. ఆయన నాలుగు భుజాలలో శంఖ చక్రగదా పద్మాలు ధరించి ఉన్నాడు. ఆయన నాభిక్రింద మాణిక్యాలతో కూర్చిన మొలత్రాడు ధరించాడు. ఆయన నడుముకు కత్తిని వ్రేలాడదీశాడు. ఆయన తొడలు ఏనుగు తొండం వలె ఉన్నాయి. పిక్కలు గుండ్రంగా విశాలంగా ఉన్నాయి. ఆయన పాదాల పైభాలు తాబేలు డొప్పవలె ఎత్తుగా ఉన్నాయి. ఆయన పాదాలకు మువ్వలతో కూడిన అందెలు ధరించాడు. ఆయన గోళ్ళు చంద్రబింబం వలె ప్రకాశిస్తున్నాయి. ఆయన బొటనవ్రేళ్ళు అమృతానికి పుట్టినిల్లువలె వెలుగొందుతున్నాయి. ఆయన పాదపద్మాలు పంకజ సౌందర్యంతో శోభిల్లుతున్నాయి.

ఆయన శరీరం నల్ల అగిసె పువ్వువలె మృదువైన కాంతితో విరాజిల్లుతున్నది. ఆయన ధరించిన పట్టు పీతాంబరం బంగారు వర్ణంతో అద్భుతంగా మెరుస్తున్నది. ఆయన భుజముల నుండి పాదాల వరకు వ్రేలాడుచుండే వనమాలతో విరాజిల్లుతున్నాడు. ఆయన శిరస్సున ధరించిన బంగారు కిరీటం విచిత్ర రత్నాలతో తాపడం చేయబడింది. ఆయన మెడలో రత్నహారాలు ధరించాడు.

ఇంకను భుజకీర్తులు, మురులు, కంఠహారాలు, కంకణాలు ధరించాడు. చెవులకు మణులతో చేసిన కుండలాలను, బంగారు కమ్మలను ధరించాడు. ఈ వీరపతి వీరపట్టాన్ని, ఉంగరాన్ని ధరించాడు. భుజములందు వ్రేలాడుచున్న సువర్ణ యజ్ఞోపవీతాన్ని ధరించాడు. ఇంకా మూడు, ఐదు, ఏడు పేటలుగల ముత్యాల హారాలతో విరాజిల్లుతున్నాడు. సర్వాభరణాలు ధరించి అనేక చందనానులేపనాలను అలంకరించుకున్నాడు. సర్వ ఋతువులతో పుష్పించే పూలమాలలను మెడలో ధరించాడు. భక్తుల యందు దయగలవాడు, పరమ పురుషుడు అయిన శ్రీనివాసుడు స్వామి పుష్కరిణీ తీరంలో శుక మహర్షికి ఈ విధంగా సాక్షాత్కరించాడు.


**జగదుత్పత్తి స్థితి సంహారములకు నీవే కారణం. అటువంటి మహాశక్తి సంపన్నా తేజోమయా! నీకు జయమగుగాక! ఓ అనిరుద్ధ దేవా! ఆదిపురుషా! నీకు నమస్కారం. ఓ శ్రీనివాసా! జగన్నాథా! నారాయణా! దయానిధీ! నీ దర్శనం చేత నేను కృతార్థుడయ్యాను.**


## 18. శ్రీనివాస స్తుతి

వ్యాసుని కుమారుడైన శుకమహర్షి జీవన్ముక్తుని వలె ఆ పరాత్మరుని దర్శించి సంతోషంతో సాష్టాంగ దండ ప్రణామం చేసి అవాఙ్మానసగోచరుడు, కష్టమును పోగొట్టువాడు, కేశవుడు, హృషీకేశుడు అయిన శ్రీనివాసుని ఈ విధంగా స్తుతించాడు.

'ఓ పుండరీకాక్షా! వాసుదేవా! నీకు జయమగుగాక! నీవు మహాతేజస్సంపన్నుడవు. రాగాది దోషరహితుడవు. సకల సద్గుణ పరిపూర్ణుడవు. ప్రభూ! నీవు జ్ఞానంలోను, బలంలోను సర్వోత్కృష్టుడవు. విశ్వరూపా! సంకర్షణా! విశాలాక్షా! సర్వజ్ఞా! పరమేశ్వరా! నీకు నమస్కారం. ఓ దేవదేవా! హృషీకేశా! సర్వేశ్వరా! జగన్మయా! నీకు నమస్కారం. ఓ జగత్ప్రభూ! ప్రద్యుమ్నా! ఐశ్వర్య పరాక్రమ సంపన్నా! నీకు నమస్కారం.

జగదుత్పత్తి స్థితి సంహారములకు నీవే కారణం. అటువంటి మహాశక్తి సంపన్నా తేజోమయా! నీకు జయమగుగాక! ఓ అనిరుద్ధ దేవా! ఆదిపురుషా! నీకు నమస్కారం. ఓ శ్రీనివాసా! జగన్నాథా! నారాయణా! దయానిధీ! నీ దర్శనం చేత నేను కృతార్థుడయ్యాను. నీ సాక్షాత్కారం వలన సకల ప్రాణులు ధన్యములైనవి.

ఓ కల్యాణగుణ ప్రపూర్ణా! విష్ణుమూర్తీ! పురుషోత్తమా! ప్రసన్నుడవు కమ్ము. ఓ పుండరీకాక్షా అనుగ్రహించు. నీ

అనుగ్రహంతో నన్ను నీలో చేర్చుకో నన్ను నీవానిగా చేసుకో. నన్ను నీలో ఐక్యం చేసుకో అని ఈ విధంగా ఆ శుక మహర్షి విప్పారిన నేత్రాలతో ఆనంద నిర్భర పరిపూర్ణ హృదయంతో స్తుతిస్తూండగా శుకమహర్షిని చూసి శ్రీనివాసుడు ప్రసన్నుడై ప్రేమతో ఆయనన్నుగ్రహించి దివ్య పరిజనంతో సహ అంతర్ధానమయ్యాడు. శుకమహర్షి భగవానునికి మరల మరల సాష్టాంగ దండ ప్రణామములు చేసి పరమైకాంతులైన మహాయోగులతోను, పూజ్యులైన ఇతర మునిగణంతోను కూడి శ్రీమన్నారాయణుని అర్చా, పర, వ్యూహ, విభవ, అంతర్యామి మొదలగు వివిధ అవతారములను స్మరిస్తూ మేరుపర్వతానికి వెళ్ళాడు.

## 19. శుకమహర్షికి మోక్షప్రాప్తి

దేవలుడు దేవదర్శుని 'మహాత్మా! వ్యాసమహర్షి కుమారుడైన శుకుడు తపస్సు చేసి సిద్ధి పొందాడని లోకంలో ప్రసిద్ధి కలదు. ఓ గురూత్తమా! అతడు ఈ శుకుడేనా? లేక బ్రహ్మలోకము నుండి వచ్చిన మరొక శుకుడా? నాకు దయతో వివరించండి' అని అడిగాడు. అప్పుడు దేవదర్శునుడు ఓ దేవలా! ఇకపైన శుకమహర్షి జన్మవృత్తాంతాన్ని చెబుతాను విను. పూర్వం వ్యాసమహర్షి కుమారుడు, మహాత్ముడు, బ్రహ్మచారి అయిన శుక మహర్షి పరమ శివుని నుండి బ్రహ్మోపదేశాన్ని పొంది బ్రహ్మజ్ఞాని అయ్యాడు. ఆయన తపస్సు చేసి తపస్సిద్ధిని పొంది ఈ జగత్తునంతా పర బ్రహ్మస్వరూపంగా దర్శించాడు. అతడు బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ తన్మయుడై బాలభావంలోనే ఉంటూ జగత్తులో సంచరిస్తున్నాడు. పదహారేళ్లు కూడా నిండని ఆ బాలశుకుడు సాక్షాత్తు శ్రీకృష్ణుని వలె ప్రకాశిస్తూ ఉన్నాడు.

శుకుడు 'లక్ష్మీ దేవే నాకు తల్లి. జనార్దనుడే నాకు తండ్రి. విష్ణు భక్తులే నాకు బంధువులు. ముల్లోకాలు నాకు స్వదేశమే' అని పలుకుతూ వ్యాసమహర్షిని వదలి సూర్యుని వద్దకు వెళ్ళాడు. ఆ విధంగా తనను వదలి వెళ్ళుచున్న శుకుణ్ణి చూచి వ్యాసమహర్షి 'కుమారా! కుమారా!' అని ప్రీతితో 'ఓ బ్రహ్మచారీ! నీవు వివాహం చేసుకొని సంతానాన్ని కనలేదు. పుత్ర రహితుడవైన నీవు తలక్రిందులుగా భూలోకానికి వెళ్ళుము. వివాహము చేసుకొని పుత్ర సంతానాన్ని పొంది పితృఋణము తీర్చుకొని మరల ఇక్కడకు రా. పుత్ర సంతానము లేనివారికి తపస్సు చేసినప్పటికీ ఊర్ధ్వగతి లేదు. వాడు ఉత్తమ లోకాలు కోరి యజ్ఞం చేసినప్పటికిని స్వర్గాన్ని పొందలేడు' అని చెప్పాడు.

సూర్య భగవానుని మాటలు విని శుక మహర్షి జనార్దనుని ధ్యానం చేసి తలక్రిందులుగా గల తన నీడను తన ప్రతినిధిగా సృష్టించాడు. అంతట ఆ శుక మహర్షి ఛాయాశుకుని తన ప్రతినిధిగా చేసి 'నీవు నా తండ్రికి పుత్రుడవై నా తండ్రి దుఃఖాన్ని పోగొట్టు' అని చెప్పి సూర్యుని చూడగా స్వరద్వారములు తెరచుకొనగా శుక మహర్షి ఆ మార్గంలో ఊర్ధ్వలోకాలకు వెళ్ళాడు.

## 20. ఛాయాశుకుడు

ధీమంతుడైన ఆ ఛాయాశుకుడు తన కుమారునికై పరితపిస్తున్న వ్యాసమహర్షి వద్దకు వచ్చి, తండ్రి పాదాలకు నమస్కరించి, ఆయన వలన భాగవతగాథను విని, వివాహం చేసుకొని, బిడ్డలని కని, భాగవత పురాణాన్ని లోకంలో ప్రతిష్ఠించి, ఆ పుణ్యాత్ముడు శ్రీకృష్ణుని అనుగ్రహం వలన మహర్షియై సశరీరంగా బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ ఆనందంగా ఉంటున్నాడు.

ఆ శుకమహర్షి వేంకటాద్రి మాహాత్మ్యాన్ని విని, పద్మసరోవరానికి వచ్చి, తీవ్ర తపస్సు చేసి, సరోవరంలోని పద్మదళాలతో నూట ఎనిమిది మంది మానస పుత్రులను సంకల్ప మాత్రం చేత సృజించి, వారికి బ్రహ్మవిద్యను ఉపదేశించి, వారితో పాటు వేంకటాద్రికి వెళ్ళాడు.

అక్కడ పవిత్రమైన భాద్రపద మాసంలో బ్రహ్మదేవుడు మహోత్సవం చేస్తుండగా వ్యాసపుత్రుడు శ్రీనివాసుని సేవించుటకై తన నూట ఎనిమిది మంది పుత్రులను ఆ బ్రహ్మోత్సవంలో వాహనాలుగా చేశాడు. ఆ బ్రహ్మోత్సవం పూర్తికాగానే శ్రవణా నక్షత్రంలో నిర్మల చిత్తంతో స్వామి పుష్కరిణిలో తన బిడ్డలతో పాటు అవభృథ స్నానం చేసి శ్రీ వేంకటేశ్వరుని సభలో (కొలువులో) వారిని వాహకులుగా అంగీకరించమని విన్నవించాడు.


'స్వామీ! సురేశ్వరా! నా పేరుతో నిర్మించిన పట్టణానికి సంబంధించిన క్షేత్రంలో పండిన పంటను వారికి జీవనోపాధిగా అంగీకరించు. వీరు కల్పాంతం వరకు నీ ఉత్సవాలలో నీకు వాహకులై సేవ చేస్తారు' అని ప్రార్థించాడు. శుక మహర్షి మాటలు వినిన శ్రీనివాసుడు 'తథాస్తు' అని ఛాయాశుకుని బిడ్డలను సభ్యులుగా అంగీకరించి వారికి జీవనోపాధిని ప్రసాదించాడు. ఆ తరువాత ఛాయాశుకుడు బ్రహ్మలోకానికి వెళ్ళగోరినవాడై శ్రీకృష్ణునికి, బలరామునికి, సూర్యునికి, పద్మ సరోవరానికి ప్రదక్షిణం చేసి భరద్వాజాది ఆరు గోత్రాలకు చెందిన నూట ఎనిమిది మందిని, సభాసదులను సుఖంగా ఉండమని చెప్పి ఆకాశమార్గంలో బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

ఓ దేవలా! నేను నీకు ఛాయాశుకుని ఉత్పత్తిని, శుక మానసపుత్రులు, సభాసదులైన బ్రాహ్మణుల పుట్టుకను గూర్చి చెప్పాను అని దేవదర్శనుడు పలుకగా దేవలుడు 'సర్వజ్ఞుడవైన ఓ దేవదర్శనా! నేను కృతార్థుడనయ్యాను. నీకు నమస్కరిస్తున్నాను. ఇంతకంటే వినదగినది లేదు. నా సంశయాలన్నీ తీరినాయి అన్నాడు.

**(సశేషం)**

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతమ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే**

**దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి ధర్మాన్ని నెలకొల్పడానికి ప్రతి యుగంలోనూ అవతారం దాల్చుతాను అన్నాడు భగవద్గీతలో శ్రీకృష్ణుడు. సుదర్శన చక్రధారి, నిత్యుడు, పన్నగశయనుడు, చరాచర సృష్టికి మూలకారకుడు, సర్వవ్యాపకత్వం కలిగినవాడు. స్థితికారుడు, సగుణుడు, నిర్గుణుడు, గుణాతీతడు. వైకుంఠధాముడైన ఆ శ్రీహరి దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థం ఇలపై మాటి మాటికి అవతారాలు దాలుస్తూ తన భక్తులను శీఘ్రంగా రక్షిస్తున్నాడు. వామనుడై వచ్చి, సంకర్షు ణుడై భూమ్యాకాశాలలో రెండు అడుగులతో వ్యాపించి, భక్తుడైన బలిని పాతాళ లోకానికి అధిపతిని చేసి తనే అక్కడ కాపలాదారునిగా మారిన భక్త హృదయ నివాసి.**



# వామన జయంతి

**–చింతలపాటి శివశంకరశాస్త్రి**

భాద్రపదమాసం శుక్లపక్ష ద్వాదశి వామన జయంతి. దీనికే వామన ద్వాదశి అని కూడా పేరు. స్థితికారుడైన శ్రీమహావిష్ణువు ధరించిన దశావతారాలలో ఐదవది అయిన వామనావతారాన్ని ధరించిన రోజు. వామనుడే త్రివిక్రముడు. ఆ పాతాళ నభా స్థలాంతం వరకు పెరిగిన మహోన్నత రూపాన్ని బలికి దర్శింప చేసినవాడు. అదితి కశ్యపుల కడుపున విష్ణువు వామనావతారం ధరించి వచ్చిన రోజే భాద్రపద శుక్ల ద్వాదశి. రాక్షస రాజగు బలి చక్రవర్తి విజృంభణనరికట్టి, దేవతలకు సంపదలిచ్చుటకై అదితి కశ్యపుల సంతానంగా –

**రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతారాచంద్రభద్ర స్థితిన్**
**శ్రవణ ద్వాదశి నాడు శ్రోణ నభిజిత్సం జ్ఞాత లగ్నంబునన్**
**భువనాధీశుడు పుట్టె వామన గతిం బుణ్య వ్రతోపేతకున్**
**దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్**

శ్రవణా నక్షత్రంతో కూడిన ద్వాదశినాడు అభిజిల్లగ్నంలో మిట్ట మధ్యాహ్నం సూర్యుడాకాశంలో ప్రకాశించే వేళ గ్రహాలు, నక్షత్రాలు, చంద్రుడు ఉచ్ఛ దశలో నుండగా దేవమాత అదితి గర్భం నుండి విష్ణువు వామన రూపంలో జన్మించాడు.

తన పుణ్య వ్రతాలతోను, పతిభక్తితోను మహా పతివ్రతగా ప్రసిద్ధినొందిన దేవమాత అదితి వామనునకు జన్మనిచ్చింది. కశ్యపుడు జాతకర్మ సంస్కారాలన్నీ చేశాడు. ఉపనయనం చేద్దామన్న తన సంకల్పమును కుల గురువుల వద్ద వ్యక్తీకరించగా బ్రహ్మర్షులు అతనికి ఉపనయన సంస్కారాదులు నిర్వర్తించారు. ఆ సమయంలో వామన వటువునకు మహర్షి పులహుడు యజ్ఞోపవీతమును, పులస్త్యుడు

రెండు తెలుపు వస్త్రాలను, అగస్త్యుడు మృగచర్మమును, భరద్వాజుడు మేఖలను, మరీచి ఫలాశ దండమును, వశిష్ఠుడు అక్ష సూత్రమును, అంగిరసుడు కుశలతో తయారు చేయబడిన వస్త్రమును, సూర్యుడు క్షత్రమును, భృగువు పావుకోళ్లను, బృహస్పతి కమండలమును బహూకరించారు. అనంతరము వామనుడు ఒక్క మాసంలోనే వేదాంగాలను, శాస్త్రాధ్యాయనమును అధ్యయనము చేసి నైపుణ్యమును సాధించాడు. దేవ గురువు బృహస్పతి మార్గ ప్రదర్శనము గావిస్తుండగా వామనుడు క్షత్రము, దండము కమండలములతో తల్లిదండ్రుల అనుమతితో లోకక్షేమం కోసం బలిచక్రవరి గొప్ప దాత అని తెలిసికొని దానమడగాలని బలి యజ్ఞం చేసే చోటికి వెళ్ళాడు. బ్రహ్మ తేజస్సు ఉట్టిపడుతూ తన యాగశాలకు వచ్చిన వామనునికి బలి స్వాగతం పలుకుతూ...

**వడుగా! మెవ్వరివాడ? వెవ్వడవు? సంవాస స్థలం బెయ్యి? ది**
**య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మముం**
**గడుధన్యాత్ముడనైతి, నీ ముఖము యోగ్యంబయ్యె నా కోరికల్**
**గడతేఱెన్ సుహుతంబులయ్యె శిఖలుంగళ్యాణమిక్కాలమున్**

ఓ బ్రహ్మచారీ! నీవెవరి పిల్లవాడవు? నీ పేరేమిటి? నీ నివాసం ఎక్కడ? నీవిక్కడికి రావడం వల్ల నా వంశమూ, జన్మ సఫలమయ్యాయి. నేను ధన్యుడనయ్యాను. నేను చేసే యీ యజ్ఞం చాలా పవిత్రమైనది. నా కోరికలు నెరవేరాయి. అగ్నులు చక్కగా జ్వాలలయి చేసిన హోమాలన్నీ హుతమైనాయి. ఈ సమయం నాకు కళ్యాణప్రదం. శుభప్రదం అని పలికి ''నీకేం కావాలో కోరుకో ఇస్తాను' అని పలికాడు.

నేను నర్మదా నదీ తీరంలో యజ్ఞం చేసేందుకు నిర్ణయించుకున్నాను. అందుకు నాకు మూడు అడుగుల స్థలం అవసరం కనుక నాకు మూడు అడుగుల స్థలాన్ని దానంగా ఇవ్వండి"అని కోరాడు వామనుడు.

బలి వటువు మాటలు ఆలకించి తనవంటి చక్రవర్తిని యింత చిన్న కోరిక అడుగుతున్నావేమి? చిన్నవాడవు నీకు తెలియక యిట్లు కోరినావు. రత్నాలో, కన్యలో, కాంచనమో, గృహమో, గ్రామమో, భూఖండమో, సంపదలో ఏది కావాలంటే అది కోరుకోమన్నాడు.

కాని వామనుడు ఒంటరివాడనగు తనకు ఒకటి రెండు అడుగుల మేర భూమినిచ్చితే చాలని, బ్రహ్మచారినగు నాకు గొడుగో, జంధ్యమో, కమండలమో, ముంజియో, మొలత్రాడో, దండమో కావలెనుగాని ఈ సంపదలెందుకు? నా కోరికకు తగినట్లు లేదనకుండా నేనడిగిన మూడడుగుల భూమి దానమిస్తే అదే నా పాలిట బ్రహ్మాండముగా భావించి ఆనందపడతానని పలికాడు. బలి ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఆ సమయంలో



**"నీకు శుభమగుగాక! సుతలము స్వర్గవాసులకు కూడా ప్రార్థనీయం. అచ్చట నీవు నీ జ్ఞాతులలో చని సుఖముండుము. అచ్చట నీకు నేనే నిత్య సన్నిహితుడనై యుంటాను. ఎల్లప్పుడు నీవు నన్ను చూస్తూ యుంటావు. నీకెటువంటి భయం కలగదు"**

రాక్షస గురువైన శుక్రాచార్యుడు విష్ణువే వామనుడని గ్రహించి విషయాన్ని బలికి వివరించి దానము చేయవద్దని పలికాడు. గురుదేవా! ఎవరైనా నా దగ్గరకు యాచన కొరకు వస్తే వారిని నేను నిరాశ పరచను గదా! అటువంటిది విష్ణువు స్వయంగా నా దగ్గరకు వచ్చి యాచిస్తే లేదని నేనెలా చెప్పగలను. ఇస్తానని చెప్పి ఇవ్వలేకపోతే నరకం వస్తుంది. ఆ నరకాన్ని తప్పించుకోవడం నాకు శక్యం కాదు. ఏ దానం వల్ల దాతకు నాశనం కల్గునో అది దానమే కాదని తత్త్వము తెలిసిన పెద్దలు చెప్పారు. దాతకు ధనము, యోగ్యుడైన ప్రతి గ్రహీత దొరుకుట గొప్ప అవకాశం. అంతకంటే భాగ్యం ఇంకేం కావాలి? మహానుభావా! ఎడతెగకుండా, విరామం లేకుండా యజ్ఞాలు, వ్రతాలు ఎన్నిచేసినా దర్శనం లభ్యం కాని మహోన్నతుడైనవాడు విష్ణువు. అట్టి వాడే యీనాడు పొట్టివాడై అడుగుతుంటే అతడు

కోరిన యిష్టార్థములను ఇవ్వడం కంటే నావంటివానికి ఇంకేం కావాలి? సంపద నెవరూ మూటకట్టుకొని పోలేరని, దానం చేసిన వాని పేరే భూమిపై సూర్యచంద్రులున్నంత వరకు నిలుస్తుందని, కీర్తి వస్తుందని పలుకుతూ బలి శుక్రునితో..

**కారే రాజులు? రాజ్యములు గలుగవే? గర్వోన్నతింబొందరే?**
**వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే? భూమిపై**
**బేరైనం గలదే? శిబి ప్రముఖులుం బ్రీతిని యశః కాములై**
**యీరే కోర్కులు? వారలన్ మఱచిరే? యిక్కాలమున్ భార్గవా!**

గురుదేవా! పూర్వమెంతో మంది రాజులు కాలేదు? రాజ్యాలు పొందలేదు? గర్వముతో గొప్పవారమని విర్రవీగలేదు. వారీనాడు ఎక్కడున్నారు? పోయేటప్పుడు వారు తమతోపాటు తమ సంపదలను మూటకట్టుకొని తీసుకొని పోగలిగారా? శిబి మొదలైన చక్రవర్తులు కీర్తిని కాంక్షించి మెలగక అడిగిన వారి కోరికలను సంతోషంగా తీర్చారు. అట్టివారిని ఈనాటికీ లోకం మరిచిపోలేదు. ఎడతెగకుండా, విరామం లేకుండా యజ్ఞాలు వ్రతాలు ఎన్నిచేసినా దర్శనం లభ్యం కాని మహోన్నతుడైన వాడు విష్ణువు. అటువంటి వానికి ఇవ్వడం కంటే నావంటి వానికి ఇంకేం కావాలి? అని పలికాడు. ఆ మాటలు విని శుక్రాచార్యుడు కోపం తెచ్చుకొని ''మూఢా! చెడుకాలం దాపురించి నిన్నిట్లు పలికించుచున్నది. గురు శాసనమును ఉల్లంఘించితివి. సిరి నీకు దూరమవుగాక! అని శపించినాడు. అయినను బలి వెనుకడుగు వేయకుండా, జంకక సత్యనిష్ఠుడై వామన వటువు అడిగిన మూడు అడుగుల భూమిని దానము చేయుటకు నిశ్చయించుకొని వామనుని బంగారు సింహాసనముపై కూర్చుండబెట్టి, వామనుని పాదములు కడిగి, ఆ నీటిని నెత్తిపై చల్లుకొని ''వటువా! వేదం చదివిన బ్రాహ్మణుడవు. ప్రసిద్ధమైన వ్రతం కలవాడవు. విష్ణు స్వరూపుడవు. వేదాల ప్రామాణ్యం మహిమ విలువ తెలిసినవాడవు అయిన నీకు మూడుడుగుల భూమిని దానం చేస్తున్నాను''అని చెప్పి లోకమాశ్చర్యపోవునట్లుగా పరబ్రహ్మకు ప్రీతి కలుగుగాక పరమేశ్వరార్పణమస్తు అంటూ భూమిని ధారపోశాడు. వామనుడు వెంటనే విశ్వరూపం ప్రదర్శించి–

**ఇంతింతై వటుడింతయై మఱియు దానింతై నభోవీథిపై**
**నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై, చంద్రుని కంతయై ధ్రువుని పైనంతయై మహర్వాటిపై**
**నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై**

దాన జల ధార గ్రహించిన వామనుడు ఇంతవాడు అంతై, ఇంకా ఎంతో ఎత్తు ఎదిగినాడు. ఇంకా పైపైకి చంద్రుని కంటే ధ్రువనక్షత్రం కంటే, మహర్లోకం కంటే, సత్యలోకం కంటే కూడా పైన ఉన్నత స్థానానికి ఎదిగి బ్రహ్మాండ మంతటా నిండిపోయాడు. బలితో రాజా! మూడడుగుల నేల ఇచ్చితివి. భూమి, ఆకాశములు రెండు అడుగులకే చాలలేదు. మూడవ దానికి దారి చూపుమని పలికాడు. అప్పుడు బలి విష్ణువుతో నా తలపై నీ మూడవ పాదము నుంచి నామాట చెల్లింపుము. దేవా! నీవు నాకు ప్రత్యక్షమైతివి. ఇంతకన్నా నాకు మహాభాగ్యం ఇంకొకటి ఏమున్నదని పలికాడు. విష్ణువు బలితో ''నీకు శుభమగుగాక! సుతలము స్వర్గవాసులకు కూడా ప్రార్థనీయం. అచ్చట నీవు నీ జ్ఞాతులలో చని సుఖముండుము. అచ్చట నీకు నేనే నిత్య సన్నిహితుడనై యుంటాను. ఎల్లప్పుడు నీవు నన్ను చూస్తూ యుంటావు. నీకెటువంటి భయం కలగదు''అని పలికాడు.

అనంతరం బలి భార్య వింధ్యావళి భర్తను చూచి కలత చెంది వామనమూర్తికి నమస్కరించి ''దేవదేవా! నా భర్త అజ్ఞానాన్ని, అహంకారాన్నితుదముట్టించి ధన్యున్నిగావించావు. మేము మీకు ఎల్లప్పుడు కృతజ్ఞతతో మెలుగుచు నీ పాద సేవ చేసుకొంటూ జీవితాన్ని గడుపుతామని'' ప్రార్థించింది. శ్రీహరి వింధ్యావళితో ''ఈ బలి దైత్య దానవులలో శ్రేష్ఠుడు, కీర్తివర్ధనుడు. మాయను జయించిన వాడు. ఐశ్వర్యాన్ని పదవినీ కోల్పోయినా శత్రువులు చేత బంధింపబడినా, గురువుచేత శపింపబడినా నిశ్చలుడై నిర్వికారుడై సత్య సంధతను నిలుపుకున్నాడు. తనను ఎల్లవేళలా రక్షిస్తూ ఉంటాను. దైత్య దానవ సాంగత్యం వల్ల అసుర ప్రవృత్తి కలుగకుండా అనుగ్రహిస్తాను''అని పలికి దీవించాడు.

ఆ మాటలు వినగానే బలి చక్రవర్తి కన్నులలో నీరు నిండింది. గుండెల్లోంచి భక్తి భావము పెల్లుబికి వచ్చింది. కంఠం రుద్ధమైంది. చేతులు ముకుళిత మయ్యాయి. కృతజ్ఞతాసూచకంగా వామనునికి నమస్కరించి ఆ తరువాత బ్రహ్మరుద్రులకు నమస్కరించి బంధవిముక్తుడై సుతల లోకానికి వెళ్ళిపోయాడు. ఈ విధంగా దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం వామనావతారం ధరించిన శ్రీహరి బలిచక్రవర్తిని అంతమొందించి దేవతలతో పాటు సకల లోక వాసులను రక్షించాడు.

వామన జయంతి నాడు బ్రాహ్మీ ముహూర్తంలో లేచి కాలకృత్యాలు తీర్చుకొని వామన రూపంలోని మహావిష్ణువును పూజించి, 'దేవేశ్వరాయ దేవాయ దేవ సంభూతి కారణే, ప్రభవే సర్వ దేవానాం వామనాయ నమోనమః' అనే శ్లోకాన్ని పఠించి వామనమూర్తికి నమస్కరించి షోడశోపచారాలతో అష్టోత్తరాలతో పూజించి మన భవితను పునీతం చేసుకుందాం.

**నారాయణ నారాయణ జయ గోవింద హరే**
**నారాయణ నారాయణ జయ గోపాల హరే**
**కరుణా పారావార వరుణాలయ గంభీర నారాయణ**
**ఘన నీరద సంకాశ కృత కలికల్మష నారాయణ**

**సర్వేజనా స్సుఖినోభవంతు**

# తిరుమల సర్వస్వం

పల్లపోతు వాణిశ్రీ



శ్రీ హథీరామ్ బావాజీ

స్వామివారి భక్తాగ్రేసరులలో అత్యంత ప్రముఖుడైన శ్రీ హాథీరామ్ బావాజీని స్మరించుకోకుండా తిరుమలక్షేత్ర చరిత్ర కానీ, శ్రీ వేంకటేశ్వరుని ఇతిహాసం కానీ అసంపూర్తిగానే మిగిలిపోతాయంటే అతిశయోక్తికాదు. వందల ఏళ్ళక్రితం ఎక్కడో వేలమైళ్ళ దూరంలోనున్న హిమాచల్ ప్రదేశ్ నుంచి కాలినడకన వచ్చి, తిరుమల కొండపై జనావాసాలు ఏమాత్రం లేని రోజుల్లో స్థిరనివాస మేర్పరచుకుని, స్వామివారిని సేవించుకుంటూ, వారితో నిత్యము పాచికలాడిన శ్రీహాథీరామ్ బావాజీ చరిత్ర శ్రీవారి భక్తులందరికి చిరపరిచితమే!

వారి జీవనగమనం, శ్రీవేంకటేశ్వరునితో వారికున్న ప్రగాఢమైన అనుబంధం, తిరుమలలో బావాజీ జీవితంతో ముడిపడి ఈనాటికీ దర్శించుకోదగ్గ ప్రదేశాలు, బ్రిటీషువారి హయాం అనంతరం ఆలయ నిర్వహణను తొంభై సంవత్సరాల పాటు చేపట్టిన మహంతు వ్యవస్థ మొదలైన వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**పుట్టుపూర్వోత్తరాలు:** హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని 'ఉనా' అనబడే గ్రామంలో, వంశపారంపర్యంగా శ్రీరామచంద్రుడి పరమభక్తుడైన 'దేశ్ రాజ్ బల్జోత్' అనే మధ్యతరగతి కుటుంబీకునికి కలిగిన నలుగురు పుత్రులలో ఒకరిగా బాబాజీ జన్మించారు. వారి అసలు పేరు 'ఆశారామ్ బల్జోత్'. తరువాతి కాలంలో, 'లంబాడా' గిరిజన తెగకు చెందిన బల్జోత్ కుటుంబం పంజాబ్ రాష్ట్రానికి వెలస వెళ్ళింది.

మరి కొందరు చరిత్రకారుల ననుసరించి, బావాజీ పూర్వీకులు రాజస్థాన్లోని 'నాగౌర్' పట్టణానికి చెందినవారు. తిరుమలలోని హాథీరాంజీ మఠంలో ప్రస్తుతం నివాసముంటున్న బావాజీ అనుయాయులు ఈ వాదాన్నే బలపరుస్తున్నారు.

**తిరుమల యాత్ర:** బల్జోత్ వంశస్థులు, ఆనాడు ఉత్తర భారతదేశంలో ఉధృతంగా ప్రచారంలోనున్న రామానంద భక్తి ఉద్యమానికి చెందిన వైష్ణవులు. ఈనాటి 'ఢిల్లీ' పట్టణానికి కొద్ది దూరంలో 'రామానంద మఠం' ఉండేది. శ్రీరామ భక్తిని వంశపారంపర్యంగా పుణికి పుచ్చుకున్న హాథీరాం బాబా ఆ రోజుల్లో రామానంద మఠానికి అధిపతి యైన అభయానంద్ స్వామిజీకి ప్రియశిష్యుడు.

గురువాజ్ఞ మేరకు, కౌమారదశలోనున్న ఆశారామ్ బల్జోత్, ఒక భక్తబృందంలో సభ్యుడిగా దక్షిణ భారతదేశంలోని తీర్థాలన్నింటిని కాలినడకన దర్శించుకుంటూ, తిరుమల క్షేత్రానికి విచ్చేశారు. కొద్దిరోజులు శ్రీవారిని సేవించుకున్న తరువాత భక్తబృందంలోని సభ్యులందరూ తిరిగి వెళ్ళిపోగా, బావాజీ మాత్రం తిరుమల క్షేత్రంలోని ప్రకృతి సోయగానికి, శ్రీవేంకటేశ్వరుని దివ్యసౌందర్యానికి ముగ్ధుడై సప్తగిరులే తన దీక్షకు అనువైన స్థానమని తలంచి కొండపైనే ఉండిపోయాడు. ఆలయానికి అతి సమీపంలో ఆగ్నేయ దిక్కున ఒక చిన్న ఆశ్రమం ఏర్పరుచుకొని, అనునిత్యం స్వామివారిని సేవించుకునేవాడు. ఆ కాలంలో తిరుమల ప్రాంతమంతా దట్టమైన అడవులతో క్రూరమృగాలతో, భరింపశక్యం గాని చలితో దుర్గమంగా ఉండడం వల్ల కొండపై వేరెవరూ నివాసముండేవారు కాదు. అర్చకులతో సహా అందరూ కొండ దిగి, చీకటి పడకముందే దిగువ తిరుపతికి చేరుకునేవారు. బావాజీ ఒక్కరే స్వామివారిపై భారం వేసి, ఆశ్రమంలో నివాసముంటూ శ్రీవారిని సేవించుకునేవారు. బావాజీ స్వతహాగా, వంశపారంపర్యంగా శ్రీరాముడి భక్తుడవడంతో, శ్రీవేంకటేశ్వరుని ముఖారవిందంలో కూడా స్వామివారి త్రేతాయుగ అవతారమైన శ్రీరామచంద్రుణ్ణే దర్శించుకునే వాడు. 'కౌసల్యా సుప్రజా రామా' అంటూ స్వామి వారిని శ్రీరాముని వలనే కీర్తించేవారు.

**ఆలయ బహిష్కరణ:** ఆశ్రమం ఆలయానికి అతి సమీపంలో ఉండటంతో, బావాజీ ప్రతి దినము పెక్కుమార్లు శ్రీవారిని దర్శించుకునేవారు. ఆలయానికి వచ్చినప్పుడల్లా శ్రీనివాసుణ్ణి తదేకంగా చూస్తూ, శ్రీరాముణ్ణి తలపుకు తెచ్చుకుంటూ, తన్మయత్వంతో చాలాసేపు నిలుచుండిపోయేవారు. స్థానికంగా మాట్లాడే తెలుగు, తమిళ భాషలు ఏమాత్రం తెలియని ఒక

ఉత్తరదేశపు వ్యక్తి తిరుమల క్షేత్రంలో స్థిరనివాసం ఏర్పరచుకొని, తరచూ ఆలయంలోనికి ప్రవేశించడం, వచ్చినప్పుడల్లా చాలాసేపు స్వామివారిని తదేకంగా చూస్తుండడంతో ఆలయ ఉద్యోగులు ఆయనను అనుమానించసాగారు. ఆ విషయాన్ని వారు ఆలయ యాజమాన్యం దృష్టికి తీసుకొని రాగా, మరునాడు హథీరాం బాబాకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరించబడింది. భక్తిపారవశ్యం తప్ప మరే విషయం తెలియని హాథీరాం బాబా, తనను తన రాముడి నుండి వేరు చేయవద్దని, దర్శనానికి అనుమతించమని పదేపదే వేడుకున్నాడు. అయితే 'పరదేశి' అయిన బావాజీ విన్నపం అరణ్యరోదనగానే మిగిలిపోయింది. స్వామివారితో విరహం ఏమాత్రం భరించలేని హథీరాం బాబా చింతాక్రాంతుడై తన ఆశ్రమానికి తిరిగి చేరుకున్నాడు. నిద్రాహారాలు మాని తన ఇష్టదైవమైన శ్రీరామునికి తన గోడును విన్నవించుకున్నాడు. తాను చిన్నతనం నుంచి శ్రీరాముడికి పరమ భక్తుడనని, నిత్యము స్వామివారిని దర్శించుకోకుండా తాను ఉండలేనన్న విషయం తెలిసి కూడా తనను నీ నుండి ఎందుకలా దూరం చేస్తున్నావని, సత్వరమే నిన్ను దర్శించుకోలేని పక్షంలో తనకు ప్రాణత్యాగం తప్ప మార్గాంతరం లేదని స్వామివారితో చనువుగా నిష్ఠూరమాడాడు. రోజంతా ఉపవాస దీక్షలో నుండి, స్వామివారితో తన వేదనను పంచుకున్న బావాజీ మరునాటి ఉదయం యథావిధిగా స్నాన సంధ్యావందనాదికాలు ముగించుకుని, స్వామివారి దర్శనార్థం ఆలయ ద్వారం వద్దకు మరలా చేరుకున్నాడు. అప్పుడు కూడా నిరాశే ఎదురైంది. ఆలయ కాపలాదార్లు అధికారుల ఆదేశాల మేరకు బావాజీని నిర్దాక్షిణ్యంగా గెంటి వేశారు. తీవ్రమైన నిరాశతో వెనుదిరిగి మఠానికి వచ్చిన బావాజీకి ఏం చేయాలో తోచలేదు.

**స్వామివారితో పాచికలాట:** పరిపరి విధాలుగా ఆలోచించి, స్వామివారిపై ధ్యాసను మరల్చుకోలేని బావాజీ, తన ఆశ్రమాన్నే ఆలయంగా ఊహించుకుని, మనసులోనే స్వామివారిని ఆవాహన చేసుకొని స్వామివారితో పాచిక లాడుచున్నట్లుగా ఊహించుకోసాగాడు. పాచికలాడే పటాన్ని నేలపై పరచి, తన తరపున, స్వామివారి తరపున తానే స్వయంగా పాచికలు వేయడం ప్రారంభించాడు. చాలాసేపు ఈ విధంగా పాచికలాడిన తరువాత, రాత్రి సమయమవ్వడంతో నిద్రకు ఉపక్రమించాడు. స్వామివారి ఎడబాటుతో విలపిస్తున్న బావాజీకి, అలా పాచికలాడటం ఎంతో ఉపశమనాన్నిచ్చింది. స్వామివారితో చాలాసేపు పాచికలాడి, తృప్తితో నిదురించిన బావాజీ గాఢనిద్రలో ఉన్నప్పుడు వారికి, మంద్ర స్వరంలో శ్రీరామచంద్రుని తీయని పిలుపు వినిపించింది. హఠాత్తుగా నిద్రలేచిన బావాజీకి తన ఇష్టదైవమైన శ్రీరామ చంద్రుడి ముగ్ధ మనోహర రూపం సాక్షాత్కరించింది. బావాజీ ఒక్కక్షణం పాటు దానిని స్వప్నంగా భ్రమించాడు. మహిమగల సిద్ధులకు, మునిపుంగవులకు సైతం సాధ్యంకాని శ్రీరాముని నిజరూపదర్శనం తనబోటి సాధారణ భక్తునికెలా సాధ్యం? ఇది తప్పనిసరిగా కలయే! స్వామి స్వప్నంలోనికి వచ్చి తనతో పరిహాస మాడుతున్నాడు! ఇలా పరి పరి విధాలుగా ఆలోచిస్తూ ఉద్విగ్న మనస్కుడై, చేష్టలుడిగిన బావాజీ అంతరంగాన్ని పసిగట్టిన శ్రీరామచంద్రుడు అతనిని సంబోధిస్తూ ఇది కల కాదని, తన ఇష్టసఖుడైన బావాజీతో పాచికలాడడానికి వైకుంఠం నుంచి దిగి వచ్చానని సర్దిచెప్పి పాచికలాట ప్రారంభించాడు.

**భగవంతుని ఐచ్ఛిక ఓటమి:** భక్తుల చేతిలో పరాజయం పొందటాన్ని అమితంగా ఇష్టపడే శ్రీవారు, పాచికలాటలో స్వచ్ఛందంగా పరాజితులయ్యారు. తాను ఓటమిపాలై, బావాజీ విజేతగా నిలచినందున ఏదైనా వరాన్ని కోరుకొమ్మని పలికారు. సంతోషాంతరంగుడైన బావాజీ శ్రీరామచంద్రుని దర్శనభాగ్యంతో తన చిరకాల వాంఛ యీడేరి జన్మ ధన్యమైందని, అంతకుమించిన సంపద మరేమీ లేదని, శ్రీరాముని పాదాల చెంత కొంచెం చోటిమ్మని, ఇక మీదట తనను దూరం చేయవద్దని విన్నవించుకున్నాడు. బావాజీ నిస్వార్థ భక్తికి ముగ్ధుడైన శ్రీరామచంద్రుడు బావాజీకి తగిన అభయం ఇవ్వడమే కాకుండా, ప్రతిరోజు రాత్రి బావాజీతో పాచికలాడే నిమిత్తం ఆశ్రమానికి విచ్చేస్తానని శెలవిచ్చి అంతర్ధానమయ్యాడు. బాబాజీ ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. మరునాటి ఉదయం శ్రీవారి దర్శనం నిమిత్తం ఆలయానికి విచ్చేసిన బావాజీకి పరమాశ్చర్యకరంగా, ఏ విధమైన అడ్డంకులు ఎదురు కాలేదు. చాలాసేపు శ్రీవారిని తనివితీరా దర్శించుకుని, తిరిగి ఆశ్రమానికి వచ్చి, సూర్యాస్తమయం కోసం ఆతృతగా ఎదురు చూడసాగాడు. 'ఎప్పుడెప్పుడు శ్రీవారితో పాచికలాడదామా' అని ఒక ప్రక్కన బావాజీ, ప్రియభక్తునితో భేటీ కోసం మరో ప్రక్కన శ్రీరామచంద్రుడు ఇరువురూ ఉవ్విళ్లూరుతున్నారు. ఆనాటి రాత్రి పవళింపు సేవ అనంతరం ఆలయ ద్వారాలు మూయగానే, శ్రీవేంకటేశ్వరుడు శ్రీరామచంద్రుని రూపంలో బావాజీ ఆశ్రమాని కేతెంచి, అతనితో పాచికలాడి, తన భక్తుని సాన్నిహిత్యంలో మురిసిపోయి, బావాజీని కూడా పరమానంద భరితుణ్ణిగావించాడు. అలా చాన్నాళ్ళు రాత్రివేళల్లో పాచికలాడిన తరువాత, బావాజీ సేవాభావానికి పూర్తిగా సంతృప్తి చెందిన శ్రీవారు, బావాజీ భక్తితత్పరతను లోకానికి చాటిచెప్పాలని భావించారు. తక్షణం వారి మదిలో ఒక ఆసక్తికరమైన పథకం రూపుదిద్దుకుంది. ఆ పథకాన్ని ఆచరణలో పెట్టే ఉద్దేశ్యంతో వెంటనే స్వామివారు కార్యోన్ముఖులయ్యారు.

స్వామివారి పథకం ఏమిటో, దాన్ని వారు ఏ విధంగా ఆచరణలో పెట్టారో, దానితో బావాజీ పేరు ప్రఖ్యాతలు ఏవిధంగా మార్మోగిపోయాయో తెలుసుకుందాం.

బాబాజీ భక్తి తత్పరతను, నిస్వార్థ సేవాభావాన్ని లోకానికి వెల్లడించే ప్రయత్నంలో శ్రీవారు ఒక మహత్తరమైన పథకానికి నాంది పలికారు.

**మాయమైన వజ్రాలహారం:** ఒకనాటి రాత్రి యథావిధిగా బావాజీ ఆశ్రమానికి వచ్చి, దాదాపు రాత్రి సమయమంతా బావాజీతో పాచికలాటలో వ్యస్తులై ఉన్న శ్రీవారు ప్రాతఃసంధ్య వేళలో సుప్రభాత పఠనం వినిపించడంతో, ఆటను మధ్యలోనే ఆపి హుటాహుటిగా ఆనంద నిలయానికి బయలుదేరారు. బాబాజీ లాంటి భక్తులెందరికో దర్శనమిచ్చి వారందరినీ స్వామివారు కటాక్షించాలి కదా! ఆ హడావిడిలో శ్రీవారు తన వజ్రాలా హారాన్ని అక్కడే వదలి వెళ్లారు. స్వామివారు నిష్క్రమించిన తర్వాత, వారి వజ్రాలహారాన్ని గమనించిన బాబాజీ దాన్ని తీసి పూజామందిరంలో భద్రపరిచాడు. మరునాటి రాత్రి ఆటకై వచ్చినపుడు దాన్ని భద్రంగా శ్రీవారికి అందజేద్దామని బావాజీ ఆంతర్యం. ఇంతలో, సుప్రభాతానంతరం గర్భాలయంలోకి విచ్చేసిన అర్చక స్వాములకు, దర్శనార్థమై వచ్చిన అధికారులకు, భక్తులకు స్వామివారు వజ్రాలహారం లేకుండా దర్శనమివ్వడంతో అందరూ విస్తుపోయారు. స్వామివారి అమూల్యమైన హారం చోరీకి గురైందని భావించారు. ఆలయంలో అణువణువునా గాలించారు. చివరికి అర్చకస్వాముల ఇళ్ళలో కూడా సోదాలు జరిగాయి. ఎక్కడా హారం కానరాలేదు.

**బావాజీపై నేరారోపణ:** చివరికి ఆలయ అధికారుల దృష్టి బావాజీపై పడింది. ప్రతినిత్యం స్వామివారిని గంటల తరబడి తదేకదీక్షతో గమనిస్తూ ఉండడంతో బావాజీపై అనుమాన బీజం నాటుకుంది. కొద్దిసేపట్లోనే అనుమానం పెనుభూతంగా మారడంతో, రాజభటులు బావాజీ ఆశ్రమంలోకి బలవంతంగా ప్రవేశించి వెతుకులాట ప్రారంభించారు. ఈ విషయాలను ఏమాత్రం పట్టించుకోకుండా దైవచింతనలో మునిగివున్న బావాజీ అమాయకంగా ప్రశ్నించడంతో రాజభటులు శ్రీవారి అమూల్యమైన ఆభరణం తస్కరించబడిందని, అధికారుల ఆనతి మేరకు తాము బావాజీ ఆశ్రమంలో గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేదో మామూలు విషయంగా భావించిన బాబాజీ రాత్రి సమయంలో శ్రీరామచంద్రుడు తన ఆశ్రమానికి విచ్చేసి, తనతో పాచికలాడి, సుప్రభాత సమయంలో హడావిడిగా లేచి వెళ్లారని, ఆ తొందరపాటులో వజ్రాలహారాన్ని అక్కడే మరచిపోయారని జరిగింది జరిగినట్లుగా విడమరచి చెప్పాడు.

**బావాజీకి వింత శిక్ష:** ఈ వృత్తాంతాన్నంతా విన్న రాజభటులకు, ఆలయ అధికారులకు బావాజీ చెప్పినదంతా నమ్మశక్యంగా గోచరించలేదు. ఆ హారాన్ని స్వాధీనపరచుకొని, బాబాజీని అప్పటి చంద్రగిరి పాలకుడైన 'గిరిధర రాయలు' వద్ద హాజరు పరిచారు. రాజుగారికి కూడా బావాజీ అదే విషయాన్ని తిరిగి చెప్పాడు. ఇదంతా కట్టుకథగా భావించిన రాజుగారు బాబాజీని గృహనిర్బంధంలో ఉంచి, తదుపరి విచారణ జరుప వలసిందిగా ఆజ్ఞాపించాడు. అయితే బావాజీ అదే విషయాన్ని పదే పదే నొక్కి చెప్పడంతో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి రాజుగారు ఒక అవకాశం ఇచ్చారు. బావాజీకి స్వామివారితో అంతటి చనువు ఉన్నట్లైతే, తన మహిమను ప్రత్యక్షంగా చూపించాలి. బాబాజీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడం కోసం రాజుగారు ఒక పరీక్ష పెట్టారు. దాని ప్రకారం, రాజుగారి ఆజ్ఞ మేరకు బాబాజీని స్వగృహంలో నిర్బంధించి, అందులోనే బండెడు చెరకు గడలను ఉంచారు. మరునాటి ఉదయంలోపు ఆ చెరకుగడ లన్నింటినీ బాబాజీ తినగలిగితే, వారు చెప్పేది యధార్థమైనట్లు లెక్క! లేకుంటే బాబాజీ తన నేరాన్ని అంగీకరించి, రాజుగారు విధించే శిక్షను అనుభవించాలి. ఆ శిక్ష అత్యంత కఠినంగా ఉండొచ్చు. ఆరోపణ 'దైవద్రోహానికి' సంబంధించిన దవ్వడం వల్ల, మరణశిక్ష కూడా పడే అవకాశం ఉంది. ఆ విధమైన షరతు విధించి, ఆశ్రమం తలుపులను మూసివేసి, కొద్దిమంది భటులతో కట్టుదిట్టమైన కాపలా ఉంచి, మిగిలిన వారందరూ నిష్క్రమించారు.

**గండం గట్టెక్కించిన గజరాజు:** బావాజీకి ఏం చేయాలో పాలుపోలేదు. చెయ్యని నేరానికి తనకెందుకీ శిక్ష? ఎందుకీ అగ్ని పరీక్ష? ఒక్క రాత్రిలో ఆ చెరకుగడల రాశిని భుజించటం మానవమాత్రుడికి సాధ్యమయ్యే పనికాదు. ఆ పని చేయాలంటే కేవలం ఏనుగు వల్లనే సాధ్యం!

ఆ విధంగా ఆలోచించిన బావాజీ, భగవంతునిపై భారం వేసి, స్వామివారిని స్మరించుకుంటూ నిశ్చింతగా ఆ రాత్రి గడపసాగాడు. ఆ స్వామివారే తనను ఎలాగైనా రక్షించుకుంటారని అతని ప్రగాఢ విశ్వాసం.

కొద్దిసేపటిలో బావాజీ భగవన్నామ స్మరణలో ఉండగా ఓ మహాద్భుతం జరిగింది. నిశిరాత్రి వేళలో శ్వేతవర్ణంలో ఉన్న ఐరావతం వంటి మత్తగజం, శరీరమంతా చందన లేపనంతో, నుదుటన తిరునామాలు ధరించి, తలుపులు మూసి ఉన్న గృహంలో ప్రత్యక్షమైంది. బావాజీ ఉద్విగ్నుడై చూస్తూ ఉండగా ఆ మత్తగజం గృహంలోని చెరుకుగడలన్నింటిని తన తొండంతో తీసుకుని, తృప్తిగా ఆరగించి, సారం లేని చెరకు పిప్పిని గుట్టగా పోసింది.

**(సశేషం)**



భాద్రపద శుక్ల చతుర్దశి నాడు అనంత పద్మనాభ వ్రతం ఆచరించాలి. ఈ వ్రతానికే అనంత వ్రతం అని కూడా పేరు. ఈ వ్రతమును గురించి స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మ వివరించినట్లు 'భవిష్యపురాణం'లో పేర్కొనబడింది. వనవాస సమయంలో అనేక కష్టనష్టాలకు గురైన పాండవులు కష్టాల నుంచి విముక్తి ప్రసాదించే మార్గాన్ని తెలుపమని శ్రీకృష్ణుడిని కోరగా.. శ్రీకృష్ణుడు అనంత పద్మానాభ వ్రతాన్ని వివరించినట్లు భవిష్యపురాణం పేర్కొంది.

# అనంత పద్మనాభ వ్రతం

- డా. ఎం అహల్యాదేవి

## వ్రతకథ

'అనంత వ్రత మహిమ'ను గురించిన కథను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించినట్లు తెలియుచున్నది. కృతయుగంలో సుమంతుడనే బ్రాహ్మణుడు తన కూతురైన 'శీల'ను కౌండిన్యుడికిచ్చి పెళ్లి చేసి సారెపెట్టి పంపే స్తోమత లేక వట్టి చేతులతో పంపలేక కాస్తంత సత్తుపిండి ఇచ్చి పంపాడు. ఆరోజు భాద్రపద శుద్ధ చతుర్దశి. ప్రయాణం చేస్తున్న ఆ దంపతులు మధ్యాహ్నంవేళ సేద తీరేందుకు యమునానదీ తీరానికి చేరారు. అక్కడ కొందరు పుణ్య స్త్రీలు ఎర్రని వస్త్రాలు ధరించి తమ తమ భర్తలతో కూడి అనంత వ్రతమాచరిస్తుండగా శీల ఆ వ్రత విధానాన్ని తెలుసుకుని తాను కూడా యమునా నదిలో స్నానం చేసి వారిచ్చిన ఎర్రని తోరమును ధరించి వ్రతమాచరించి తన వద్దనున్న పిండిలో సగభాగం బ్రాహ్మణులకు దానం చేసి ప్రసాదం స్వీకరించి మరల ప్రయాణమై భర్త గృహానికి చేరుకుంది. శీల చేసిన వ్రత మహాత్యం వల్ల వారికి సకల సంపదలు సిద్ధించాయి.

ఒకరోజు కౌండిన్యుడు భార్య చేతికి ఉన్న ఎర్రని తోరణమును చూచి అది వశీకరణ కంకణంగా శంకించి ఆమెపై ఆగ్రహించి, తన భార్య అనంత వ్రతాచరణ గూర్చి ఎంత చెప్పినా వినకుండా ఆ తోరమును తెంపి నిప్పులోకి విసిరేశాడు. శీల దాన్ని జాగ్రత్తగా పాల కుండలో పదిలపరిచింది. కౌండిన్యుడి ప్రవర్తన పట్ల కోపించిన అనంత పద్మనాభుడు అతని సంపదనూ, పశువులను దొంగలు దోచుకునేట్లు చేశాడు. బంధుజనంతో విరోధంతో పాటు ఇల్లు కూడా కోల్పోయిన కౌండిన్యుడు దుర్భర దారిద్ర్యానికి లోనయ్యాడు. కౌండిన్యుడు తన తప్పుకి విచారించి పిచ్చివాని వలే అడవులలో తిరుగుతూ దారిలో ఫలభరితమై ఉన్నా ఎవ్వరికీ ఉపయోగపడని మామిడి చెట్టుని పచ్చగడ్డి చెంతనున్నా మేయలేని గోవును పరస్పరం నీరు ప్రవహింపజేసుకున్నట్లున్న రెండు చెరువులను, ఒక గాడిద, ఒక ఏనుగును చూసి 'అనంతుని చూసినారా? అని అడిగాడు. తామెవరు అనంతుని చూడలేదని, ఎరుగమని చెప్పారు.

కౌండిన్యుడు అనంతుని జాడ తెలియక రోదించుచుండగా అనంతుడు దయతో ఒక వృద్ధ బ్రాహ్మణుని వేషంలో కౌండిన్యుని వద్దకు వచ్చి అనంతుని నేను చూపిస్తానని వెంట తీసుకునిపోయి, తన అనంత రూపాన్ని చూపగా, కౌండిన్యుడు భక్తిపారవశ్యంతో అనంతుని పాదాలు చెంత ప్రణమిల్లి తన తప్పు క్షమించమని ప్రార్థించాడు. అప్పుడు అనంతుడు అతనితో "ప్రతి సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్దశి నాడు అనంత పద్మనాభ వ్రతమును పద్నాలుగు సంవత్సరాలపాటు ఆచరించు, అనంత సౌఖ్యాలను పొందు"అని వివరించాడు. అడవి మార్గంలో కనిపించిన వాటి

గురించి ప్రశ్నించగా, మామిడి చెట్టు పూర్వజన్మలో విద్యావేద విశారదుడగు విప్రుడు, విద్యాదానం చేయక పనికిరాని మామిడి చెట్టుగా, సంపద ఉండి కూడా దానం చేయని పిసినారి గడ్డి తినడానికి నోరు రాని గోవుగా , పరనింద చేసినవాడు గాడిదగా, పరుల సొత్తును కాజేసిన వాడు ఏనుగుగా పుట్టారని, ఆ రెండు చెరువులు ధర్మాధర్మములని చెప్పి, అనంత పద్మనాభ వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో క్రమం తప్పక ఆచరించమని ఆదేశించి పంపాడు.

ఆ ఆదేశానుసారం కౌండిన్యుడు సతీసమేతుడై అనంత వ్రతన్నాచరించి సకుటుంబముగా నక్షత్ర మండలంలో చిరస్థానం పొంది నేటికీ మనకు దర్శనీయుడై ఉన్నాడు.

**వ్రత విధానం**

భాద్రపద శుద్ధ చతుర్దశి నాడు వేకువనే లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానమాచరించాలి. ఎర్రని వస్త్రాలు ధరించి, పూజా స్థలాన్ని గోమయంతో అలికి, ముగ్గుల మధ్య కలశ స్థాపన గావించి, కలశం ముందు పద్నాలుగు పోగులు, పద్నాలుగు ముడులు కలిపిన తోరాన్ని కుంకుమలో తడిపి స్వామి వద్ద ఉంచి పూజించాలి. దర్భలతో చేసిన అనంత పద్మనాభుని కలశంపై పెట్టి పూజించాలి. ఏడు పడగల శేషునిపై అనంత పద్మనాభ స్వామి శయనించినట్లుండాలి. కలశాన్ని బియ్యంతో నింపాలి. కలశం దగ్గర 14 వక్కలు, 14 పసుపు కొమ్ములు, 14 ఖర్జూరాలు ఉంచాలి.

గోధుమపిండితోచేసిన ఇరవైఎనిమిది అరిసెలను నైవేద్యంగా పెట్టి నివేదనానంతరం అందులో సగం అటే పద్నాలుగు అరిసెలను బ్రాహ్మణునికి వాయనమివ్వాలి. తక్కినవి కుటుంబ సభ్యులందరూ ప్రసాదంగా స్వీకరించాలి. నైవేద్యానంతరం వ్రత కథను చెప్పుకుని స్వామి వారికి నమస్కరించి అక్షింతలు తలపై చల్లుకుని పూజలో ఉంచిన ఎరుపు రంగులో ఉన్న పద్నాలుగు పోగులతో తయారైన తోరమును ధరించాలి. ఈ విధంగా చేయడం వల్ల నిత్యమూ తోరా రక్షణగా ఉండి సకల కష్టాలు తొలగిపోయి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. పూజా ద్రవ్యాలన్నీ పద్నాలుగు సంఖ్యలోనే వినియోగించడం ఈ వ్రత ప్రత్యేకత.

ధరించిన తోరమును మూడు లేదా ఐదు రోజులు మాత్రం ధరించి తరువాత తీసి భద్రపరిచి మళ్లీ వ్రతము చేసే ముందు పాత తోరమును ధరించడం చేయవచ్చు. ఈ విధంగా ఈ వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో నియమానుసారం పద్నాలుగు సంవత్సరాలు క్రమం తప్పక చేసి చివరి సంవత్సరం ఉద్యాపన చేయాలి. ప్రతి సంవత్సరం కొత్త తోరాన్ని ధరించాలి. అనంత వ్రతాన్ని త్రయోదశితో కూడి చతుర్దశి నాడు ఆచరించిన నిష్ఫలమవుతుందని, పూర్ణిమతో కూడిన చతుర్దశి నాడే ఈ వ్రతాన్ని చేయాలని భవిష్యత్ పురాణం తెలియజేస్తోంది.


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



ధారావాహికం

# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి (9550241921)

**సరసిజ నయనే సశంఖ చక్రే మురభిది మా విరమ స్వచిత్త రంతుం |**
**సుఖతర మపరం న జాతు జానే హరిచరణ స్మరణామృతేన తుల్యం ||"**

ఓ మనసా! శ్వేత తామరల లాంటి నయనాలు కలిగి శంఖ చక్రాలను ధరించి దివ్య మంగళ స్వరూపుడైన శ్రీ కృష్ణ భగవానుని ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండు. ఎప్పటికీ ఆయన స్మరణ మానవద్దు. శ్రీహరి పాదపద్మాలను స్మరించడం అనే అమృతానికి సమానమైన సుఖం మరొకటి లేదు కదా! అంతిమ స్మరణ కలగడానికి నిరంతరం పరమాత్మనే తలవమని కులశేఖరాళ్వార్లకు చెప్పగా "చింతయామి హరిమేవ సంతతం – హరినే సదా తలుస్తాను" అని 8వ శ్లోకంలో చెప్పారు.

ధ్యానం అనేది మనస్సుచేత చేయవలసిన కార్యం శరీరముతో చేయతగినదికాదు.

**"తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియ క్రియః |**
**ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే ||"**
**– గీత. 6.12**

ఇత్యాది గీతా శ్లోకముల ద్వారా మనస్సును మెల్లగా వశం చేసుకుని సంకల్పజన్య విషయములు అన్నిటిని నిశ్శేషముగ మనసుచేత వదిలి ఇంద్రియ సమూహము అలానే శబ్దాది విషయముల నుండి నివర్తింపజేసి మెల్లగా వివేకయుక్తమైన బుద్ధిచేత ఆత్మ యందు నిలిపి దానికంటే ఇతరమైన వాటి గురించి చింతించకుండా ఉండమని చెబుతున్నాయి.

మనస్సును అంత తేలికగా వశపరచలేము దాని లక్షణాన్ని అర్జునుడు తన సంశయాన్ని కృష్ణుడికి ఇలా చెబుతాడు.

**"చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢం |**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరం ||"**
**– గీత. 6.34**

"కృష్ణా! మనస్సు చంచలమైనది. బలాత్కారంగా హరించేది. అధిక బలం కలది. దానిని త్రిప్పడం గాలిని తిప్పడంలా అసాధ్యమని చెప్తాడు." అందులో సందేహం లేదని కృష్ణ పరమాత్మ చెప్పెను.

**"అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ |**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ||"**
**– గీత. 6.35**

మరి ఇలాంటి మనస్సుతో పరమాత్మను తలవడం అవుతుందా? ఆళ్వార్లు ఏమో "చింతయామి హరిమేవ సంతతం" అంటున్నారు కదా! అంటే మనస్సుతో జరిగే కార్యము కనుక దానిని వేడుకొనుట కర్తవ్యమని తలచి ప్రార్థిస్తున్నారు. ఓ మనసా! పరమాత్మతో చెప్పాను నీవు పలుచోట్లకు తిరుగుతుంటే నాకు వేరొక గత్యంతరం లేదు. నీవు నాకు బంధువువి కూడా.

**"ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ |**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ||" – గీత. 6.5**

అని చెప్పినట్లు ఓ మనసా నువ్వు నాకు బంధువువి. నేను ఎక్కడికి వెళ్లినా, అలాగే నేను ఏ జన్మెత్తినా నువ్వు నా వెంటే వస్తావు, అందుకు నిన్ను నమ్మి 'చింతయామి' అని అన్నాను. కాబట్టి నిన్ను ఆ భగవంతుడి వద్దే విడిచి పెడతాను, నువ్వు అక్కడే ఉండు. అంటూ మనస్సుకు చక్కటి బోధ చేస్తున్నారు. అలా చెప్పే సమయంలో మనస్సుకు వచ్చే సందేహాలకు ఇలా సమాధానం ఇస్తున్నారు కులశేఖరాళ్వార్లు.

ఓ మనసా! నిన్ను పరమాత్మ పాదపద్మములనే చోట ఉంచుతున్నా అక్కడ సుఖం ఉంటుందా? రక్షణ ఉంటుందా? అని అనుకుంటావేమో.

'సరసిజనయనే' ఓ మనసా ఏమని చెప్పమంటావు పరమాత్మ యొక్క శృంగారము. వారి యొక్క దివ్య నేత్రములు తామర పుష్పముల వలె అత్యంత అందముగా ఉండి ఆకర్షించును. ఇంకా నీ రక్షణార్థం అంటావా? పరమాత్మ శంఖ చక్రములు ధరించి ఉంటాడు, తన యొక్క చక్రము లోకములనే కాలుస్తుంది. శంఖ ధ్వని వింటే పదునాలుగు లోకాలు భయపడతాయి. 'మనస్సుకు రక్షణ మేమిటంటే పరమాత్మ యందు రుచి కలిగి ప్రవేశించే సమయములో ఇంద్రియాలు తిరిగి వెనకకు లాగుతాయి అలాంటి సమయంలో నిష్ఠకు రక్షణగా మోహపరిచి అవసరమైతే

పరమాత్మ నుండి వేరు చేసే దుష్టశక్తులను హతమార్చగలిగే శంఖచక్రాదులు మనకు తోడుగా ఉన్నాయని' చెబుతున్నారు.

పరమాత్మతో సమానము కానీ, మించినది కానీ మరొకటి లేదు. నిరంతరం శ్రీహరి సంకీర్తనమనే అమృతాన్ని సేవిస్తూ ఆనందంగా వసిస్తూ ఉండుము. అంటూ కులశేఖరాళ్వార్లు పరమాత్మను సేవించడానికి సాధనమైన మనస్సును సిద్ధంచేసి ఉపాయాన్ని బోధించారు.

భగవంతుని లీలలను మనస్సులో నిలుపుకొని స్మరించడమే స్మరణ భక్తి. ఇందులో నామ స్మరణం, రూప స్మరణం, స్వరూప స్మరణం అని మూడు రకాలు ఉన్నాయి. మునులు, ప్రహ్లాదుడు, ధ్రువుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన వారు స్మరణ భక్తితో ధన్యులైనారు. అలా స్మరణ భక్తితో తరించిన వారిలో ఒకరు ధ్రువుడు.

స్వాయంభువ మనువుకి ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఉత్తానపాదుడు ప్రముఖుడు. ఉత్తానపాదుడికి సునీతి, సురుచి అనే ఇద్దరు భార్యల వలన ధ్రువుడు (సునీతి) ఉత్తముడు (సురుచి) అనే ఇద్దరు కుమారులు కలిగారు. కాలప్రభావం వలన ఉత్తానపాదుడికి సునీతి కంటే సురుచి అంటే ప్రేమ, అనురాగం ఎక్కువగా ఉండేవి.

ఒకరోజు సురుచి కుమారుడైన ఉత్తముడు తండ్రి తొడపై కూర్చొని ఉండగా దానిని ధ్రువుడు చూసి తాను తండ్రి తొడ ఎక్కబోతుండగా సురుచి చూసి వెర్రి నవ్వు నవ్వి నీకు తండ్రి తొడ పై ఎక్కే అదృష్టం లేదు, అదే కనుక ఉన్నట్లయితే నువ్వు నా సవతి కుమారుడిగా పుట్టి ఉండే వాడివి కాదు అని అవహేళన చేస్తుంది. నీకా అదృష్టం కలగాలంటే శ్రీహరిని ప్రార్థించమని చెబుతుంది. ఆ పరుష భాషణానికి చింతాక్రాంతుడై ధ్రువుడు తన తల్లి సునీతి వద్దకు వెళ్ళి జరిగిన విషయం చెబుతాడు.

అప్పుడు సునీతి ధ్రువుడితో నాయనా కాలప్రభావం వలన నీ తండ్రి తనను దాసీ కంటే తక్కువగా చూస్తున్నాడని, కష్టం కలిగించే పలుకులైన సవతి సరైన విషయం చెప్పిందని, శ్రీహరి పాద ధ్యానము వలన జరగనివి ఉండవని స్వాయంభువ మనువు శ్రీహరిని ధ్యానించి ఉత్తమ గతి పొందాడని చెబుతుంది. అప్పుడు ధ్రువుడు శ్రీహరిని ప్రసన్నం చేసుకోవడానికి రాజధాని నుండి అడవికి బయలుదేరాడు.

అప్పుడు మార్గమధ్యములో నారదుడు కనిపించి ఎక్కడకు వెళ్ళుతున్నావు అని అడుగగా ధ్రువుడు అప్పటి వరకు జరిగిన వృత్తాంతం, తన సవతి తల్లి చేత పొందిన అవమానం చెబుతాడు. నారదుడు ధ్రువుడిని ఓదార్చి రాజధాని నగరం పంపడానికి ప్రయత్నిస్తాడు. కాని ధ్రువుడి పట్టుదలకు మెచ్చి యమునా నది



తీరములో ఉన్న మధువనంలో దర్భాసీనుడవై ప్రాణాయామ నిష్ఠతో శ్రీ మహావిష్ణువును ఆరాధించమని "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే నారాయణ మంత్రము ఉపదేశిస్తాడు. ధ్రువుడు యమునా నదిలో త్రికరణ శుద్ధిగా స్నానము చేసి దర్భాసీనుడై నారాయణుని గురించి తపస్సు చేస్తాడు. ముందు మూడు రోజులకు ఒకమారు వెలగ పండు లేదా రేగి పండు తినేవాడు. తరువాత ఆరు రోజులకు ఒకమారు పండి రాలిన ఆకులు తింటు తపస్సు చేశాడు.

ఆ తరువాత మూడు నెలలకు తొమ్మిది రోజులకు ఒకమారు మంచి నీరు త్రాగి తపస్సు చేశాడు. ఆ తరువాత 12 రోజులకు ఒకమారు గాలి పీల్చి తపస్సు చేశాడు. మరికొన్ని రోజులకు గాలి కూడా పీల్చకుండా తపస్సు చేస్తూండగా, సమస్త బ్రహ్మాండంలో అల్లకల్లోలం సృష్టించబడి దేవతలు నారాయణుడి వద్దకు వెళ్ళి విషయం విన్నవిస్తారు. అప్పుడు నారాయణుడు ధ్రువుడు తన గురించి తపస్సు చేస్తున్నాడని, వాని వలన ఈ ఉపద్రవం వస్తున్నదని చెప్పి వానికి ప్రత్యక్షం అయ్యి దీక్ష విరమింప జేస్తానని చెబుతాడు.

నారాయణుడు ధ్రువుడికి శంఖ చక్రాలతో ప్రత్యక్షమై ధ్రువుడి శిరస్సు నిమరగా ధ్రువుడు 12 శ్లోకాలతో నారాయణుడిని స్తుతిస్తాడు. దానికి నారాయణుడు ప్రీతి చెంది అంతరిక్షంలో సప్తఋషులు, నిఖిల తారాగణాలు, సూర్యచంద్రులు నిరంతరం ప్రదక్షిణం చేసే ధ్రువక్షితి అనే స్థానం కలిపిస్తున్నానని చెప్పి, ఆ ధ్రువక్షితికి చేరే ముందు కొన్ని రోజులు రాజ్యపరిపాలన చేయమంటాడు. ఆ విధంగా నారాయణుడిని ప్రసన్నం చేసుకొని ఆశీర్వాదం పొందిన ధ్రువుడు తిరిగి రాజధాని చేరుకొంటాడు. రాజధాని చేరుకొనిన ధ్రువుడిని చూసి తండ్రి ఉత్తానపాదుడు సంతోషం పొంది, రాజ్యానికి పట్టాభిషేకం చేసి వానప్రస్థాశ్రమమునకు వెళ్తాడు.

శింశుమాన ప్రజాపతి కుమార్తె అయిన 'భ్రమి' అనే గుణవతిని వివాహం చేసుకొని 'కల్పుడు, వత్సరుడు' అనే కుమారులను సంతానంగా పొందుతాడు. అనంతరం వాయివు కుమార్తె అయిన 'ఇళ' అనే కన్యకని వివాహం చేసుకొని ఆమె వలన 'ఉత్కలుడ'నే కొడుకుతో పాటు 'కూతుర్ని' పొందుతాడు.

ఒకరోజు తన సోదరుడైన ఉత్తముడు అరణ్యానికి వేటకు వెళ్ళి ఒక యక్షుని చేతిలో మరణించాడు. ఆ వార్త విన్న సురుచి అగ్నిలో ప్రవేశించి ప్రాణ త్యాగం చేసింది. ఈ రెండు విషయాలు మనస్థాపం కలిగించి ధ్రువుడు హిమవత్పర్వతం లోయలో ఉన్న అలకాపురిలో ఉన్న యక్షుల మీద యుద్ధం ప్రకటించాడు. కొద్ది సేపటి తరువాత యక్షులు మాయ యుద్ధం చేయడం మొదలుపెట్టారు. వారితో మాయా యుద్ధం చేసే దారి తోచక ఆలోచిస్తుంటే మునులు ప్రత్యక్షమై నిఖిలలోకాలకు మూల కారకుడైన నారాయణుడిని స్మరించమని చెబుతారు. నారాయణుడిని స్మరించి నారాయాణాస్త్రం సంధించగా యక్షుల శక్తి సన్నగిల్లి వారి కాళ్ళు, చేతులు, మొండాలు విరిగి క్రింద పడిపోయాయి. అప్పుడు ధ్రువుడి తాత స్వాయంభువ మనువు ప్రత్యక్షం అయి దేహాభిమానం కలిగిన పశుపక్ష్యాదులు చేసే కిరాతక కృత్యాన్ని చేస్తున్నడని, నారాయణుడిని ప్రసన్నం చేసుకొనిన నీకు అది సరికాదని హితబోధ చేశాడు. అంతేకాక యక్షులతో యుద్ధం వల్ల శివుడి సన్నిహితుడైన కుబేరుడికి ఆగ్రహం వచ్చిందని చెబుతాడు. ధ్రువుడు తన తాత మాటలు విని విరమించాడని తెలుసుకొని కుబేరుడు సంతోషించి, ధ్రువుడు ఉన్న ప్రదేశానికి వచ్చాడు. అప్పుడు ధ్రువుడు కుబేరుడికి నమస్కరించగా కుబేరుడు ధ్రువునితో మీతాత మాటలు విని యుద్ధం ఆపినందుకు సంతోషంగా ఉన్నది, నిర్మలమైన శ్రీమహావిష్ణువును సదా స్మరిస్తూ జీవనం జరపమని సెలవిచ్చి వెళ్ళిపోతాడు.

ధ్రువుడు రాజధాని చేరి భూరి దానాలతో యజ్ఞాలు సాగించి కొంత కాలం పరిపాలన చేశాడు. తరువాత రాజ్యాన్ని తన కూమారుడికి అప్పగించి, తపస్సు చేసుకోవడానికి బదరికా వనములో పద్మాసీనుడై శ్రీ మహావిష్ణువు స్మరిస్తూ కాలం వెల్లబుచ్చుతుండగా. ఒకరోజు నంద, సునంద అనే ఇద్దరు నారాయణ సేవకులు దివ్యవిమానం మీద ధ్రువుడిని తీసుకొని వెళ్ళడానికి వస్తారు. ధ్రువుడా దివ్యవిమానం ఎక్క లేకపోతుండగా యముడు వచ్చి తన వీపు మీద నుండి ఆ విమానం ఎక్కమని చెబుతాడు. అలా వెళ్ళుతుండగా ధ్రువుడు నారాయణ సేవకులతో తన తల్లిని చూడవలెనని కోరిక ఉన్నదని తెలుపగా వారి ముందు ఉన్న విమానం పైనున్న సునీతిని చూపించగా ధ్రువుడు ఆనందిస్తాడు. నేటికి మనకు కనిపించే ధ్రువ నక్షత్రము ధ్రువుడి నారాయణ భక్తి సామ్రాజ్యపాలన ఫలంగా లభించనదే అని చెబుతారు.

ధ్రువుడు భారత ఇతిహాసములలో శ్రీ మహావిష్ణువు చేత ఆశీర్వదించబడి అంతరిక్షంలో ఇప్పటికి ధ్రువ నక్షత్రముగా ధ్రువక్షితిలో మనకు కనిపిస్తున్న స్వాయంభువ మనువు వంశ రాకుమారుడు. పెద్దలు ఇప్పటికి చిన్న పిల్లలకు భక్తికి, కార్య నిశ్చయానికి ఉదాహరణగా ధ్రువోపాఖ్యానం (ధ్రువ చరిత్ర) చెబుతారు. ధ్రువోపాఖ్యానం విష్ణు పురాణము లోను, మహా భాగవతము నాల్గవ స్కందములో ముఖ్యముగా ప్రస్తుతించబడుతుంది. ఋగ్వేదం ప్రకారము ధ్రువ అంటే రెండు అర్థాలు కనిపిస్తున్నాయి. ఒకటి ధ్రువ నక్షత్రము, మరొకటి నిలకడ స్థితి. వేదాలలో ధ్రువనక్షత్రము గురించి ప్రత్యేకముగా ఎక్కడ ప్రస్తుతించినట్లు కనిపించడం లేదు. గృహ్యసూత్ర, మహాభారతం, సూర్యసిద్ధాంతం ధ్రువ నక్షత్రం గురించి ప్రస్తుతించడింది.

పనిని–1,4,24 ప్రకారం ధ్రువ అంటే ఒక నిలకడ స్థానము నుండి బయలుదేరే ప్రదేశాన్ని ధ్రువ అని పిలుస్తారు.

ఆకాశంలో ఎన్నో నక్షత్రాలున్నా–ఉత్తర దిక్కున సప్తర్షి మండలంపైన ప్రకాశిస్తూ వెలిగే నక్షత్రమే ధ్రువ నక్షత్రం! ధ్రువుడు ధృవతారగా వెలగడం. ఎత్తైన స్థానంలో ఉన్న ధ్రువనక్షత్రం వెనుక ఉన్న ధ్రువుని కథ! ఇది.

ఓ చిత్తమా! ఆ శ్రీహరి పాదములను స్మరించుటే మేలగును. ఆ స్మరణ అమృతమువలె మాధుర్యముచే సంతోషము నొసంగును. నువ్వు (చిత్తము) విడువక పట్టుదలతో ఆ లక్ష్మీపతిని, శంఖ చక్రధరుని, మాధవుని, పద్మనయనుని, మంగళదాయకుని, మురారిని, మేలుగా భజింపుము. ఆ స్మరణామృతానికి సాటియైనది, సుఖదాయి అయినదానిని నేనెరుగను అని కులశేఖరులు చెబుతున్నారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

ధారావాహికం



# శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

### పదునైదవ అధ్యాయము

## శ్రీ మహాలక్ష్మిని బంధించుట – శ్రీ వేంకటేశ్వరునకు కన్యాదానం చేయుట

అన్నింటికన్న మిక్కుటమగు, మిక్కిలి ఫలవంతమగు, మధుర రసముల నొలకించి, మనము గ్రోలి కడు పుణ్యులమవ, ఆత్మానందముల బడయ, జరిగిన యదార్థగాధను, ఇప్పుడు తెలుసుకుందము. వీనుల విందగు అద్దానిని, ఇట్లే కన్నులమూసి, ఆత్మానుసంధానులమై అంతరంగ అక్షులతో చూచి, ఆస్వాదించి, తరియించెదము.

అనంతాళ్వానుకు వయస్సు పైబడసాగెను. అయిననూ మక్కువతో పుష్పోద్యానమును ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తల తీసుకొనుచూ, శ్రీ వేంకటనాథునికి, పుష్పముల కోసి మాలికాగ్రథనములు చేసి తీసుకొని వెళ్లి వివిధ రీతుల అలంకరణలు చేసి మురిసేటి అనంతాళ్వానును చూసి తానూ తెగ మురిసిపోయేటి వాడు మన శ్రీతిరువేంగనాథుడు.

అనునిత్యమూ తన దేవేరిరువురితో అనంతాళ్వాన్ పుష్పతోట విశేషములను, అనంతాళ్వాన్ చేసేటి నిత్య పుష్పకైంకర్యముల, సంభాషణముల ముచ్చటించనిదే తిరువేంకటాద్రీశుడు, దేవేరిరువురూ ప్రేమగపెట్టేటి విశేషపు ఆరగింపులు చేసెడి వాడు కాదు. ఇదియంతయూ గమనించిన పద్మావతిదేవి, ఒకనాడు స్వామీ! ప్రతిరోజు మీరు మాకు చెప్పుట, మేము వినుట, ఏల? వినుటకే ఇంత ఇంపుగనున్న, చూసిన కన్నులకింకెంత రమణీయముగ కాన్పించునో కదా, కనుక మీరేమి చేయుదురో

నాకు తెలియదు, మనమిరువురమూ నేటి నుండి ఈ పుష్పోద్యానముల విహరించి, సేదతీరెదమని పట్టుబట్టెను. దానికి శ్రీనివాసుడు నవ్వి సరియని పలికెను.

నాటి రాత్రి ఇరువురునూ, మానవరూప ధారులై రాచరికపు అంద, చందపు చందన అలంకార సుశోభితులై అనంతాళ్వాన్ పుష్పోద్యానమునకు చేరిరి.

అచ్చట గల పెద్ద పెద్ద వృక్షముల, వానికి పెనవేసుకుని సౌరభ సుమగంధపు సువాసనలు వెదజల్లేటి లతల, పలు పుష్పజాతుల అందచందములను ఆస్వాదించుచూ, ఆఘ్రాణించుచూ, తోటయంతయూ కలియ తిరుగుచూ మంచి మంచి రంగు రంగుల సువాసన భరితపు పుష్పముల కోసి శ్రీనివాసుడు, పద్మావతి దేవేరి కొప్పున తురిమి, పక పక నవ్వి పరుగులిడుచు నిన్ను నే పట్టకుందు పడతియనుచూ ఆమె వెనుక వెనుక తోటయంతయూ తిరుగసాగె. పుష్పతోటలోని తమలపాకుల తన పద్మ హస్తములతో త్రుంచి చిలకల చుట్టి తన ప్రియపతి శ్రీపతి శ్రీవేంకటపతికి తినిపించి మురిపించి ముద్దులొలికించేటి తన సతిని, పద్మావతిని ఆటల పట్టించుచూ తోటనంతయూ కలియ తిరుగుచూ ఆనందడోలికలనూగిరి. ఆ దృశ్యము మదిన తలచి, తరచి చూసిన బృందావనమున రాధాకృష్ణులు చేసిన చేష్టలు రాసలీలలు మన కన్నుల కాన్పించుటయన్నది తథ్యము.

సుప్రభాత సమయమునకు సతి, పతులిరువురూ ఆనంద నిలయము చేరిరి. మరుసటి దినము ఆనందాళ్వాన్ నిదుర లేచుసరికి, తోటయంతయూ పాదములతో త్రొక్కిన జాడలు, విరిగిన కొమ్మలు, నేలరాలిన పుష్పములు, తెగిపడిన లతామాలికలు, ఎంగిలి తాంబూలపు మరకలు కాన్పించ, అనంతాళ్వాన్ ఆవేశపూరితుడయి, తన శిష్యులతో ఎవ్వరో దొంగలు వచ్చి తోటనంతయూ నాశనము చేసినారు. ఈ దినము నుండి మీరందరూ రాత్రి పూట వంతుల వారీగా కాపలా కాయుచూ, దొంగలను పట్టుకునుడు. వాని భరతము నేను పట్టెదనని పలుక, నాటి రాత్రి శిష్యులు నిదురపోక కాపలా కాయసాగిరి.

పాలు త్రావనేర్చిన పిల్లి పాలు త్రావక నుండదన్నట్లు, ఉట్ట కట్టిన వెన్నకుండల తిననేర్చిన చిన్ని కృష్ణుడు వెన్నలకై వెంపర్లాటల మానునాయన్నట్లు, అనంతాళ్వాన్ పుష్పోద్యాన విహారముల, మనోల్లాసముల గరిపినయట్టి, పద్మావతి దేవేరి, సాయం సంధ్య అవ్వగనే, ముద్దు ముద్దుగ తన పతి, శ్రీపతి సరసన చేరి, కొసరి, కొసరి వడ్డించి, ముద్దుల చేసి తిరుమల రాయనికి తినిపించుచూ, తన మనస్సులోని నాటి రాత్రి కూడా అనంతాళ్వాన్ల తోటకు పోయి విహరించెదమను కోరిక మురిపెముగ చెప్పి తన ముచ్చట దీర్చమని పోరుపెట్ట, శ్రీనివాసుడును అట్లేయని అనంతాళ్వాన్ల తోటన మునుపటి దినము వలెనే చేరి సరస సంభాషణముల, విహారముల తేలియాడి సుప్రభాత వేళకు ఆనంద నిలయము చేరుకునిరి. కాపలాగ ఉన్న శిష్యబృందమునకు, కాపలాదారులకు వారు కాన్పించనైరి.

ఇట్లు 8 లేదా 9 రోజులు కడచినవి. దొంగలు దొరకరాయె! అనంతాళ్వాన్ ఆవేశము అంతకంతకు హెచ్చసాగె, కంటికి కునుకు రాదాయె! ఇన్ని సంవత్సరములు కష్టపడి తయారు చేసిన ఈ పుష్పోద్యానవనమును, ఈ దొంగలు ఎవరో ఎనిమిది రోజులలో సర్వనాశనము చేసినారే! నేను తిరుమల వచ్చి, ఎన్నో సంవత్సరములు కడచినవి, ఎన్నడూ ఇట్టి విపత్తు జరుగలేదు. ఇది ఎవరో పనికట్టుకుని చేయుచున్నట్లున్నది. కావున ఏది ఏమైనా కానీ, నేడు నేను కూడా నిదురించక, రెప్పవాల్చక కాపలా కాయుదును. దొంగలను పట్టియే తీరవలయునని, పెందలకడనే భోజనము చేసి, తోటకు పోయి ఒక పొదమాటున నక్కి కూర్చుండెను.

అనంతాళ్వాన్ భక్తిని తనకు ఆతనిపై ఆతనికి తనపై గల ప్రేమాభిమానముల శ్రీనివాసుడు లోకమునకు బహిర్గతము చేయనెంచి, నాటి రాత్రి తన ప్రియ సతియగు శ్రీ మహాలక్ష్మి అంశయేయగు పద్మావతి దేవేరితో కూడి, అనంతాళ్వాన్ తోటన చేరి, నొకరు చేతుల నొకరు పట్టుకుని తోటయంతయూ కలియతిరుగుచూ అనంతాళ్వానుకు అగుపించునట్లు అనంతాళ్వాన్ నక్కి కూర్చున్న పొద వద్దకు వచ్చిరి. వచ్చి రాగానే ఏడు పడగల ఆదిశేషుడు ఒక్కసారిగా పైకి లేచినట్లు కోపోద్రిక్తుడయ్యి పొదమాటు నుండి లేచి ఒక్కసారిగ పద్మావతి శ్రీనివాసుల చేతుల పట్టి బంధింపచూచుచూ వారిరువురి చేతులను గట్టిగ పట్టుకునెను.


ఇది గమనించిన శ్రీనివాసుడు నొక్క ఉదుటన చేతులు విదిలించి ఆనంద నిలయమునకు పరుగు మొదలు పెట్టి పరుగులిడుచూ, అంతకు ముందు తనను అనంతాళ్వాన్ గునపముతో గడ్డము పగుల కొట్టిన తీరు కన్నుల కాన్పించ కమలాక్షిని శ్రీ పద్మావతి దేవిని విడచి సితకమలాక్షుడు తానొక్కడే ఆనంద నిలయము లోనికి ఒక్క అంగలోనే చేరుకునెను.

ఇక తన చేతుల చిక్కిన శ్రీ మహాలక్ష్మిదేవి అంశయగు శ్రీపద్మావతి దేవిని అటులనే తన చేతుల పట్టి భుజముపైనున్న కండువతో గట్టిగ రెక్కలు విరచి కట్టి పెద్ద సంపెంగ మానుకు అల్లుకుని యున్న లతలతో ఆ సంపెంగ మానునకే ఆ లతాంగిని చెట్టు మొదలున బంధించెను. బంధించిన పిదప ఆ పడతి పద్మావతిని ప్రశ్నలిడ మొదలిడెను. అసలు మీరెవ్వరూ? ఎందుకిట్లు చేయుచున్నారు? మీకై మీరే వచ్చుచుంటిరా లేక

ఎవ్వరైనా పంపినారా? ఎంతో శ్రమకోర్చి శ్రీవేంకటనాథుని పుష్పకైంకర్యములకై ఏండ్ల తరబడి కష్టించి, గురు ఆజ్ఞా బద్ధుడనై పుష్పమాలికా గ్రథనముల చేసి శ్రీనివాసుని పుష్పాలంకరణల శోభితుడ చేయుచుంటిని. నేటికి 8 రోజుల నుండి శ్రీ తిరుమల నారాయణునికి పుష్పములు లేక మాలాలంకృతముల చేయలేనైతిని. మీది ఏ ఊరు? నీతో వచ్చిన వాడెవ్వడు? ఎక్కడు ఉందురు యన, ఆమె! అయ్యా! నన్ను విడువుము. అన్ని ఊర్లు మావే, అన్నిచోట్ల నా పతి తిరుగాడుచుండును. నాతో వచ్చినది నా పెనిమిటి. ఏ ఊరు, ఎక్కడ ఉందురన్న నేనెట్లు చెప్పగలను. నా పతితో కూడి, నేనూ తిరుగాడుచుందునుయని పలుక, నీ పతి పేరేమని అడుగ, అయ్యా! నీవు నా తండ్రి వంటివాడవు, నేను మీ ఇంటి కన్యనని దయతలచి విడుపుము. ఏ హైందవ స్త్రీ ఐననూ తన భర్త పేరు చెప్పునా? శాస్త్రములన్ని తెలిసిన వాడివోలెనున్నావు. మమ్ములనెవ్వరూ పంపలేదు. మీ తోట అందచందముల గూర్చి నా పతి చెప్ప, నేనాతనిని పోరుబెట్టి విహరింప వచ్చితిమి యనుచూ, ఇంక ముందెన్నడూ ఇట్లు చేయము, ఒకవేళ విహరించ కోరిక కలిగినచో, మీ అంగీకారముతోనే వచ్చెదము. నన్ను విడువుము. నేను నా భర్తకు వద్దకు పోయెదననిన, అమ్మా! నేనేమి వెఱ్ఱివానివోలే కాన్పించుచున్నానా, నీ కన్నులకు, ఎవ్వరైనా చేతుల దొరికిన దొంగను విడిచి పెట్టుదురా? నా తోటనంతయూ నాశనము చేసి, నా శ్రమయంతటిని బూడిదలో పోసిన పన్నీరు చేసిన మీరిరువురూ శిక్షార్హులు. తప్పించుకుపోయిన నీ మగడు అందాల సుగుణాల సంస్కరావతియగు నీకొరకై ఖచ్చితముగ వచ్చియే తీరును. వచ్చి విడిపించుకుపోవు వరకు, ఎన్నిదినములైన, నీవిట్లే బంధివైయుండవలెను. ఒకవేళ, నీ పెనిమిటి రాకున్న తిరుమలలో ఎవ్వరైన, నీవు వారికి తెలియునని ప్రమాణ ప్రతము ఇచ్చిన ఎడల నిన్ను నేను వదులుదును. నన్ను విసిగించకు, నీతోడుగా వచ్చిన పతి వచ్చి నిన్ను విడిపించుకుపోయేనులే యనుచూ, తెల్లవార్లు ఆమె కెదురుగా కూర్చుని, వాద ప్రతివాదములు చేయుచూ, నిదురపోక, కంటిరెప్పలనార్పక కాపలాగ కూర్చుండెను.

సుప్రభాత వేళాయెను. సన్నిధి గొల్ల, అర్చకులు, జియ్యంగార్లు ఆనంద నిలయము తలుపుల తెరచి ఒక్కసారిగా ఉలిక్కిపడిరి. ఏలయన భగవద్రామానుజుల వారు శ్రీస్వామి వారి మెడలో వేసిన శ్రీ లక్ష్మీ కంఠాభరణమునందు శ్రీమహాలక్ష్మి ముద్రరూపము కాన్పించక, ఒకరి ముఖం నొకరు చూసుకొనుచూ, ఒకరి నొకరు నిందించుకొనుచూ గడ గడ వణికిపోసాగిరి. తమకు శిక్ష తప్పదని తలచుచూ గోవిందా! శ్రీనివాస శ్రీ వేంకటనాథ జరిగిన దానిలో మా ఎవ్వరి తప్పిదము లేదు. నీవు తప్ప మమ్ము

కాపాడు వారెవ్వరు ... గుట చూచి కరుణ రసామృ... హృదయ... జనరక్షక...గు శ్రీ వేంక... ఒ... తో ...



భ...

అ...

అ...

నేనటులనే తప్పించుకుని ఆనంద నిలయము చేరితిని. కాని పద్మావతి దేవేరి మాత్రము అనంతాళ్వాన్ చేతల చిక్క అక్కడే ఒక సంపెంగ చెట్టుకు కట్టి వైచినాడు. నా సతిని తీసుకుని పోవ, నేను మరల తోటకు రాకపోవుదునా, పట్టుకుని దండించకుందునా యనుచూ ఆలోచనల చేయుచున్నాడు. ఇప్పుడే మీరు అనంతాళ్వాన్ వద్దకు పోయి జరిగిన విషయమంతయూ చెప్పి, అనంతాళ్వానును తన ఇంట కట్టియుంచిన వారింటి కన్యను పుష్పముల నడుమ కూర్చుండగ చేసి తీసుకుని వచ్చి నాకు కన్యాదానము చేయవలయునని తెలుపమని పలికిరి.

అంత అర్చకులు, జియ్యంగార్లు, అధికారులు భక్తజనులందరూ అనంతాళ్వాన్ తోటకు చేరి అక్కడ సంపెంగ మాను మొదలున కట్టియుంచిన పద్మావతి దేవిని చూచి ఆశ్చర్యచకితులగుచూ శ్రీ వేంకటేశ్వరుడు చెప్పిన విధముగనే అనంతాళ్వాన్లకు చెప్పి అట్లే చేయవలయునని విన్నవించిరి.

అది విన్న అనంతాళ్వాన్ అయ్యో! ఎంత పని చేసితిని, లోకాలనేలేటి మా తల్లినే బంధించితినే అని తలయుచూ అయినా ఆ తల్లే నిన్నటి రాత్రి తనను నా కూతురుగ మీ ఇంటి కన్యగ తలచి విడువమని నన్ను తన నోరార తండ్రి వంటి వాడవని పలికినది కదా యని యోచించుచూ పులకితుడై స్నానసంధ్యాదివందన కార్యములు పూర్తిగావించి దండిగ పుష్పముల కోసి చెట్టు మొదలున కట్టియుంచిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి బంధనములు తొలగించి, ఆ తల్లి ఆనతిని తీసుకుని పూల బుట్టలో కూర్చుండ చేసుకుని సకల రాజోపచార మర్యాదలతో పుష్పాభిషేకముల చేసి అష్టోత్తర శతనామముల పఠియించి, వేదపండితులు వేద ఘోషలు మిన్నంట శ్రీ పద్మావతి అమ్మవారు చిన్న కన్యగ మార ఆమె కూర్చుగ కూర్చున పూలబుట్టను అనంతార్యులు తన తలపై నిడుకుని ఆనంద నిలయములోని శ్రీనివాసుని సన్నిధికి చేరి, క్షమియించమని వేడి తమ ఇంటి కన్యను స్వీకరించమని పలుక, అట్లేయని శ్రీ వేంకటేశ్వరుడు మామా అనంతాళ్వాన్! మీ ఇంటి కన్యను స్వీకరించుచుంటిని, నా ఇంటి ఇల్లాలిగ చేసుకుంటిని. మామయగు మీకు నేనిచ్చు కన్యాశుల్కము ఏమన, నా మెడలోని కండువను నీ మెడన అలంకరింపచేయుచున్నాను స్వీకరింపుమనుచూ, తన మెడలోని కండువను, అనంతాళ్వాన్

మెడన వైచి అనంతాళ్వాన్ మెడన ఉన్న కందువను, కందువగు తన బంగారు చేతల తీసుకుని తన మెడన వేసుకునెను.

ఇట్లు అనంతాళ్వాన్ కన్యాదానము చేయగనే, అందరూ చూచుచుండగనే ఆ చిన్న కన్యామణి అదృశ్యమై శ్రీవారి కంఠాభరణమున మునుపటి వోలనే శ్రీమహాలక్ష్మి రూపిణియై స్థిరాశీనురాలయి, ప్రకాశించెను. నాటి నుండి శ్రీనివాసుని అనంతాళ్వాన్ అల్లుడని, అనంతాళ్వాన్ శ్రీనివాసునికి పిల్లనిచ్చిన మామ యని తిరుమల వాసులు పిలువసాగిరి.

వింటిరా! చూచితిరా! ఎంతటి మహర్భాగ్యుడో మన శ్రీ అనంతాళ్వాన్, సాక్షాత్ శ్రీ మహావిష్ణు అవతారియగు శ్రీనివాసునికి శ్రీ వేంకటనారాయణునికే కన్యాదానము చేయు భాగ్యము దక్కించుకునెను.


ఇంతటి మహర్భాగ్యము, పూర్వము సముద్రరాజునకు తన కూతురగు శ్రీమహాలక్ష్మిని శ్రీమన్నారాయణునికి కన్యాదానము చేసినపుడు, త్రేతాయుగమున జనక మహారాజు తన కూతురగు జానకిదేవిని శ్రీరామచంద్రునికి కన్యాదానము చేసినపుడు, ద్వాపరమున భీష్మకుడు తన కూతురగు రుక్మిణీదేవిని, సత్రాజిత్తు మహారాజు తన కూతురగు సత్యభామా దేవిని, జాంబవంతుడు తన కూతురగు జాంబవతిని శ్రీకృష్ణునికి కన్యాదానము చేసిన వారికి మల్లే, కలియుగారంభమున ఆకాశరాజు, తన కూతురగు శ్రీ పద్మావతి దేవిని శ్రీనివాసునికి ఇచ్చి కన్యాదానము చేసి ధన్యులు పుణ్యులు మోక్షులవ్వ మరల నేడిట్లు కలియుగమున అనంతాళ్వాన్లకు తమ ఇంటి కన్యను, శ్రీమహాలక్ష్మిని శ్రీనివాసునికి కన్యాదానము చేసేటంతటి మహర్భాగ్యము కలిగినది. తన ఇంటి కన్యను, పద్మావతి దేవి పద్మ హస్తముల, నీలమేఘశ్యాముని శ్రీ శ్రీనివాసుని నీలి కలువ హస్తముల నిడి, కన్యాదానము చేసి ఘనుడాయెను. శ్రీరంగమున గోదాదేవిని శ్రీరంగనాథునికి ఇచ్చి కన్యాదానము చేసి వినుతికెక్కిన విష్ణుచిత్తుని వోలే అనంతాళ్వాన్ తానున్నూ వినుతికెక్కినాడు. ఏకంగా తిరుమల నాథునికే కన్యాదానము చేసి, తిరుమల గిరుల తిరుగులేని శ్రీరామానుజుల శిష్య శిఖామణియై మెరయుచూ ఆచంద్రతారార్కము నిలచిపోయినాడు.

ఎంతటి భాగ్యశాలియో కదా, మన అనంతార్యుడు.

**జయహో జయ జయహో అనంతార్య శ్రీమహాలక్ష్మీ బంధకాయ శ్రీశ్రీనివాస కన్యాప్రదాతాయ జయహో జయహో.**

ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

**శ్రీ మహాలక్ష్మిని బంధించుట శ్రీ వేంకటేశ్వరునికి కన్యాదానము చేయుటయను పదునైదనవ అధ్యాయము సంపూర్ణః**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 48వ కళ్యాణం

తేది 6–8–2023 ఆదివారం ఉదయం 10 నుండి వైశ్య హాస్టల్ కాచిగూడలో జరిగింది. దీనిని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ శ్రీమాన్ బాలకృష్ణ గురుస్వామి గారి నిర్వహణలో జరిగింది. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.

## 49వ కళ్యాణం

తేది 18–8–2023 శుక్రవారం నాడు ఉ. 10.30 నుండి జరిగింది. ఇది మహీంద్రా ఎలైట్ బ్యాంకెట్ హాల్, టి.కె.ఆర్ కళాశాల వద్ద, రాఘవేంద్ర కాలనీ, జిల్లెలగూడ హైదరాబాద్‌లో జరిగింది. దీనిని శ్రీమాన్ గురుగుంట్ల అరవింద్ కుమార్ దంపతులు, మిరియాల రమేశ్ దంపతుల నిర్వహణలో జరిగింది.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
**(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అకస్మిక ధన లాభం కలుగుతుంది. బంధుమిత్రులను కలుస్తారు. శత్రువులు మిత్రులుగా మారతారు. సంతృప్తికరమైన రోజులు గడుపుతారు. దక్షిణామూర్తికి ప్రతి రోజు పూజలు చేయండి. గురు బలం తక్కువగా ఉంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో శ్రమ అధికంగా ఉంటుంది. ఏ పని అనుకున్నా వాయిదా పడుతుంది. గ్రహ కలయికలు కొంత ఇబ్బందిగా ఉన్నాయి. గురు పూజలు, ఇష్టదేవతా పూజల వలన చివరి దశలో పనులు అవుటకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు రోజురోజుకూ ఏదో తెలియని సమస్యలు వస్తున్నా.. మీరు నమ్మిన దేవతారాధన చేయడం వలన సంతోషాన్ని ఇస్తుంది. రెండవ వారంలో అకస్మిక ధన లాభం ఉంది. చాలా జాగ్రత్తగా గమనించి, ఆలోచించి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనకూలంగా ఉన్నట్లు ఉంటుంది కానీ, లోపల తెలియని భయంతో ఉంటారు. చేయాల్సిన పనులకు ఏదో ఒక కారణం చేత బ్రేకులు పడతాయి. కారణం.. గ్రహ మైత్రిలో సమస్యలు ఉన్నవి. గ్రహ ఆరాధన వలన గృహంలో శాంతి ఉంటుంది. నిత్యదీపారాధన చేస్తే ఓర్పునిస్తుంది. సమస్యలలో నుండి విముక్తి పొందుతారు.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనకూలంగా ఉంటుంది. చాలా ఉత్సాహంగా ఉంటారు. విష్ణు సహస్ర పారాయణం, లలిత సహస్ర నామ స్తోత్రం చేయండి. దైవ బలం పెరుగుతుంది. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగండి. విజయం పక్కనే ఉంటుంది.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంతవరకు గ్రహ కలయిక ఉంది. ఆర్థిక విషయాల్లో శ్రద్ధ అవసరం. ఖర్చులను అదుపులో ఉంచుకోవాలి. చాలా జాగ్రత్తగా ఉండాల్సిన రోజులు. దురలవాట్లకు బానిస కావొద్దు. జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ప్రతి రోజు నవగ్రహ ప్రదక్షిణలు తప్పనిసరిగా చేయాలి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు కొన్నివిషయాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. వివాదాలకు అవకాశం ఇవ్వరాదు. సమర్థులు సమర్థులుగానే ఉండండి. కుటుంబసభ్యుల సహకారంతో కార్యసాధనలో సాధించలేనిది ఏమీ లేదు. లౌకికంగా తప్పనిసరిగా ఈ నియమాలు పాటించాలి. ఇష్టదైవానికి దీపారాధన చేయాలి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. తొందర వద్దు. సంతృప్తికరమైన ఆదాయ వనరులు కలిగి ఉన్నారు. అకస్మిక ధన సంపాదన ఉన్నది. నూతన పరిచయాలు కలిసి వస్తాయి. విష్ణు సహస్ర నామ పారాయణం చేయండి. పెండింగ్ పనులు నెరవేరుతాయి. దైవ దర్శనం అఖండ దీపారాధన, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంది. బంధు మిత్రుల కలయిక, విందు వినోదాల్లో పాల్గొంటారు. పిల్లల వివాహ ప్రయత్నాలు ఫలించుటకు సరైన సమయం. ఎవరి మనసులో ఏముందో జాగ్రత్తగా గమనించి సమస్యలు రాకుండా ఆలోచన చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఎలాంటి సమస్యనైనా అమ్మ అనుగ్రహంతో సామరస్యంగా పరిష్కరించుకోగలరు. ఎంత తక్కువగా మాట్లాడితే అంత ఆనందంగా ఉంటారు. రాజీ మార్గంలో అన్ని శుభాలే ఉన్నాయి. అమ్మవారి పూజలతో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇష్టకార్యాలు నెరవేరుతాయి. బంధుమిత్రుల కలయికతో సంతోషంగా ఉంటారు. తొందరపాటు వలన అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఏకాగ్రత వలన అనేక విధాలుగా ధన లాభం ఉంది.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా, అనుకూలంగా ఉంటుంది. మీరు ఎంత నిబ్బరంగా ఉంటారో అన్ని విజయాలు పొందగలరు. మీ ప్రవర్తన మీ ఆలోచనలు మీ గౌరవాన్ని ఎంతో ఎత్తుకు తీసుకుపోతాయి. ఏట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరికీ హామీగా , మధ్యవర్తిగా ఉండరాదు. నవగ్రహ ప్రదక్షిణలు చేస్తే మంచి జరుగుతుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. తన పిల్లలందరికీ దేవుళ్ల పేర్లు పెట్టుకున్నదెవరు?
2. తిరుపతిలో భక్తిప్రచార పీఠాన్ని ఎవరు స్థాపించారు?
3. 'నభ' అంటే ఏమాసం?
4. అగ్నిదేవుని భార్య ఎవరు?
5. ఎండిపోయిన చెట్టును తిరిగి బ్రతికించినదెవరు?
6. తిరుచాన అంటే ఏమిటి?
7. విష్ణువు తల ఎక్కడ పడింది?
8. బలరామకృష్ణుల ఆలయం ఎక్కడుంది?
9. వేదాలను ఎవరు అపహరించారు?
10. హయగ్రీవుని అవతారం ఎప్పుడు ప్రారంభం అయింది?
11. శ్రీవారి ఆలయంలోని హుండీని ఏమంటారు?
12. తుకారాం రచనలను ఏమంటారు?
13. మధుకైటభులకు వరమిచ్చినదెవరు?
14. తుకారం రచనలను ఏ నదిలో పడేశారు?
15. భూదేవికున్న గొప్ప గుణమేది?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

పేరు: ______

చిరునామా: ______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. శయన ఏకాదశి, 2. చిన్నగుండవెల్లిలో, 3. పద్ముడు, 4. గోదానం, 5. నాచికేతుడు, 6. జటాయువు, 7. కుబేరుడు, 8. దమము, దయ, దాన- గుణాలను అలవర్చుకొమ్మని, 9. ఆదిశంకరస్వామి, 10. సువర్చల, 11. వరదయ్య, 12. సప్తమాతృకలు, 13. బలిచక్రవర్తి, 14. భార్గవుని, 15. వేదాంత దేశికులు

### సరైన సమాధానాలు రాసినవారు

1. జనమంచి జయశ్రీ, 2. సూరి సౌభాగ్యలక్ష్మి, 3. రామచంద్రుని ఇందిరాదేవి, 4. చింతలపాటి శివశంకరశాస్త్రి, 5. సి.హెచ్. కృష్ణకిషోర్, 6. రమాదేవి, 7. వేంకటేశ్వర్లు

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**చింతలపాటి శివశంకరశాస్త్రి**



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq